గురువారం
15•8•2019 | కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM /NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

• వెల. రూ.6.50 • సంపుటి 9 • సంచిక 51 • పేజీలు: 14 + 16







73వ
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



## జాతిని నడిపిన మహనీయులను మరువరాదు

- త్యాగధనుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో గవర్నర్ నరసింహన్

2

## ఆర్టికల్ 370 రద్దు.. కశ్మీరీలకే మేలు

- ప్రజలకు త్వరలోనే మార్పుల ఫలాలు
- ట్రిపుల్ తలాక్ రద్దుతో ఆడబిడ్డలకు ఊరట
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్



5

## అభినందన్‌కు వీర్‌చక్ర



- పాక్ యుద్ధవిమానాన్ని కూల్చిన వాయుసేన వింగ్ కమాండర్‌కు సమున్నత గౌరవం
- 'బాలాకోట్ ఆపరేషన్' పైలట్లు ఐదుగురికి పురస్కారాలు
- మిలిటరీ అవార్డులను ప్రకటించిన కేంద్రం



III

## తెలంగాణ పోలీసులకు అవార్డుల పంట

- అడిషనల్ డీజీ శ్రీనివాస్‌రెడ్డి, ఐజీ ప్రభాకర్‌రావుకు ప్రెసిడెంట్ పోలీస్‌మెడల్స్
- మరో పదిమందికి ఇండియన్ పోలీస్ మెడల్స్ ప్రకటించిన కేంద్ర హోంశాఖ
- అవార్డు గ్రహీతలను అభినందించిన డీజీపీ మహేందర్‌రెడ్డి



2

### కొత్త కంపెనీల చూపు

# హైదరాబాద్ వైపే



బుధవారం రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలోని జేఎల్‌ఎల్ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో కే తారక రామారావు

- 2019లో లక్షకోట్లు దాటిన ఐటీ ఎగుమతులు
- నగరంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- త్వరలోనే లుక్ ఈస్ట్ పాలసీని తీసుకొస్తాం
- మంచినీటి కొరత తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాలెడ్జ్‌సిటీలో జేఎల్‌ఎల్ కొత్త కార్యాలయ ప్రారంభం

## ఎమర్జింగ్ టెక్నాలజీస్‌హబ్‌గా రాష్ట్రరాజధాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ నగరం ఎమర్జింగ్ టెక్నాలజీస్ హబ్‌గా మారిందని, నగరంలో అన్ని వనరులూ సమృద్ధిగా ఉండటంతో కొత్త కంపెనీలన్నీ హైదరాబాద్‌లో యూనిట్లు స్థాపించేందుకు మొగ్గు చూపుతున్నాయని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. హైదరాబాద్‌లో అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమైందని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని జేఎల్‌ఎల్ రియల్‌ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ నూతన కార్యాలయాన్ని బుధవారం కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని మిగిలిన నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌కు వచ్చే కంపెనీలకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న కంపెనీలు మరింత విస్తరిస్తున్నాయని వివరించారు. గతంలో ఐటీరంగానికి బెంగళూరు కేంద్రంగా ఉండేదని, ప్రస్తుతం హైదరాబాద్ నగరం.. బెంగళూరును అధిగమించి ఐటీరంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడేనాటికి రూ.52 వేల కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులు, ఇప్పుడు రూ.1.09 లక్షల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. అభివృద్ధికి రవాణా వ్యవస్థే అతిపెద్ద సవాల్ అని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్‌లో 36% మాత్రమే ప్రజారవాణాను వినియోగిస్తున్నారని, దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఇందుకోసం హైదరాబాద్ మెట్రో రైలును ఎయిర్‌పోర్ట్ వరకు విస్తరించాలని ప్రతిపాదన ఉన్నట్టు తెలిపారు. నగరంలో

మిగతా 2వ పేజీలో



పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి దశదినకర్మ సందర్భంగా బుధవారం చల్లా కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా ఉన్నారు.

# వరంగల్‌కు గోదావరి జలాలు

- జిల్లాలోని చివరి ఆయకట్టువరకు సాగునీరు.. పుష్కలంగా ఉన్న నీటిలభ్యత
- సద్వినియోగంచేసుకోవడంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డికి నివాళి

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం గోదావరి జలాలతో సస్యశ్యామలం కానున్నదని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందనున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. నియోజకవర్గాలవారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు పూర్తి బాధ్యతలు తీసుకొని చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలని చెప్పారు. రెండుమూడు రోజుల్లో దిగువమానేరు డ్యాంకు నీళ్లు వస్తాయని.. వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్‌రూరల్ జిల్లా పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి మృతి చెందిన నేపథ్యంలో.. బుధవారం శాయంపేట మండలం ప్రగతిసింగారంలో ఎమ్మెల్యేను, ఆయన కుటుంబసభ్యులను సీఎం కేసీఆర్ పరామర్శించారు. అనంతరం

మిగతా 2వ పేజీలో




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 328.00 | రంగారెడ్డి | 328.00 |
| మెదక్ | 328.00 | కరీంనగర్ | 331.00 |
| వరంగల్ | 331.00 | చిల్లర ధర | 3.90 |




epaper.ntnews.com

నేడు రాఖీ పండుగ

# జాతిని నడిపిన మహనీయులను మరువరాదు

- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో గవర్నర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యసమరంలో ప్రాణాలర్పించిన త్యాగధనుల జీవితాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. దేశాన్ని బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి విముక్తి కలిగించటానికి కడవరకు పోరాడినవారిని స్మరించుకోవడం అందరి కర్తవ్యమని చెప్పారు. జాతిని నడిపి, నీతిని నిలిపిన మహనీయులను మరువరాదని గవర్నర్ తన సందేశంలో పేర్కొన్నారు.

### నేడు రాజ్‌భవన్‌లో రాఖీ దర్బార్

రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో రాఖీదర్బార్ నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు దర్బార్‌హాల్లో జరిగే వేడుకల్లో సాధారణ ప్రజలు పాల్గొనవచ్చని రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. గవర్నర్ నరసింహన్ దంపతులు ప్రజలకు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.



రాఖీ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం హైదరాబాద్ బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు





బుధవారం రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలో జేఎల్‌ఎల్ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, జేఎల్‌ఎల్ ఇండియా సీఈవో రమేశ్‌నాయర్ తదితరులు

# హైదరాబాద్ వైపే

మొదటిపేజీ తరువాయి...

ప్రోత్సాహకాలు, రాయితీలను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. నగరంలో మంచినీటి కొరత తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామని వెల్లడించారు. బిల్డర్లు, పారిశ్రామికవేత్తలందరూ రాష్ట్రప్రభుత్వానికి సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. ఐటీ, స్టార్టప్, లైఫ్ సైన్స్, ఏరోస్పేస్, బయోటెక్నాలజీ వంటి ఎన్నోరంగాలకు చెందిన కంపెనీల స్థాపనకు హైదరాబాద్ ఎంతో అనుకూలమైన ప్రదేశంగా మారిందన్నారు. ఐదేండ్లలోనే ఐటీ రంగం ఊహించని రీతిలో అభివృద్ధిని సాధించిందని చెప్పారు. జేఎల్ఎల్ ఇండియా సీఈవో రమేశ్‌నాయర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన అనతికాలంలోనే హైదరాబాద్ నగరం 10 వేల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించిందని తెలిపారు. మౌలిక, గృహ వసతుల కల్పన, రాష్ట్రంలో చేపడుతున్న సంస్కరణలే పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని స్పష్టంచేశారు. 2008-14 మధ్యకాలంలో రియల్‌ఎస్టేట్‌రంగంలో నగరానికి కేవలం రూ.1800 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయని, 2015-19 వరకు రూ.10 వేల కోట్లపైగా పెట్టుబడులను ప్రభుత్వం రాబట్టగలిగిందని వివరించారు. తెలంగాణ ఏర్పాటుతో హైదరాబాద్ నగరంలో వృద్ధి గణనీయంగా పెరిగిందన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు గోల్కొండకోటలో సీఎం కేసీఆర్ పతాకావిష్కరణ
- రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగం
- భారీ భద్రతాఏర్పాట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వేడుకల కోసం అధికారులు గోల్కొండ కోటను ముస్తాబుచేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, సచివాలయం, శాఖల ప్రధాన కార్యాలయాలు, అసెంబ్లీ తదితర చోట్ల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గోల్కొండ కోటలో జాతీయ జెండా ఎగురవేస్తారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. అనంతరం గోల్కొండ కోటకు వచ్చి పదిగంటలకు త్రివర్ణ పతాకావిష్కరణ చేస్తారు. గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించడానికి వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లుచేశాయి. పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లుచేశారు. ఎక్కడా ట్రాఫిక్ అంతరాయాలు ఎదురవకుండా చర్యలు తీసుకున్నారు. వేడుకలకు వచ్చే అతిథులు, ప్రజలు బ్యాగులు, వాటర్ బాటిల్స్ తీసుకురాకూడదని పోలీసులు సూచించారు. ఇదేతీరుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. జిల్లా కార్యాలయాలు, కూడళ్లను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాల్లో అధికారికంగా ఎవరెవరు జెండా ఎగురవేయాలో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాల్లో వేడుకలు జరుగనున్నాయి. రాష్ట్ర సచివాలయం బీఆర్కే భవన్‌కు తరలినందున చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బీఆర్కే భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తారు. ప్రస్తుతం పాక్షికంగా కార్యకలాపాలు నడుస్తున్న పాత సచివాలయంలో మరో భద్రతాధికారి జాతీయ జెండా ఎగురవేస్తారు.



స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విద్యుత్ కాంతుల్లో ధగధగలాడుతున్న చారిత్రక గోల్కొండ కోట

# వరంగల్‌కు గోదావరి జలాలు

మొదటిపేజీ తరువాయి...

జిల్లాకు చెందిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మరోమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపీ సంతోష్‌తో కలిసి.. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, వివిధ సంస్థల రాష్ట్ర చైర్మన్లు, ఇతర ముఖ్యనాయకులతో మాట్లాడారు. జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంలో ఎక్కడ కూడా సమస్య తలెత్తకుండా సమన్వయంతో ముందుకుసాగాలని సూచించారు. ఈసారి మంచి వర్షపాతం నమోదైందని.. జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందుతుందని.. కోనసీమను మరిపించేలా నీటి లభ్యత, పచ్చదనం పుణికిపుచ్చుకోనున్నదని సీఎం పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాకు చెందిన నియోజకవర్గాలవారీగా ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యులను కరీంనగర్‌కు తీసుకెళ్తామని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో దాదాపు గంటపాటు సీఎం సమావేశమయ్యారు.



పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు తదితరులు



బుధవారం ప్రగతిసింగారంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం శ్రీహరి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు

### చల్లా మల్లారెడ్డికి నివాళి

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి ఈ నెల 4వ తేదీన అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం దశదినకర్మను పురస్కరించుకుని సీఎం కేసీఆర్.. ఎంపీ సంతోష్, మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.50 గంటలకు ప్రగతిసింగారం చేరుకున్నారు. ధర్మారెడ్డి ఇంటికి వెళ్లి తొలుత మల్లారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబసభ్యులను ఒక్కొక్కరిగా పలకరించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనంచేశారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధులతో అక్కడే భేటీ అయి జిల్లా పరిస్థితులపై మాట్లాడారు. ఈ సమావేశంలో మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బాలస్వామి, బోడకుంటి వెంకటేశ్వర్లు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సత్యవతిరాథోడ్.. ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేశ్, రాజయ్య, శంకర్‌నాయక్, రెడ్యానాయక్ మాజీమంత్రి బస్వరాజు సారయ్య, మేయర్ గుండా ప్రకాశ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, బండా ప్రకాశ్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, గుండు సుధారాణి, జిల్లాపరిషత్ చైర్మన్లు గండ్ర జ్యోతి, శ్రీహర్షిణి, సుధీర్, బిందునాయక్, కుసుమ జగదీశ్వర్, రాష్ట్ర రైతు రుణ విమోచన సమితి చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ వైస్ చాన్స్‌లర్ సాంబయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ బొల్లె భిక్షపతి, లలితాయాదవ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, జిల్లా కలెక్టర్ ఎం హరిత, సీపీ డాక్టర్ విశ్వనాథ రవీందర్ ఉన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 3.44 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ తిరిగివెళ్లారు.

# గుత్తా ఎన్నిక లాంఛనమే

## ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎమ్మెల్యే కోటా శాసనమండలి ఉపఎన్నికకు మొత్తం ఇద్దరు నామినేషన్లు వేశారు. టీఆర్ఎస్ అభ్యర్థిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ వేయగా, శ్రమజీవి పార్టీ నుంచి బీ కొయల్కర్ చివరిరోజైన బుధవారం నామినేషన్ వేశారు. ఆయన నామినేషన్ పత్రాలపై ఎమ్మెల్యేలు సంతకాలు చేయలేదని తెలుస్తున్నది. దీంతో అది తిరస్కరణకు గురయ్యే అవకాశమున్నది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఈ నెల 19న సుఖేందర్‌రెడ్డి ఎన్నికను అధికారికంగా ప్రకటించనున్నారు.

# రుతుపవనాల మందగమనం

## 48 గంటల్లో ఓ మోస్తరు వానలు.. కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/సిటీబ్యూరో:** నైరుతి రుతుపవనాలు మందగమనంలో ఉన్నాయని, మూడ్రోజుల తర్వాత మళ్లీ పుంజుకునే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వాయుగుండం, ఉపరితల ఆవర్తనం కారణంగా 48గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. రాగల 24 గంటల్లో హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

### ముహూర్తం

సూర్యోదయం: 6.03 గంటలకు

సూర్యాస్తమయం: 6.38 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, పౌర్ణమి సాయంత్రం 6.01 వరకు, తదుపరి కృష్ణపక్షం పాడ్యమి, నక్షత్రం: శ్రవణం ఉదయం 8.03 వరకు, తదుపరి ధనిష్ఠ , అమృతఘడియలు: రాత్రి 11.17 నుంచి 12.53 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.55 నుంచి 3.30 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.17 నుంచి సాయంత్రం 4.58 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.32 నుంచి 2.08 వరకు.

### లోకం పోకడ



# తెలంగాణ పోలీసులకు అవార్డుల పంట

- అడిషనల్ డీజీ శ్రీనివాస్‌రెడ్డి, ఐజీ ప్రభాకర్‌రావుకు ప్రెసిడెంట్ పోలీస్‌మెడల్స్
- మరో పదిమందికి ఇండియన్ కేంద్ర హోంశాఖ పోలీస్ మెడల్స్
- అవార్డు గ్రహీతలకు డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందన





గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ టీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన పోలీసులకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తమ సేవా పోలీస్ పతకం, భారత పోలీస్ సేవా పతకాలను ప్రకటించింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ విడుదలచేసిన జాబితాలో తెలంగాణకు చెందిన 12 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి చోటుదక్కింది. విశిష్ట సేవలందించినందుకు ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి పోలీస్ పతకాలు గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ టీ ప్రభాకర్‌రావుకు దక్కాయి. మరో పదిమందికి భారత పోలీస్ పతకాలు లభించాయి. అవార్డుగ్రహీతలను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అభినందించారు.

### ఇండియన్ పోలీస్ మెడల్స్‌కు ఎంపికైన అధికారులు వీరే

ఎం రమేశ్ (ఎస్పీ/ కమాండెంట్, టీఎస్ఎస్పీ ఫస్ట్ బెటాలియన్), మహ్మద్ గౌస్‌మొయినుద్దీన్ (అడిషనల్ ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్, జోగుళాంబ గద్వాల జిల్లా), ఆర్ బాలరంగయ్య (డీఎస్పీ, వరంగల్), కే బాలరామిరెడ్డి (డీఎస్పీ, సీఐడీ), వై రాంబాబు (డీఎస్పీ, అసిస్టెంట్ కమాండెంట్, టీఎస్‌పీఏ). ఏ వెంకటరామయ్య (ఇన్‌స్పెక్టర్, గ్రేహౌండ్స్), ఎస్ఏ సత్తార్ (ఇన్‌స్పెక్టర్, టీఎస్ఎస్పీ, 4వ బెటాలియన్), జీ మధు సూదన్ (ఏఎస్సై, చార్మినార్), ఎన్ హనుమంత్‌గౌడ్ (హెచ్‌సీ 2476, నార్సింగి పోలీస్‌స్టేషన్), టీ వెంకటేశ్వర్లు, (ఏఆర్ హెచ్‌సీ 1341, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్).

### ఇద్దరు ఆర్పీఎఫ్ అధికారులకు పతకాలు

రైల్వే రక్షక దళానికి (ఆర్పీఎఫ్) చెందిన ఇద్దరు అధికారులు పోలీస్ పతకాలకు ఎంపికయ్యారు. పురస్కారాలకు ఎంపికైన డిప్యూటేషన్‌పై ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బీ సతీశ్‌బాబు, డిప్యూటేషన్‌పై ఐఆర్‌సీటీసీలో విజిలెన్స్ ఆఫీసర్‌గా ఉన్న ఎన్ అశ్వినీకుమార్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్య అభినందించారు.

### ముగ్గురికి ఫైర్ సర్వీస్ మెడల్స్

రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల విభాగంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రీజనల్ ఫైర్ ఆఫీసర్ జీవీ నారాయణరావు, హన్మకొండ లీడింగ్ ఫైర్‌మన్ మల్లికార్జున్‌యాదవ్, నర్సంపేట లీడింగ్ ఫైర్‌మన్ దయాకర్‌కు ఫైర్ సర్వీస్ మెడల్స్ దక్కాయి.

### జైళ్లశాఖలో ఇద్దరికి అవార్డులు

రాష్ట్ర జైళ్లశాఖలో చంచల్‌గూడ సెంట్రల్‌జైలులో చీఫ్‌హెడ్‌వార్డర్ పీ భిక్షపతి, జైళ్లశాఖ డీజీ కార్యాలయంలో హెడ్‌వార్డర్ ఎస్ కృష్ణయ్యకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి.



గుంటూరు జిల్లాలో కృష్ణానది కరకట్టపై చంద్రబాబు ఉంటున్న నివాసం చుట్టూ చేరిన వరద నీరు

# కృష్ణా నీటి వరదలో చంద్రబాబు నివాసం

- ఇంట్లో కిందిభాగంలోకి చేరిన నీరు
- సామగ్రిని మేడపైకి తరలిస్తున్న సిబ్బంది
- నివాసం వెనుక వైపు ఇసుక బస్తాలతో వరదకు అడ్డుకట్ట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్షనేత చంద్రబాబుకు ముంపు గ్రహణం పట్టుకుంది. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు పోటెత్తుతుండటంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. కృష్ణానది కరకట్టపై చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ నిర్మాణం చుట్టూ వరద నీరు చేరింది. వరద ఎక్కువగా రావడంతో కిందిభాగంలో ఉన్న వస్తువులను మేడపైకి తరలిస్తున్నారు. చుట్టూ నీరుచేరి సెల్లార్ మునిగింది. ఇక్కడి సామాన్లను మొదటి అంతస్తుపైకి తరలించారు. ప్రస్తుతం ఆయన నివాసంలో లేరు. నివాసంలోకి నీరు చేరకుండా ఇంటివెనుకవైపు సిబ్బంది ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. నివాసం చుట్టూ పూర్తిగా నీరుచేరడంతో బాబు కాన్వాయ్‌ను అమరావతిలోని హ్యాపీ రిసార్ట్స్‌కు తరలించారు.

### కరకట్టను పరిశీలించిన ఏపీ మంత్రులు

కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఏపీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాస్ బుధవారం సాయంత్రం వరకు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రులతోపాటు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాతీరంలోని పలు ప్రాంతాల్లో ఆరు హెచ్చరికలు జారీచేశామని, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. నాగాయలంక, కంచికర్ల, భవానీపురం ప్రాంతాలు ఎక్కువ ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. కృష్ణానదికి వరదలు వస్తే చంద్రబాబు ఇంటికి ప్రమాదమున్నదని సీఎం జగన్ ముందే చెప్పారని, దీన్ని అప్పుడు రాజకీయ కోణంలో చూశారని పేర్కొన్నారు. ఇప్పుడు వరదలో నివాసం మునుగుతుందని, చంద్రబాబు హైదరాబాద్ పారిపోయారని విమర్శించారు. లింగమనేని గెస్ట్‌హౌస్ నదీగర్భంలో అక్రమంగా నిర్మించినట్టు వరద నీరు పోటెత్తడంతో మరోసారి రుజువైందని చెప్పారు. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులోనైనా చంద్రబాబు ఈ అక్రమ కట్టడాన్ని ఖాళీ చేయకతప్పదన్నారు.



గత జనవరిలో సాయిరాంను కేటీఆర్ దగ్గరకు తీసుకెళ్లిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ (ఫైల్)



చికిత్స అనంతరం బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్ ఎదుట నడిచి సంబురపడుతున్న సాయిరాం



ఎల్వోసీ మంజూరు పత్రంతో రామస్వామి

# మనసున్న మారాజు కేటీఆర్

**ప్రత్యేక ప్రతినిధి/గోదావరిఖని, నమస్తే తెలంగాణ/సిరిసిల్ల రూరల్:** ఎముకల లోపం వల్ల దొడ్డికాళ్లతో ఇబ్బందిపడుతున్న సాయిరాం అనే బాలుడికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగానిలిచి శస్త్రచికిత్స జరిపించారు. ఆపరేషన్ తర్వాత సాయిరాం తన కుటుంబసభ్యులతో వెళ్లి బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. అతడి యోగక్షేమాలు తెలుసుకున్న కేటీఆర్.. బాలుడు ఎవరి సాయం లేకుండానే నడుస్తుండటంతో ఆనందం వ్యక్తంచేశారు. కేటీఆర్, ఎమ్మెల్యే కే చందర్ సాయాన్ని తాము మరిచిపోమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని సాయిరాం తల్లిదండ్రులు లక్ష్మి, మల్లేశ్ పేర్కొన్నారు. బాలుడికి ఇబ్బంది తొలిగిపోవడం పట్ల కేటీఆర్ ట్విట్టర్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. సాయిరాం శస్త్రచికిత్సకు ముందు తర్వాత సాయిరాం ఉన్న ఫొటోలను షేర్‌చేశారు. సాయిరాం విషయంలో కేటీఆర్ వ్యవహరించిన తీరు తన హృదయాన్ని కదిలించిందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశంసించారు. కాగా, నగరంలో ట్రాఫిక్ రద్దీ సమయాల్లో కూడా సాధారణ వ్యక్తిలా కేటీఆర్ ప్రయాణించడంపై రాకేశ్ వర్మ అనేవ్యక్తి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఇలాగే ప్రయాణించానని బదులిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన గొర్ల కాపరి కాసాని రామస్వామికి (52) కాళ్లు చచ్చుబడటంతో నెలక్రితం నిమ్స్‌లో చూపించగా వైద్యులు పరీక్షించి, కాళ్లలో రక్త ప్రసరణ నిలిచిపోయిందని తెలిపారు. ఆపరేషన్ చేసి, స్టంట్స్ వేయాల్సి ఉంటుందని సూచించారు. ఇందుకు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో రామస్వామి కుటుంబసభ్యులు.. సమస్యను టీఆర్ఎస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయీద్‌ఖాన్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం రామస్వామికి కేటీఆర్ చొరవతో రూ.లక్ష ఎల్వోసీ మంజూరు పత్రాన్ని అందజేశారు.



గేట్లు ఎత్తిన నాగార్జున సాగర్ వరద దృశ్యాన్ని తిలకిస్తున్న సందర్శకులు.. వేలాదిగా సందర్శకులు రావడంతో ట్రాఫిక్ జాం ఏర్పడిన దృశ్యం (పక్క చిత్రం)



నేడు రాఖీ పండుగ



# జలభాండాగారాలు

- నిండుగా శ్రీశైలం, నాగార్జునసాగర్
- తెలుగురాష్ట్రాల్లో కృష్ణమ్మ జలజాతర
- చిన్న ప్రాజెక్టులు, చెరువులకు జలకళ

జలాభిషేకం

**హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

ప్రాజెక్టులకు జలకళ వస్తుందా! అనే సందేహాల్ని పటాపంచలు చేసిన కృష్ణమ్మ.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులను నిండుకుండల్లా మార్చివేసింది. రెండు ప్రధాన జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్.. కృష్ణానీటితో జలభాండాగారాలను తలపిస్తున్నాయి. శ్రీశైలం, సాగర్‌ల నుంచి విడుదలచేసిన నీటితో పలు చిన్నచిన్న ప్రాజెక్టులు, పెద్దసంఖ్యలో చెరువులు సైతం జలకళ సంతరించుకుంటున్నాయి. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద స్వల్పంగా తగ్గినప్పటికీ.. అవుట్‌ఫ్లో స్థిరంగానే కొనసాగుతున్నది. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు భారీ ఇన్‌ఫ్లోలు వస్తూనే ఉన్నాయి. శ్రీశైలంలో పదిగేట్లు, నాగార్జుసాగర్‌లో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ఎగువన ఆల్మట్టి జలాశయానికి మూడురోజుల కిందటి వరకు ఆరు లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద వస్తుండగా.. బుధవారం ఉదయం నుంచి స్వల్పంగా తగ్గుతూ సాయంత్రం ఆరు గంటలకు ఇన్‌ఫ్లో 5.35 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. దిగువకు 5.70 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపురకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతున్నది. ఉజ్జయిని నుంచి వస్తున్న వరద కూడా గణనీయంగా తగ్గింది. అయితే మూడురోజుల కిందటివరకు ప్రధాన కృష్ణాతోపాటు భీమా నుంచి వచ్చిన వరదతో జూరాలకు 7.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. ఇప్పుడు ఇందులో స్వల్ప తగ్గుదల మొదలైందని స్పష్టమవుతున్నది. తుంగభద్ర నుంచి కూడా అవుట్‌ఫ్లో భారీగానే తగ్గింది.

### శ్రీశైలానికి 8.63 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బుధవారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీశైలం జలాశయానికి 8.63 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా ఆంధ్రప్రదేశ్ 35 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నది. హంద్రీనీవా నుంచి 2,025 క్యూసెక్కులు తీసుకుంటున్నారు. కుడిగట్టు విద్యుత్‌కేంద్రం ద్వారా 31,749 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 38,140 క్యూసెక్కుల నీటితో కరంటును ఉత్పత్తి చేయటంతోపాటు.. పదిగేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా కూడా భారీగా జలాలను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో నాగార్జునసాగర్ వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపంలో కనిపిస్తున్నది. పదేండ్ల తర్వాత సాగర్‌కు ఈ స్థాయిలో వరద రావటంతో పర్యాటకుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఎగువనుంచి భారీగా వరద వస్తుండటంతో ప్రధాన విద్యుత్ కేంద్రంలో కరంటు ఉత్పత్తి జోరుగా కొనసాగుతున్నది. నదిలోకి 4.46 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని వదులుతున్నారు. మరోవైపు కుడి కాల్వకు 6,324 క్యూసెక్కులు, ఎడమకాల్వకు 8,193 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 2,400 క్యూసెక్కుల డిశ్చార్జి కొనసాగుతున్నది. లోలెవల్ కెనాల్‌లోనూ గ్రావిటీ ద్వారా దాదాపు 600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో నల్లగొండ జిల్లా పరిధిలోని చెరువుల్లోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. నెలాఖరు వరకు ప్రాజెక్టు పరిధిలోని దాదాపు అన్ని చెరువులను నింపుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలాఉంటే.. ఇన్‌ఫ్లో తగ్గుతుండటంతో నాగార్జునసాగర్ నుంచి అవుట్‌ఫ్లోను కూడా నియంత్రిస్తున్నారు. మంగళవారం వరకు 26 గేట్లను 27 అడుగుల మేర ఎత్తగా.. బుధవారం గేట్ల ఎత్తును 14 అడుగులకు తగ్గించారు.

### పులిచింతల నుంచి కడలిలోకి వయా ప్రకాశం బరాజ్

నాగార్జునసాగర్ నుంచి భారీ వరద వస్తుండటంతో పులిచింతల రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని పెంచుతూనే దిగువకు కూడా పెద్దఎత్తున నీటిని విడుదలచేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి పులిచింతలకు 5.95 లక్షల పైచిలుకు క్యూసెక్కుల వరద వస్తుండగా.. దిగువకు 3.70 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు.

**వివిధ ప్రాజెక్టులలో బుధవారం నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1701.12 | 129.72 | 109.34 | 5,35,185 | 5,70,000 |
| నారాయణపుర | 1615.00 | 1605.61 | 37.64 | 25.76 | 5,80,000 | 5,86,240 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 12,351 | 15,950 |
| జూరాల | 1045.00 | 1038.45 | 9.66 | 5.97 | 7,20,000 | 7,14,000 |
| తుంగభద్ర | 1633.00 | 1632.80 | 100.86 | 99.89 | 1,25,151 | 71,720 |
| శ్రీశైలం | 885.00 | 881.60 | 215.81 | 197.01 | 8,63,380 | 8,62,638 |
| నాగార్జునసాగర్ | 590.00 | 583.40 | 312.05 | 291.66 | 6,23,727 | 4,63,449 |
| పులిచింతల | 175.00 | 169.28 | 45.77 | 37.36 | 5,01.967 | 3,76,356 |
| సింగూరు | 1717.93 | 1670.51 | 29.91 | 0.46 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.34 | 17.80 | 0.14 | - | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1062.80 | 90.31 | 17.04 | 740 | 389 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.85 | 24.07 | 3.52 | - | 204 |
| మిడ్ మానేరు | 1043.31 | 993.86 | 25.873 | 3.60 | 629 | 83 |
| కడెం | 700.00 | 697.20 | 7.60 | 6.89 | 1,148 | 808 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.78 | 20.18 | 19.51 | 7,722 | 0 |



నాగార్జునసాగర్ వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న సందర్శకులు



బుధవారం శ్రీశైలం పదిగేట్ల నుంచి దుంకుతున్న కృష్ణా జలాలు

# ప్రాణహితకు మళ్లీ వరద

- కాళేశ్వరం వద్ద ఉప్పొంగుతున్న గంగమ్మ
- లక్ష్మీ బరాజ్‌కు భారీగా ఇన్‌ఫ్లో నమోదు
- మధ్యమానేరుకు 'కాళేశ్వరం' జలాలు

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మహారాష్ట్రలో కురిసిన వర్షంతో ప్రాణహిత నుంచి గోదావరిలోకి మళ్లీ భారీగా వరద వస్తున్నది. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరిలో నీటిప్రవాహం పెరిగింది. బుధవారం ఉదయం 56వేల క్యూసెక్కులున్న ప్రవాహం.. సాయంత్రానికి 5.70 లక్షల క్యూసెక్కులకు చేరింది. ఫలితంగా కాళేశ్వరం వద్ద గోదావరి 9.60 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్నది. ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నదని సాగునీటిశాఖ ఇంజినీర్లు తెలిపారు. లక్ష్మీ బరాజ్ (మేడిగడ్డ) వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 1.63 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. బరాజ్‌లో 32 గేట్లు ఎత్తారు. సరస్వతి బరాజ్ (అన్నారం)కు ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లన్నీ మూసివేశారు. సరస్వతి బరాజ్‌లో 7.20 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఈఈ యాదగిరి తెలిపారు. పేరూరు మీదుగా వరద ప్రవాహం 4.23 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. దిగువన ఏపీలోని ధవళేశ్వరం వద్ద సాయంత్రం ఆరుగంటల సమయానికి నాలుగున్నర లక్షల క్యూసెక్కులకు తగ్గింది. అంతేస్థాయిలో గోదావరి జలాల్ని సముద్రంలోకి వదులుతున్నారు. ఈ నీటిసంవత్సరంలో ఇప్పటివరకు సముద్రంలో కలిసిన గోదావరిజలాల పరిమాణం 1,305 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువన శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా 740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కడెంకు కూడా వరద తగ్గుముఖం పట్టింది. ఎల్లంపల్లి జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతున్నది. పార్వతి బరాజ్ (సుందిల్ల)లో 6.412 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ బరాజ్ నుంచి ఎగువకు 30.50 కిలోమీటర్ల మేర గోదావరి జలకళతో సజీవంగా ఉంది.

### మధ్యమానేరుకు 'కాళేశ్వరం' జలాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు జలాశయానికి కాళేశ్వరం జలాలు చేరాయి. ఎనిమిదో ప్యాకేజీ నుంచి ఉప్పొంగి, గ్రావిటీ కెనాల్ నుంచి వరదకాల్వ ద్వారా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చిచేరాయి. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లో గత ఆదివారం నుంచి దఫదఫాలుగా నాలుగు, ఐదు మోటర్ల వెట్ ట్రయల్‌రన్ చేస్తున్నారు. బుధవారం రాత్రి కూడా ఈ రెండు మోటర్లకు ట్రయల్ వెట్‌రన్ నిర్వహించారు. రాత్రి 10.05 గంటలకు ఐదో మోటర్‌ను, 10.30 గంటలకు నాలుగో మోటర్‌ను ఆన్‌చేశారు. రెండు పంపుల ద్వారా వచ్చిన జలాలు డెలివరీ పాయింట్ నుంచి 5.7 కిలోమీటర్ల గ్రావిటీ కాల్వ ద్వారా ప్రవహించి వరద కాల్వలోకి చేరి.. మధ్యమానేరు జలాశయం దిశగా ప్రవహించాయి. మధ్యాహ్నం 2గంటల వరకు 2,600 క్యూసెక్కులు చేరినట్లు అధికారులు తెలిపారు. మధ్యమానేరుకు నీరు రావడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గాయత్రిపంప్‌హౌస్ వద్ద జలాలు ఉబికి వస్తున్న దృశ్యాన్ని పలువురు వీక్షించారు.



కాళేశ్వరం 8వ ప్యాకేజీ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా మధ్య మానేరుకు చేరిన జలాలు



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న తాత్కాలిక సచివాలయం బీఆర్కే భవన్

### కృష్ణమ్మకు జల హారతి



పరవళ్లు తొక్కుతూ ఉరకలేస్తున్న కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, వస్త్రాలతో సంప్రదాయబద్ధంగా జోగులాంబ గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే వీఎం అబ్రహంలు బుధవారం సంధ్యా సమయంలో వాయనం సమర్పించారు. పూజాకార్యక్రమాల అనంతరం నదిలో సంధ్యాదీపం వదిలారు. - అలంపూర్, నమస్తే తెలంగాణ








**TS PECET-2019 ADMISSIONS**
**TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION, HYDERABAD**
**NOTIFICATION**
**Certificate Verification & Option Exercising for Web Based Counseling**

The qualified candidates of **TS PECET-2019** for admission into **D.P.Ed.** and **B.P.Ed. courses** in Telangana State are informed that certificate verification and option entry will commence from **26th August, 2019** onwards in the two helpline centers Nizam College, Basheerbagh, Hyderabad and Director of PG Admissions, Kakatiya University, Warangal. For more information refer the detailed notification available on the website: **https://pecet.tsche.ac.in/ or http://pecetadm.tsche.ac.in**

Place :Hyderabad
Date: 15-08-2019

Convener
TS PECET-2019 Admn.





జమ్ముకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితి పట్ల నేను పూర్తి సంతృప్తితో ఉన్నా. 2016లో అయితే బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ తర్వాత ఒక వారం రోజుల్లోనే నలభై మంది చంపివేయబడినారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రజలు ప్రశాంతంగా పరిస్థితికి అలవాటు పడుతున్నారు.

**సత్యపాల్ మాలిక్, జమ్ముకశ్మీర్ గవర్నర్**



చిరకాల మిత్రదేశం భారత్ అంతర్గత వ్యవహారాల్లో మనం జోక్యం చేసుకోరాదు. అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారత్ నిర్ణయాలను గౌరవిద్దాం. పాక్-భారత్ అంతర్గత విషయాల్లో మూడో దేశం జోక్యం చేసుకోరాదు. బ్రిటన్ లేబర్ పార్టీ పూర్తిగా భారత్ వ్యతిరేకపార్టీగా మారిపోయింది.

**బాబ్ బ్లాక్‌మ్యాన్, కన్జర్వేటివ్ పార్టీ నేత, బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడు**



నేడు రాఖీ పండుగ

**చరిత్రలో నేడు**



**1945**

రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ ఓటమి. ముగిసిన యుద్ధం.

**1950**

ఐక్య రిపబ్లిక్‌గా ఇండోనేషియా. మొదటి అధ్యక్షుడిగా సుకర్ణో.





**1969**

న్యూయార్క్‌లో 'వుడ్‌స్టాక్ మ్యూజిక్ ఫేర్' ప్రారంభం. జనాన్ని ఉద్దేశించి ప్రసంగించిన స్వామి సచిదానంద.

భారత ప్రభుత్వం వివిధ రంగాల్లోని 27వేల మంది సైనిక బలగాలను తగ్గించటం ద్వారా 1600 కోట్ల రూపాయల మేర ఆదా అవుతుందని భావిస్తున్నది. దేశవ్యాప్తంగా వివిధ సైనిక విభాగాల్లో 1.75లక్షల మంది అధికారులు, సైనికులు పనిచేస్తున్నారు. ఇందులో 1.5లక్షల మందిని తగ్గించటం ద్వారా ఏడువేల కోట్ల రూపాయలు ఆదా చేయాలని ఆశిస్తున్నారు. దేశ రక్షణ బడ్జెట్‌లో 83శాతం నిధులు రోజువారీ కార్యకలాపాలు, జీత భత్యాల కే ఖర్చయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మిలిటరీరంగాన్ని టెక్నాలజీ, ఆయుధ పరంగా ఆధునీకరించినప్పడే సైనిక బలం పరిపుష్టమవుతుంది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

యెమెన్‌లో తిరుగుబాటు జెండా ఎగురేసిన షియా హౌతీలు దేశరాజధాని 'సనా'తో పాటు యెమెన్ మెజారిటీ భూభాగాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని పారదోలటానికి సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణసేనలు నాలుగేండ్లుగా పోరాడుతున్నా ఫలితం లేకుండాపోయింది. నిన్నటి దాకా సంకీర్ణసేనల పక్షాన నిలిచి హౌతీలపై పోరాటం చేసిన ఎస్‌టీసీ సేనలు ఎదురు తిరిగాయి. రాజధాని కేంద్రంలోని రాజప్రసాదాలు, విమానాశ్రయాలను ఆక్రమించి విముక్తి ప్రాంతంగా ప్రకటించుకున్నాయి. దీంతో సౌదీ సంకీర్ణ సేనలు ఆత్మరక్షణలో పడిపోయి తీవ్రసంక్షోభంలో చిక్కుకున్నాయి.

**ది హిందూ**



# స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు

నేడు 15 ఆగస్టు! దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గర్వంగా జరుపుకుంటున్నాం. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిన తరువాత కూడా ఈ జాతీయ పండుగను గర్వంగా జరుపుకోగలుగడమే మన దేశ ప్రజల గొప్పతనం. ఈ ఏడు దశాబ్దాలకు పైగా కాలంలో దేశం ఆశించిన మేర అభివృద్ధి చెంది ఉండకపోవచ్చు. మన ముందు మరెన్నో ఆకాంక్షలు ఉండవచ్చు. అయినా మనం సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమే మన ప్రజల ఘనత. మత కలహాలు రాజుకుని అభివృద్ధికి నోచుకోలేని రాజ్యాలు ఎన్నో ఉన్నాయి. కానీ సామ్రాజ్యవాదశక్తులకు కన్నుకుట్టే విధంగా లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను మనం పరిరక్షించు కుంటున్నం. ఆహారరంగంలో స్వావలంబనే గొప్పగా భావిస్తున్న దశను దాటి అంతరిక్షంలోకి తొంగిచూస్తున్నం. ఇటీవలి వరకు ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ మొదలైనవి బలపడ్డాయి. సజావుగా దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే వెలుగు వెంట చీకటిలా ప్రపంచంలోనే గొప్ప ఆర్థికశక్తిగా ఎదుగుతున్నప్పటికీ, దేశంలో ఇంకా పేదరికం, ప్రాంతీయ సామాజిక అసమానతలు తొలిగిపోలేదు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. స్వావలంబన విధానాలు ప్రాధాన్యం పొందడం లేదు. నదీ జలాలను, సహజవనరులను పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాం. ప్రజాస్వామిక వ్యవస్థలను బలహీనపరిచే పోకడలు కూడా ఇటీవల పెరిగిపోయాయి. ఈ పోకడల పట్ల తక్షణం అప్రమత్తం కాకపోతే దీర్ఘకాలంలో ప్రజాస్వామిక మౌలిక స్వభావం దెబ్బతినే ప్రమాదం ఉన్నది.

రాజ్యాంగంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అని రాసుకున్నంత మాత్రాన సరిపోదు. ప్రజాస్వామిక స్వభావం ప్రభుత్వంలో ఉండాలె, ప్రజలలో కనిపించాలె. సమాజంలో సామరస్య జీవన విధానం నెలకొని ఉండాలె. కానీ ఇటీవల దేశవ్యాప్తంగా విద్వేష దాడులు పెరిగిపోతున్నాయి. అల్ప సంఖ్యాక, బలహీనవర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయి. కొన్నివర్గాల ఆహార అలవాట్లను కూడా ఆక్షేపించే ఆధిపత్య ధోరణి పేట్రేగిపోతున్నది. మహిళల వేషధారణను కూడా కొన్ని మూకలు శాసించే పరిస్థితి ఏర్పడ్డది. దేశ ప్రజాస్వామిక స్వభావాన్ని దెబ్బతీయడానికి విచ్ఛిన్నశక్తులు ఎప్పుడూ పొంచి ఉంటాయి. దేశ సమైక్యతను దెబ్బతీయడానికి పరాయి దేశాల కుట్ర లు సాగుతుంటాయి. కానీ సమాజంలో ప్రజాస్వామిక సంస్కృతిని పెంచి కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. రాజ్యాంగ స్వభావానికి, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలకు, లౌకికత్వ విలువలకు విరుద్ధంగా తలెత్తే వికృత పోడకలను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉంటుంది. కానీ కొన్ని రాజకీయశక్తులే ఈ విభజన భావనలను ప్రేరేపించడం మరింత దారుణం. మన దేశం పాశ్చాత్యదేశాలకు దీటుగా ఆధునిక రాజ్యంగా ఎదుగుతున్న దశలో ఆయవుపట్టులో దెబ్బకొట్టినట్లు మతవిద్వేషాలు చెలరేగడం అభిలషణీయం కాదు. కుల, మత విద్వేషాలు సమాజాన్నే కాదు, ఆర్థికవ్యవస్థను కూడా దెబ్బతీస్తాయి. సమాజాన్ని కల్లోల పరిచి, ఆర్థిక సుస్థిరత, పారిశ్రామిక ప్రగతి సాధించడం అసాధ్యం.

> **కేంద్రంలో బలమైన జాతీయ పక్షం అధికారం చేపట్టినంత మాత్రాన మన సమాఖ్య స్వభావానికి భంగం కలుగదనే భరోసా ఇవ్వడానికి బదులు రాష్ట్రాల హక్కులను హరించడం పెడధోరణి. అన్నిజాతులు, భాషలు, సంస్కృతులు వికాసం చెందడమే దేశానికి బలం చేకూరుస్తుంది. అన్నిజాతులు, సంస్కృతులు, మతాల వారు శాంతియుత సహజీవనం చేసినప్పుడే స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు నెరవేరినట్టు.**

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఐదారువందల సంస్థానాలను విలీనం చేసుకోవడమే కాదు, దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న భిన్న జాతుల అస్తిత్వ కాంక్షలను తీర్చడం కోసం కొత్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణను చేపట్టవలసి వచ్చింది. తెలంగాణను ఏపీతో విలీనం చేయడం వంటి ఘోర తప్పిదాలు కొన్ని జరిగినప్పటికీ, పునర్వ్యవస్థీకరణ కచ్చితంగా ఒక ప్రజాస్వామిక ప్రక్రియ. దీనివల్ల దేశానికి కొత్తరూపు వచ్చింది. సమాఖ్య తత్వానికి పునాది పడ్డది. తెలంగాణ ఏర్పాటు వల్ల చేసిన తప్పిదాన్ని చక్కదిద్దుకోవడమే కాదు, ప్రజల ఆకాంక్షలు ప్రజాస్వామిక పద్ధతిలో నెరవేరుతాయనే భరోసా ఇచ్చినట్టయింది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు కూడా ఏర్పడటంతో వారి అస్తిత్వ కాంక్షలను గుర్తించినట్టయింది. ఇంకా ముందే ఈశాన్యంలో పలు చిన్న రాష్ట్రాలు ఏర్పడ్డాయి. సామాజిక బహుళత్వం అనివార్యంగా రాజకీయ రంగాన్ని ప్రభావితం చేసింది. దేశవ్యాప్తంగా అనేక కొత్తపార్టీలు ఆవిర్భవించాయి. ఈ క్రమంలో దేశం సమాఖ్య స్వరూపాన్ని సంతరించుకుంటున్నదనే వ్యాఖ్యానాలు వినిపించాయి. బీజేపీ 2014లో అధికారానికి వచ్చిన తరువాత మోదీ భాషణలు ఇందుకు బలం చేకూర్చాయి. కానీ మోదీ రెండవ పర్యాయం ప్రధాని పదవి చేపట్టిన తరువాత మాత్రం కేంద్రీకృత పోకడలు కనిపిస్తున్నాయి. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కొన్ని బిల్లులు ఇందుకు ఉదాహరణ. కేంద్రంలో బలమైన జాతీయ పక్షం అధికారం చేపట్టినంత మాత్రాన మన సమాఖ్య స్వభావానికి భంగం కలుగదనే భరోసా ఇవ్వడానికి బదులు రాష్ట్రాల హక్కులను హరించడం పెడధోరణి. అన్నిజాతులు, భాషలు, సంస్కృతులు వికాసం చెందడమే దేశానికి బలం చేకూరుస్తుంది. అన్ని జాతులు, సంస్కృతులు, మతాల వారు శాంతియుత సహజీవనం చేసినప్పుడే స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు నెరవేరినట్టు. రాజకీయశక్తులు, చైతన్యవంతమైన ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది.

**జనగళం**

## వందే మాతరం



త్రివర్ణ పతాకం ఎగిరింది
నీలి నింగిలో మెరిసింది
భారతీయతను జగతికి చాటగ
స్వేచ్ఛగ రెపరెపలాడింది
వందే మాతరం.. వందేమాతరం..

కృష్ణార్జునులే రథ సారథులుగ
భగవద్గీతను బోధించింది
సకల మతములకు సమత్వమిచ్చి
లౌకిక బాటన నడిచింది
స్వతంత్రయోధుల బలిదానాలకు
ప్రతీకగా వెలుగొందింది
వందే మాతరం.. వందేమాతరం..

రైతు రాజుగ మారే వరకు
కంకణబద్ధురాలయింది
బడుగుల బతుకులు బాగు పర్చగా
చిత్తశుద్ధితో మెలిగింది..
ప్రజాక్షేమమే పరమార్థమ్మని
త్రికరణముల నెరనమ్మింది
వందే మాతరం.. వందేమాతరం..

దేశదేశములకు ఆదర్శంగా
విదేశాంగమే నెరిపింది
దురాక్రమణల ఇరుగుపొరుగుల
గుణపాఠాలే నేర్పింది
జనగణమన అధినాయక గీతం
లోకమంతటికి మేల్కొల్పయింది
వందే మాతరం.. వందేమాతరం..

**-గొల్లపెల్లి రాంకిషన్, 9849693324**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# ఫెడరలిజంపై తాజా చర్చ

**కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్ విషయంలో తీసుకున్న చర్యల దరిమిలా ఫెడరలిజంపై తిరిగి చర్చ జరుగుతున్నది. ఈ చర్యలు కేంద్రీకరణను మరింతగా పెంచి రాష్ట్రాల ఫెడరల్ అధికారాలను తగ్గించగలవన్నది ఒక అభిప్రాయం. ఫెడరలిజాన్ని సాధారణ రూపంలో బలపరుస్తూ వస్తున్న ప్రజలు ఈ పరిణామాలతో కేంద్రీకరణవైపు మొగ్గుచూపుతున్నారన్నది మరొక అంచనా. ఇవి స్థూల దృష్టితో కూడిన అభిప్రాయాలా, లేక సమాజంలోని లోతైన పరిణామక్రమాలను(డీప్ ప్రాసెసెస్) గమనించిన మీదట ఏర్పరచుకున్నవా అనేది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన సీరియస్ విషయం.**

సమాజంలో గాని,రాజకీయాలలో గాని ఎప్పుడైనా దీర్ఘకాలికమైన, లోతైన పరిణామక్రమాలు ఒక స్థాయిలో జరుగుతుంటాయి. స్వల్పకాలికమైన, వర్తమానానికి పరిమితమైన పరిణామాలు మరొక స్థాయిలో సంభవిస్తుంటాయి. ఈ రెండు విధాలైన వాటికి సంబంధం ఎంతో కొంత ఉంటుంది. వాటి మధ్య పరస్పర ప్రభావాలు ఉంటాయి. అది కొన్ని విషయాలలో ఎక్కువ ఉండవచ్చు, కొన్ని విషయాలలో తక్కువ కావచ్చు. అది ఆయా విషయాలపై, పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఇపుడు మనం భారతదేశపు దీర్ఘకాలికమైన, లోతైన ఫెడరలిస్టు క్రమాన్ని, జమ్ముకశ్మీర్‌కు సంబంధించి కేంద్రప్రభుత్వం తీసుకున్న చర్యలను, ఈ రెండింటి ప్రాముఖ్యాలను, పరస్పర ప్రభావాలను ఈ వెలుగులో పరిశీలించవలసి ఉంటుంది. అపుడు గాని కశ్మీర్ చర్యలు ఫెడరలిజాన్ని కుంచింపజేస్తాయనే భావన నిజమా కాదా అన్నది అర్థం కాదు.

ప్రభుత్వం కశ్మీర్ విషయమై తీసుకున్న చర్యలు ఆ రాష్ట్ర ఫెడరల్ హక్కులు, అధికారాలను కుంచింపజేసే మాట నిజం. అక్కడి ప్రజలకు ఇంత కాలం ఉండిన పూర్తిస్థాయి రాష్ట్ర అధికారాలు ఇక ఉండవు. ఇది తాత్కాలికమైన మార్పు అని, పరిస్థితి చక్కబడితే మళ్లీ పూర్తిస్థాయి రాష్ట్రం (లద్దాఖ్ మినహా) కాగలదని కేంద్రం చెప్తున్నది. కాని, పరిస్థితి చక్కబడటం అంటే ఏమిటో అది ఎప్పటికి జరుగుతుందో మనకు తెలియదు గనుక, కనీసం సమీప భవిష్యత్తులో పూర్వస్థితి రాగల అవకాశం లేదు. కనుక అక్కడి ఫెడరల్ అధికారాలు పరిమితంగా మారాయి. అయితే, మొత్తం దేశంలో కశ్మీర్‌ది ఒక ప్రత్యేక పరిస్థితి అన్నది గుర్తించవలసిన విషయం. అటువంటి పరిస్థితులే ఈశాన్యభారతంలోనూ పూర్తిగా కాకున్నా కొంత మేర ఉన్నాయి. అందువల్ల, ఒక్క కశ్మీర్‌ను ప్రామాణికంగా తీసుకుని దేశమంతటా గల ఫెడరలిజానికి ఆపాదించలేము. ఇక్కడ గుర్తించవలసిన రెండవ విషయం ఏమంటే, కశ్మీర్‌ను ఆవరించుకుని ఉన్న వివిధ అంతర్గత, బాహ్య పరిస్థితుల దృష్ట్యా, వాటి ప్రత్యేకతలను బట్టి, తక్కిన దేశంలోని సాధారణ జనాభిప్రాయం అక్కడి ఫెడరల్ అధికారాలను కుంచింపచేయడానికి అనుకూలంగా మారింది.

ఇది సరైనదా కాదా? అక్కడ అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కావటానికి వెనుక గల కారణాలేమిటి? బీజేపీ, కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ సహా వివిధపార్టీల బాధ్యత ఎంత? పాకిస్థాన్ పాత్ర ఏమిటి? అక్కడి సాధారణ ప్రజలు కూడా దీనంతటికి బాధ్యులా? ఆ సమస్యకు ఈ తరహా చర్యల వల్ల పరిష్కారం నిజంగా లభిస్తుందా? అన్న చర్చలు మనం ఎంతైనా చేయవచ్చు గాక. ఆ చర్చలు ఎప్పటి నుంచో జరుగుతున్నాయి కూడా. ఇవేవీ ఇప్పటికిప్పుడు తేలవు గనుక వాటిని అట్లుంచితే, ఈ రోజున దేశంలో నెలకొన్న పరిస్థితి మాత్రం సాధారణ ప్రజలు కశ్మీర్‌లో ఫెడరల్ అధికారాలను పరిమితం చేసేందుకు అనుకూలంగా మారటం.

కశ్మీర్‌లో జరిగింది తక్కిన రాష్ట్రాల విషయంలోనూ జరుగవచ్చును అనే మాట యథాతథంగా అసంబద్ధంగా తోస్తుంది. అదే సమయంలో అట్లా జరిగితే జరుగవచ్చుకూడా అనే భయసందేహాలు ఒక మేరకు తలెత్తిన మాట నిజం. కశ్మీర్‌కు, ఇతర రాష్ట్రాలకు పోలిక లేదు అనే వాదన చేస్తూ ఈ సందేహాలను వెంటనే కొట్టివేయటం కూడా తేలిక కాదన్నది మనం గుర్తించవలసిన కీలకమైన విషయం.అట్లా కొట్టివేయబూనటం అనాలోచితం, తొందరపాటు కాగలదు. ఎందువల్ల? ఒకోసారి లక్ష్యం ఒకటే కావచ్చు. కాని అనుసరించే పద్ధతులలో తేడాలు ఉండవచ్చు. ఇందులో లక్ష్యమన్నది సిద్ధాంత సంబంధమైనది. అనుసరించే పద్ధతులు పరిస్థితులను బట్టి ఉంటాయి. పద్ధతులు కశ్మీర్ విషయంలో బాహాటంగా, ప్రగల్భంగా కనిపించి, ఇతర రాష్ట్రాల విషయంలో నెమ్మదిగా, ప్రచ్ఛన్నంగా ఉన్నంత మాత్రాన లక్ష్యాలు వేరనగలమా?

వాస్తవానికి భారతదేశ వైవిధ్యతకు అనుగుణంగా మనది సహకార ఫెడరలిస్టు రాజ్యాంగంగా రూపుదిద్దుకున్నప్పటికీ, కేంద్రీకరణ(సెంట్రలిస్టు) శక్తులు రాష్ట్రాల హక్కులలోకి చొరబడటం మొదటి నుంచీ ఉంది. ప్రాంతీయ, ఆర్థిక, రాజకీయ, సామాజికశక్తులు క్రమంగా బలపడినా కొద్దీ స్వీయ అస్తిత్వం కోసం, స్వీయాభివృద్ధి కోసం, తాము కూడా వ్యవహారాలలో తగు పాత్ర వహించటం కోసం, తమ పాలనను తమ చేతిలోకి తీసుకోవటంకోసం, కేంద్రీకరణ శక్తులను ప్రతిఘటించటం మొదలైంది. ఈ ఫెడరల్ ధోరణులను కాంగ్రెస్ అనంతరం కొద్దికాలం పాలించిన జనతా, నేషనల్ ఫ్రంట్ గౌరవించాయి గాని, అవి పతనమైన తర్వాత యథా పూర్వస్థితి రావటం మొదలైంది. అంతిమంగా కాంగ్రెస్, బీజేపీ అనే జాతీయపార్టీలు రెండూ కేంద్రీకరణ లక్ష్యాలతో కొనసాగాయి. తమ తమ బలాలూ, బలహీనతలను బట్టి ఫెడరల్ పార్టీలు ముందువెనుకలకు ఊగిసలాడుతూ, ఇవే కేంద్రీకరణ పార్టీలలో ఒకసారి మైత్రి, ఒకసారి ప్రత్యర్థిత్వం అన్న విధంగా ప్రయాణం సాగిస్తూ వస్తున్నాయి. కేంద్రీకరణకు, ఫెడరలిజానికి మధ్య నెహ్రూ కాలంలోనే మొదలైన 'తాడులాగుడు క్రీడ' ఆయన అనంతరం ఈ రెండు శక్తులూ తమతమ పరిధులలో బలపడటంతో ,'వ్యాయామ కర్కశ స్థిరకాయుల యుద్ధము భయానకంబయ్యె' అనే విధంగా పరిణమించింది.

మరికొంతకాలం గడిచేసరికి కేంద్రీకరణశక్తులు, ఫెడరల్‌శక్తులు రెండు కూడా తమ బలాలూ, బలహీనతలు రెండింటినీ బయటపెట్టుకున్నాయి. ఒకసారి గెలవటం, ఒకసారి గాయాలపాలై చిత్తవటం అన్నట్లుగా సాగుతూ వస్తున్నది వీరి ఘర్షణల చరిత్ర. ఈ జనరల్ పరిస్థితి మధ్య కశ్మీర్ అంశం ఒక ప్రత్యేక కేసుగా ముందుకు వచ్చింది. ఆ ప్రత్యేకత కారణంగానే ఫెడరలిస్టులలోని కొందరితోపాటు, సాధారణ ప్రజానీకంలో అనేకులతో పాటు వివిధవర్గాలు ఆ విధమైన వైఖరులను తీసుకున్నాయి. కేంద్రప్రభుత్వంలో ఉన్నవారి లక్ష్యం ఇతరత్రా చూసినపుడు కేంద్రీకరణ అయినప్పటికీ అందుకోసం అనుకరించే విధానం కశ్మీర్ తరహాలో కావాలనుకున్నా సాధ్యమయ్యేదికాదు. ఎందువల్లనో వివరించనక్కర లేదు. ఎవరైనా ఊహించగలరు. అదే సమయంలో ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి. కశ్మీర్‌కు సంబంధించి ప్రస్తుత కేంద్రప్రభుత్వం ఉన్నట్లుండి భారీ మార్పులు తేవటం కొట్టవచ్చినట్లు కన్పించి సంచలనాన్ని సృష్టించిందిగాని, ఇతరత్రా కశ్మీర్‌కు గల ప్రత్యేక రక్షణ నిబంధనలను, హక్కులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కాలక్రమంలో, నెమ్మదినెమ్మదిగానే అనేకాన్ని ఇప్పటికే తొలిగించి వేశాయి. ఇది మొదటిది కాగా రెండవ విషయం, ప్రస్తుత కేంద్రప్రభుత్వం తన ఉద్ధృతి వల్ల కొంత, భావజాలం వల్ల కొంత, కేంద్రీకరణ చర్యలను కాంగ్రెస్ కాలంలోకన్న వేగవంతం చేసినట్లు కన్పిస్తున్నది. ఇప్పటికే చర్చలోకి వచ్చిన ఇటీవలి కొన్ని బిల్లులు అందుకు ఉదాహరణ.

> కశ్మీర్‌కు సంబంధించి ప్రస్తుత కేంద్రప్రభుత్వం ఉన్నట్లుండి భారీ మార్పులు తేవటం కొట్టవచ్చినట్లు కన్పించి సంచలనాన్ని సృష్టించిందిగాని, ఇతరత్రా కశ్మీర్‌కు గల ప్రత్యేక రక్షణ నిబంధనలను, హక్కులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కాలక్రమంలో, నెమ్మదినెమ్మదిగానే అనేకాన్ని ఇప్పటికే తొలిగించి వేశాయి. ఇది మొదటిది కాగా రెండవ విషయం, ప్రస్తుత కేంద్రప్రభుత్వం తన ఉద్ధృతి వల్ల కొంత, భావజాలం వల్ల కొంత, కేంద్రీకరణ చర్యలను కాంగ్రెస్ కాలంలోకన్న వేగవంతం చేసినట్లు కన్పిస్తున్నది. ఇప్పటికే చర్చలోకి వచ్చిన ఇటీవలి కొన్ని బిల్లులు అందుకు ఉదాహరణ.

ఇందుకు సంబంధించి ఒక మౌలిక విషయంలోకి వెళితే, సాధారణ ప్రజలు అయినా, ప్రాంతీయ, ఆర్థిక-రాజకీయశక్తులు అయినా ఒక వైపు ఫెడరలిజం, మరొకవైపు కేంద్రీకరణ అనే అరేంజ్మెంట్ బండికి రెండు చక్రాల వలె సాగాలనే కోరుకుంటారు. ఈ ధోరణి క్రీస్తుపూర్వపు జనపదాలు- మహా జనపదాలు, తొలిదశ రాజ్యాల కాలం నుంచే ఉంటూ వస్తున్నది. స్థానిక శక్తులు, కేంద్ర శక్తులు రెండింటి సహజీవనంతో సమతులనం, స్థిరత్వ సాధనకు అది ఒక తప్పనిసరి ఒప్పందపు ఏర్పాటు వంటిది. అనుభవంలో రూపుదిద్దుకున్నది. ఈ ఏర్పాటును ఇద్దరిలో ఎవరు ఎందుకు భంగపరచజూసినా ఘర్షణ స్థితి, అస్థిరత్వాలు ఏర్పడతాయి. చారిత్రకమైన డీప్ ప్రాసెసెస్ ఇవే. వీటిని ఏదో కొంత సవరించటం మినహా, మితిమీరిన కేంద్రీకరణతో భంగపరచగల దుస్సాహసం ఎవరూ చేయబోరని భావించాలి. అటువంటి దుస్సాహసాన్ని ఫెడరల్ శక్తులు ఆమోదించలేవు కూడా.

# విముక్తి పోరుకు మతం లేదు

**స్వతంత్ర భారతం**



**సిహెచ్.వి. ప్రభాకర్ రావు**

మనిషి కొత్త ఆవిష్కరణలు, నూతన ఆలోచనలను పొందలేకపోయినపుడే పాత జ్ఞాపకాల అనుభవాలనే గొప్పగా చెప్పుకుంటూ వర్తమానాన్ని మరిచిపోయి జీవించాలని చూస్తాడు. ఈ విషయంలో రాజకీయ నాయకులైనా, పార్టీలైనా మినహాయింపు లేదు. అందుకే వందేళ్లు పైబడిన కాంగ్రెస్ పార్టీ ఐనా, 40 యేళ్ళు నిండని బీజేపీ ఐనా తాము అధికారంలో ఉన్న రోజుల్లో సాధించిన విజయాలను చెప్పుకొనే స్థితిలో లేవు. దీంతో చరిత్రలో మిగిలిపోయిన చేదు అనుభవాలనే తమ ఘనకీర్తులుగా చెప్పుకొని ఈ తరం యువత ఆలోచనలను పక్కదారీ పట్టిస్తుంటాయి. రాజకీయ అవకాశాలను మెరుగుపరుచుకో చూస్తుంటాయి.

భారత్ కన్నా చిన్న రాజ్యాలు, మన తర్వాత స్వాతంత్ర్యం పొందిన ఎన్నోదేశాలు ప్రపంచ ఆర్థిక, సాంకేతిక రంగాలను శాసిస్తున్నాయి. మనం మాత్రం ఇంకా మన పూర్వీకుల చర్యలకు, ఈనాటి సామాజిక, రాజకీయ దృక్పథంతో చూస్తూ కొత్త అర్థాలను వెతుకుతున్నాం. యుగ, కాలాలకు అనుగుణంగా ధర్మాలు మారుతుంటాయి. నిన్నటి ఆలోచన నేడు సరియైనది కాకపోవచ్చు. పురాణాల్లో భూమిని చాపలా చుట్టిన హిరణ్యాక్షుడు, తన చంకలో పెట్టుకొని సముద్రంలో దాక్కొని, దేవతలను గడగడలాడిస్తే, విష్ణువు వరాహ అవతారమెత్తి భూమిని కాపాడాడని ఉన్నది. మరి నేడు భూమి గుండ్రంగా ఉందని శాస్త్రం నిరూపించింది. దాన్ని కాదనగలరా?

ఆంగ్లేయుల నుంచి దేశం స్వాతంత్ర్యం పొందిందని చెప్పుకొంటున్నాం. నేటికీ ఆంగ్లేయులంటే మన దేశాన్ని దోచుకొన్న దోపిడీదారుల్లానే చూస్తున్నాం. అంతకుముందే దేశానికి వచ్చి దాదాపు వెయ్యేళ్లు భారత దేశ సంపదను కొల్లగొట్టిన అరబ్, మంగోలియా, పర్షియన్ దేశాల రాజుల అరాచకాలను మరిచిపోయాం. నిన్నటి ఘటనలను నేటి దృష్టితో చూస్తే అప్పుడు జరిగిన, చేసిన ఎన్నో ఘటనలు, పనులు ఇప్పుడు మనకు రుచించకపోవచ్చు. కొన్ని మన నేటి ఆలోచనలకు అనుగుణమైనవి కావచ్చు. కానీ అవే సంఘటనలను అవే మాటలను పట్టుకొని ఇప్పటి సామాజిక ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. ఇందులోని ఔచిత్యం ఏమిటో, ఏ వర్గ రాజకీయ ప్రయోజనాల కోసమో నేటి యువత ఆలోచించాలి.

స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి దేశం 600లకు పైగా చిన్నా, పెద్దా రాజ్యాలుగా, జమిందారీ ప్రాంతాలుగా విడిపోయి ఉన్నది. దేశంలో కలువాలా లేక స్వతంత్రంగా ఉండాలా అనే సంశయంలో అనేక ప్రాంత పాలకులు ఉండేవారు. కొంతమంది స్వచ్ఛందంగా దేశంలో కలిస్తే మరికొంతమంది కొన్ని ఆర్థిక రక్షణలు, పరిహారాలు కోరుకున్నారు. మరికొందరు కొంత బెట్టు చేయడం, పాకిస్థాన్‌లో కలుస్తామని బెదిరించడం, లేదా స్వతంత్ర దేశంగా ఉంటామని పోరాటం చేశారు. ఆ క్రమంలోనే చివరగా మిగిలిన నిజాం, జునాగఢ్, జమ్ముకశ్మీర్ రాజ్యాల విషయంలో భారత ప్రభుత్వం కొంత ఘర్షణ పడిన మాట వాస్తవం. ఒక దశలో జమ్ముకశ్మీర్‌ను వదులుకొని జునాగఢ్‌ను దేశంలో కలుపుకోవడానికి కూడా నాటి నేతలు సిద్ధమయ్యారనే వాస్తవాన్ని మరవకూడదు.

జునాగఢ్‌ను వదలుకోకూడదని నాటి కేంద్ర హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ పట్టుబడితే, తన పూర్వీకుల జన్మస్థలమైన జమ్ముకశ్మీర్‌ను వదులుకోకూడదని నెహ్రూ అనుకోవడం వల్లే ఈ రెండూ భారతదేశంలో అంతర్భాగం అయ్యాయన్నది మరువరాదు. నాడు జమ్ముకశ్మీర్ రాజు రాజా హరిసింగ్ మిగతా అన్నిప్రాంతాలలానే ముందుగానే భారత దేశంలో కలిసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. అక్కడి ప్రజలు అధిక సంఖ్యలో ముస్లింలు. అయినా వారు భారత్‌లోనే ఉండాలనే కోరుకున్నారు. దేశం మధ్యలో ఉన్న నిజాం రాజ్యంలో కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ నాయకులు అప్పటికే నిజాంకు వ్యతిరేకంగా స్వతంత్ర పోరాటం ప్రారంభించారు. దాదాపు రెండేండ్ల పోరాటం తర్వాత నిజాం రాజు 1948 సెప్టెంబర్17న దేశంలో కలువడానికి అంగీకరించాడు. అప్పటి నుంచి హైదరాబాద్ రాష్ట్రం దేశంలో భాగంగా 1956 వరకు కొనసాగింది. తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాల పేర హైదరాబాద్ రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా చేసి, మరాఠీ మాట్లాడేవారిని బొంబాయి రాష్ట్రంలో, కన్నడ భాషను మాట్లాడే ప్రాంతాన్ని కర్ణాటకలో కలిపి, మిగతా ప్రాంతాన్ని ఆంధ్రలో కలిపారు.

సెప్టెంబర్ 17వ తేదీకి ఎవరూ అంత ప్రాధాన్యం ఇవ్వకుండా, ఆగస్టు 15వ తేదీనే స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకొంటున్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో ప్రజలకు పూర్వ చరిత్ర తెలువడానికి తెలంగాణ ప్రాంతం భారతదేశంలో కలిసిన రోజుగా సెప్టెంబర్ 17వ తేదీని గుర్తుచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోవాలని కోరుకున్నారు. సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజలు ఎప్పుడూ విద్రోహదినంగా భావించలేదు. తెలంగాణ పోరాట ప్రత్యేకతను చాటడానికి సెప్టెంబర్ 17వ తేదీన అమర వీరుల దినంగా, సంస్మరణ దినంగా మాత్రమే కమ్యూనిస్ట్‌పార్టీలతో పాటు ప్రగతిశీల భావాలున్న ప్రజాసంఘాలన్నీ జరుపుకొనేవి. నిజాం వ్యతిరేక పోరాటంలో హిందువులతో పాటు ముస్లింలు, పార్శీలు, క్రైస్తవులు ఉద్యమించారు. అనేక మంది బలిదానాలు చేశారు.

నిజాం వ్యతిరేక పోరాటం ఒక మతానికి కాకుండా ఒక రాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం. అలాగే జమ్ముకశ్మీర్‌లో హిందూ రాజుకు వ్యతిరేకంగా ముస్లిం ప్రజలు పోరాడారు. వారి పోరాటం వల్లనే కశ్మీర్ భారత దేశంలో కలిసింది. కానీ అక్కడ హిందువులకు వ్యతిరేకంగా ఎలాం టి చర్యలు జరుగలేదు. మరి ఇక్కడ తెలంగాణలో మాత్రమే ఎందుకు నిజాం రాజుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాన్ని ఒక మతానికి అంటగట్టి చూస్తూ మాసిపోయిన గాయాన్ని రేపాలని చూస్తున్నారు?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాలు స్వాతంత్ర్యం పొందలేదు. వివిధ పరిస్థితులలో వివిధ రాజ్యాలు భారత ఫెడరల్ యూనియన్‌లో కలిశాయి. తెలంగాణ రాష్ట్రంలో సెప్టెంబర్ 17 విమోచన దినంగా జరుపుకోవాలనే ఆలోచనలో ప్రజలను మతాల వారీగా విడదీసి, రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకొనే దుర్నీతి కనబడుతుంది. మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడంతోనే మతాల మధ్య ఘర్షణ వాతారణం పెరుగుతున్నది.

> ఏ పార్టీ అయినా బలపడి రాజకీయాధికారం సంపాదించుకోవాలనుకోవడంలో తప్పులేదు. కానీ మతాల మధ్య ఘర్షణలను, వైషమ్యాలను రెచ్చగొట్టే తీరులో రాజకీయాలను నడుపడం గర్హనీయం. ప్రధాని మోదీ ప్రకటించిన 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అన్న మాటలకు వ్యతిరేకంగా తెలంగాణలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఇది వారి సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసమే అనడంలో సందేహం లేదు.

ఏ పార్టీ అయినా బలపడి రాజకీయాధికారం సంపాదించుకోవాలనుకోవడంలో తప్పులేదు. కానీ మతాల మధ్య ఘర్షణలను, వైషమ్యాలను రెచ్చగొట్టే తీరులో రాజకీయాలను నడుపడం గర్హనీయం. ప్రధాని మోదీ ప్రకటించిన 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అన్న మాటలకు వ్యతిరేకంగా తెలంగాణలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఇది వారి సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసమే అనడంలో సందేహం లేదు.

(వ్యాసకర్త:సీనియర్ జర్నలిస్ట్)

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## నేడు జాతిని ఉద్దేశించి మాట్లాడనున్న మోదీ



**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ గురువారం ఢిల్లీలోని ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన రెండోసారి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న కీలక నిర్ణయాలు, ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం, వాటి అభివృద్ధికి తీసుకోనున్న చర్యలను వివరించే అవకాశముంది. స్వచ్ఛభారత్, ఆయుష్మాన్‌భారత్ తదితర పథకాలను ప్రస్తావించడంతోపాటు తమ పాలనలో దేశాభివృద్ధిని సైతం ప్రధాని వివరిస్తారు. అయితే మోదీ ఎక్కువగా జమ్ముకశ్మీర్‌పైనే మాట్లాడే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. కాగా ఎర్రకోట నుంచి వరుసగా ఆరేండ్లలో ఆరుసార్లు ప్రసంగించిన బీజేపీ ప్రధానుల్లో మోదీ రెండో వ్యక్తి కానున్నారు. ఇప్పటి వరకు కేవలం వాజపేయి మాత్రమే ఎర్రకోట నుంచి వరుసగా ఆరుసార్లు (1998-2003) ప్రసంగించారు.

## షరతులు లేకుండా వస్తా.. ఎప్పుడు రావాలి?

### జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు రాహుల్ ప్రశ్న



**న్యూఢిల్లీ:** ఎలాంటి షరతులు లేకుండా జమ్ముకశ్మీర్‌లో పర్యటించేందుకు తాను సిద్ధమేనేని, ఎప్పుడు రమ్మంటారో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను బుధవారం ప్రశ్నించారు. 'డియర్ మాలిక్ జీ, నా ట్వీట్‌కు మీరిచ్చిన దుర్బలమైన జవాబు చూశా. జమ్ముకశ్మీర్‌లో పర్యటించాలన్న మీ ఆహ్వానాన్ని నేను అంగీకరించా. ఏ షరతులు లేకుండా పర్యటిస్తా. ఎప్పుడు రమ్మంటారు?' అని రాహుల్ ట్వీట్ చేశారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, అక్కడ ఏం జరుగుతున్నదో కేంద్రం ప్రజలకు వివరించాలని రాహుల్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం స్పందించిన మాలిక్.. కావాలంటే ప్రత్యేక విమానం పంపిస్తామని, రాహుల్ కశ్మీర్‌లో పర్యటించొచ్చని పేర్కొన్నారు.

## మోదీ కోసం త్రివర్ణ రాఖీ

### నేడు కట్టనున్న 'ట్రిపుల్ తలాక్ రద్దు' ఉద్యమకారిణి ఇష్రత్ జహాన్



**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌కు చెందిన 'ట్రిపుల్ తలాక్ రద్దు' ఉద్యమ కారిణి ఇష్రత్ జహాన్ గురువారం ప్రధాని మోదీకి రాఖీ కట్టనున్నారు. ఈ మేరకు ఆమె బుధవారం కోల్‌కతా నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానికి రాఖీ కట్టే అవకాశం వస్తుందని కల లోనూ ఊహించలేదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీ పౌర్ణమి ఒకేరోజు రావడంతో మోదీకి 'త్రివర్ణ' రాఖీ కట్టనున్నట్టు చెప్పారు. ప్రత్యేకంగా రసగుల్లాలు తీసుకెళ్తున్నానన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో దేశంలోని ముస్లిం మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం లభించిందన్నారు.



నేడు రాఖీ పండుగ



# కశ్మీరీలకే మేలు

### ఆర్టికల్ 370 రద్దు ఫలాలు జమ్ముకశ్మీర్ ప్రజలకు త్వరలో అందుతాయి

- తోటి భారతీయులతో సమానంగా హక్కులు, అధికారాలు దక్కుతాయి
- ట్రిపుల్ తలాక్ రద్దుతో ఆడబిడ్డలకు ఊరట
- ఇటీవలి పార్లమెంట్ సమావేశాలు ఆదర్శంగా నిలిచాయి
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** జమ్ముకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో ఆ రాష్ట్ర ప్రజలు భారీగా లబ్ధి పొందనున్నారని రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ పేర్కొన్నారు. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిచ్చే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజన, జమ్ముకశ్మీర్, లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా ప్రకటించడం వంటి మార్పుల ఫలాలు త్వరలోనే అక్కడి ప్రజలకు చేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, అధికారాలు, వసతులు ఇకపై కశ్మీర్ ప్రజలకూ దక్కుతాయన్నారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ బుధవారం జాతినుద్దేశించి సందేశమిచ్చారు. ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ పోరాటంతో మన దేశానికి దాస్య బంధనాల నుంచి విముక్తి కల్పించారని గుర్తుచేశారు. 'వారి దృష్టిలో స్వాతంత్ర్యం అంటే స్వేచ్ఛ, అధికారం మాత్రమే కాదు. దేశ నిర్మాణం, జాతి సమైక్యత అనే సుదీర్ఘ ప్రక్రియలో ఓ మెట్టుగా భావించారు. దేశంలోని ప్రతి ఒక్కరి జీవితాన్ని మెరుగుపరుచడం, తద్వారా కుటుంబాన్ని, అంతిమంగా సమాజాన్ని మెరుగుపరుచడమే వారి లక్ష్యం' అని అన్నారు. ఇదే తరహాలో కేంద్రం ఇటీవల చేసిన మార్పులతో జమ్ముకశ్మీర్ ప్రజలకు త్వరలో అపార ప్రయోజనాలు కలుగనున్నాయన్నారు. 'విద్యాహక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఇతర వసతులు రాష్ట్రంలోని పేద, బలహీన వర్గాల ప్రజలకు వర్తిస్తాయి. ట్రిపుల్ తలాక్ రద్దు ఫలాలు మన ఆడబిడ్డలకు అందుతాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**మనది సహనశీల దేశం**

భారతదేశం సహనం, 'బతుకు-బతుకనివ్వు' అనే మౌలిక సూత్రాలపైనే ఆధారపడి ఉన్నదని, అరుదుగా మాత్రమే వివక్షను ప్రదర్శించిందని రాష్ట్రపతి రామ్‌నాథ్ పేర్కొన్నారు. మన హృదయాలను విస్తరించడం, ఇతరుల ఆలోచనలను గౌరవించడం అనే అంశాలపైనే దేశ చరిత్ర-పురోగమనం, గతం-భవిష్యత్ ముడిపడి ఉన్నాయని చెప్పారు. బలహీనుల ఆకాంక్షలను వినడమనే గొప్ప లక్షణాన్ని భారత్ ఎన్నటికీ కోల్పోదని, తన పురాతన ఆదర్శాలను, వాటి అంతరార్థాన్ని ఎన్నటికీ మరిచిపోదని విశ్వాసం వ్యక్తం చేశారు.

**పార్లమెంట్ సమావేశాలు అభినందనీయం**

ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ రాష్ట్రపతి అభినందించారు. దేశ పురోభివృద్ధిలో ఒక్కో ఎన్నిక కొత్త అడుగుగా నిలుస్తుందని, దేశ ప్రజలందరి ఆశావహ దృక్పథానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు. నేతలు పార్టీలకు అతీతంగా సహకరించారని, ఆరోగ్యకరమైన చర్చ జరగడంతో అనేక ముఖ్య బిల్లులు ఆమోదం పొందాయని చెప్పారు. వచ్చే ఐదేండ్లలో జరుగబోయే పరిణామాలకు దీనినొక సూచికగా అభివర్ణించారు. అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో ఇదే సంప్రదాయం పాటించాలని ఆకాంక్షించారు. ప్రజలు తమ ఆశలు, ఆకాంక్షలను బలంగా వినిపించాలని, ప్రభుత్వం వాటిని అర్థం చేసుకొని తదనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం, పారదర్శక బ్యాంకింగ్ వ్యవస్థ, ఆన్‌లైన్ ట్యాక్స్ విధానం, రోడ్లు, టాయిలెట్లు.. ఇలా ఎన్నో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నదని, ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

**గాంధీజీ బోధనలను ఆచరిద్దాం**

ఈ ఏడాది మహాత్మా గాంధీ 150వ జయంతిని జరుపుకొంటున్నామని, ఈ సందర్భంగా ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. 'గాంధీజీ జీవించిన కాలానికి, ఇప్పటికి ఎంతో తేడా ఉన్నది. అయినా ఆయన బోధించిన సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతితో మమేకమై జీవించడం వంటివి ప్రస్తుత సమాజంలోని సవాళ్లకు సమాధానమిస్తాయి' అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గాంధీ సిద్ధాంతాల ఆధారంగానే పేదల కోసం సంక్షేమ పథకాలను రూపొందించి అమలుచేస్తున్నదని వివరించారు. ఈ ఏడాది గురునానక్ 550వ జయంతిని జరుపుకోనున్న సందర్భంగా సిక్కులందరికీ రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు.

# భూకక్ష్యను వీడిన చంద్రయాన్

- చంద్రుడి దిశగా సాగుతున్న వ్యోమనౌక
- మరో ఆరు రోజుల్లో జాబిల్లి కక్ష్యలోకి
- వచ్చేనెల 1న చంద్రుడి సమీపానికి..



ఇస్రో విడుదల చేసిన ఊహాచిత్రం

**బెంగళూరు, ఆగస్ట్ 14:** చంద్రయాన్-2 తన ప్రస్థానంలో మరో కీలక దశను దాటింది. భూకక్ష్యను వీడి చంద్రుడి వైపు తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఆరు రోజుల తర్వాత చంద్రుడి కక్ష్యలోకి చేరనున్నది. ఈ మేరకు ఇస్రో బుధవారం ట్వీట్ చేసింది. 'ఈరోజు నిర్వహించిన ట్రాన్స్ ల్యూనార్ ఇన్సెర్షన్ (టీఎల్ఐ) ప్రక్రియ అనంతరం చంద్రయాన్-2 భూకక్ష్యను వదిలి చంద్రుడి వైపు ప్రయాణించడం మొదలుపెట్టింది' అని ఇస్రో పేర్కొన్నది. ఆరు రోజుల ప్రయాణం అనంతరం చంద్రయాన్-2 ఈ నెల 20న చంద్రుడి కక్ష్యలోకి చేరుతుందని ఇస్రో అధికారులు తెలిపారు. వచ్చేనెల 7వ తేదీన చంద్రుడిపై మృదువుగా దింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం నిర్వహించిన టీఎల్ఐ ప్రక్రియలో భాగంగా వ్యోమనౌక ఇంజిన్‌ను దాదాపు 20 నిమిషాల పాటు మండించినట్టు చెప్పారు. బెంగళూరులోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ నుంచి వ్యోమనౌక పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తున్నామన్నారు. జూలై 22న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన నాటి నుంచి ఇప్పటివరకు చంద్రయాన్-2లోని అన్ని వ్యవస్థలు బాగానే పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జూలై 23వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ మధ్య మొత్తం ఐదుసార్లు క్షక్ష్య మార్చామని తెలిపారు. చంద్రుడి కక్ష్యలోకి చేరిన అనంతరం నాలుగు సార్లు కక్ష్య మార్పు ప్రక్రియలు చేపడుతామని, చివరగా చంద్రుడి ఉపరితలానికి 100 కి.మీ.ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి చేర్చుతామని వివరించారు. ఈ నెల 21, 28, 30, సెప్టెంబర్ 1వ తేదీన ఈ ప్రక్రియలు ఉంటాయన్నారు. సెప్టెంబర్ 2న వ్యోమనౌక నుంచి విక్రమ్ ల్యాండర్ వేరవుతుందని తెలిపారు. అనంతరం రెండు సార్లు చంద్రుడి చుట్టూ తిరుగుతుందని, ఆ తర్వాత ఉపరితలంపై దిగుతుందన్నారు.

## పెహ్లూఖాన్ హత్య కేసులో అంతా నిర్దోషులే

- తీర్పునిచ్చిన అల్వార్ స్థానిక కోర్టు
- పై కోర్టులో సవాల్ చేస్తామన్న రాజస్థాన్ ప్రభుత్వం

**జైపూర్, ఆగస్టు 14:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెహ్లూఖాన్ హత్య కేసులో మొత్తం ఆరుగురు నిందితులను రాజస్థాన్‌లోని అల్వార్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పును పై న్యాయస్థానంలో సవాల్ చేయనున్నట్లు రాజస్థాన్ ప్రభుత్వం తెలిపింది. 2017 ఏప్రిల్‌లో పెహ్లూఖాన్ (55), ఆయన ఇద్దరు కుమారులు, మరి కొందరు కలిసి ఆవులను తీసుకెళ్తుండగా అల్వార్ జిల్లాలోని బెహ్రూర్ సమీపంలో కొందరు అడ్డగించారు. పెహ్లూఖాన్‌ను బలంగా కొట్టడంతో ఆయన చనిపోయారు. గోసంరక్షణ పేరుతో జరుగుతున్న ఇలాంటి దాడులను పలువురు ఖండించారు. మూకదాడికి సంబంధించి ఆరుగురు నిందితులపై పోలీసులుకేసు నమోదు చేయగా బుధవారం స్థానిక కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది. మరోవైపు కోర్టు తీర్పుపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ 'నిందితులకు శిక్ష పడేలా చూడటం ప్రభుత్వం బాధ్యత. కానీ ప్రభుత్వం సరిగా వాదనలు వినిపించలేదు. అందుకే కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును ప్రభుత్వం వెంటనే పై కోర్టులో అప్పీల్ చేయాలి' అని ట్వీట్ చేశారు.

## హార్దిక్ పటేల్ అరెస్ట్

**పలాన్‌పూర్:** ఉద్యోగం నుంచి ఉద్వాసనకు గురై గుజరాత్‌లోని పలాన్‌పూర్ జైలులో ఉన్న ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్‌ను కలువడానికి వెళ్లిన పాటిదార్ ఉద్యమనాయకుడు, కాంగ్రెస్ నేత హార్దిక్ పటేల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు వెళ్లిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, 27 మంది పార్టీ కార్యకర్తలను కూడా అరెస్టు చేశారు. సంజీవ్ భట్ 1990లో జరిగిన లాకప్‌డెత్ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. హార్దిక్, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పలాన్‌పూర్‌కు వచ్చారని, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముండటంతో అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

- కశ్మీర్‌లో ఆంక్షల కొనసాగింపు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు
- జమ్ముకశ్మీర్ ఏడీజీ మునీర్‌ఖాన్ వెల్లడి
- షేర్ ఎ కశ్మీర్ స్టేడియంలో జెండా ఎగురవేయనున్న గవర్నర్
- స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో సైన్యం హై అలర్ట్



పాక్ సరిహద్దుల్లోని అఖ్నూర్ వద్ద చీనాబ్ నదిలో గస్తీ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ సిబ్బంది

# జమ్ములో ఆంక్షలు ఎత్తివేత

**శ్రీనగర్/జమ్ము:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజన నేపథ్యంలో విధించిన ఆంక్షల్ని జమ్ములో పూర్తిగా ఎత్తివేసినట్లు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్(ఏడీజీ) మునీర్ ఖాన్ తెలిపారు. కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం మరికొన్ని రోజులు ఆంక్షలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో పరిస్థితి అదుపులోనే ఉన్నదనిబుధవారం ఆయన శ్రీనగర్‌లో మీడియాతో అన్నారు. శ్రీనగర్‌లోని పలు ప్రాంతాలతోపాటు, లోయలోని పలు జిల్లాల్లో జరిగిన చెదురుమదురు ఘటనల్లో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదన్నారు. పెల్లెట్ల వల్ల కొంతమందికి గాయాలుకాగా, వారికి చికిత్స అందించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఒక్క ప్రాణనష్టం కూడా లేకుండా చూడడం తమ అతిపెద్ద విజయమన్నారు. కశ్మీర్ లోయలో పలు ప్రాంతాల్లో ఆంక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. 'ఏదో ఊరికే ఆంక్షలు విధించలేదు. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనావేసి ఆంక్షలను విధించాం. ఇప్పుడు కూడా పరిస్థితులను అంచనావేసి ఆంక్షలను తొలిగిస్తాం' అని చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న దుష్ప్రచారంపై మీడియా ప్రశ్నించగా, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు లేకున్నా పొరుగుదేశం దుష్ప్రచారానికి దిగుతుందని, ఆ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'త్వరలోనే మీరు వాటి ఫలితాలు చూస్తారని' అన్నారు. ట్విట్టర్‌లో కొందరు వదంతులను వ్యాప్తిచేయడంపై విలేకరులు ప్రశ్నించగా, అలాంటి ఖాతాలను గుర్తించామని, నిందితులపై చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపైనే ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. జమ్ముకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోహిత్ కన్సల్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నదని తెలిపారు. శ్రీనగరతోపాటు చాలా ప్రాంతాల్లో నిషేధాజ్ఞలను సడలించామన్నారు. పౌర సరఫరాలు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, వైద్య సదుపాయాలు.. అన్నీ సాధారణంగానే కొనసాగుతున్నాయన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కశ్మీర్‌లో పలు ఆంక్ష లు విధించనున్నట్లు చెప్పారు. షేర్ ఎ కశ్మీర్ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ సత్యపాల్ మాలిక్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. జమ్ములో గవర్నర్ సలహాదారు ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

**సరిహద్దుల్లో సైన్యం అప్రమత్తం**

ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజన తర్వాత జరుగుతున్న తొలి స్వాతంత్ర్య దినోత్సవాల నేపథ్యంలో భారత్, పాక్ సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖతోపాటు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సైన్యం, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నిఘాను పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే జమ్ములోనూ పోలీసులు నిఘాను పెంచారని, తనిఖీలను ముమ్మరం చేశారని వివరించారు. స్వాతంత్ర్య వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని, అనుమానిత వ్యక్తులను, వస్తువులను గుర్తించిన వెంటనే సమాచారమివ్వాలని పోలీసులు కోరినట్లు చెప్పారు.

## ప్రధాని చైర్మన్‌గా అంతర్రాష్ట్ర మండలి పునరుద్ధరణ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 14:** రాష్ట్రాల మధ్య ఏర్పడే వివాదాలపై దర్యాప్తు జరిపి, పరిష్కారానికి సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటైన అంతర్రాష్ట్ర మండలిని (ఇంటర్ స్టేట్ కౌన్సిల్) కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి ప్రధానమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆరుగురు కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, నరేంద్ర సింగ్ తోమర్, తావర్ చంద్ గెహ్లాట్, హర్దీప్ సింగ్ పూరీని ఈ మండలిలో సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరితోపాటు అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, చట్టసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాల పాలనాధికారి సభ్యులుగా వ్యవహరిస్తారు. మరో పది మంది కేంద్ర మంత్రులు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.

## పాముకాటుతో జైలులో ఖైదీ మృతి

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లక్నోలోని జైలులోకి నీళ్లు వెళ్లాయి. నీటితోపాటు జైలులోకి పాములు కూడా ప్రవేశించాయి. ముగ్గురు ఖైదీలను కాటేశాయి. వీరిలో జీవిత ఖైదు అనుభవిస్తున్న బబ్బు అనే ఖైదీ మరణించాడు. మరో ఇద్దరు ఖైదీలు దిలీప్, రాజ్‌కుమార్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగైంది. జైలు ఆవరణలోకి ప్రవేశించిన నాలుగు పాములను పట్టేందుకు 12 మంది పాములను పట్టేవారిని పిలిపించామని జైలర్ సతీశ్ చంద్ర చెప్పారు.

# అవసరమైతే యుద్ధం



- భారత్ ఎలాంటి చర్యలకు దిగినా ప్రతిఘటిస్తాం
- యుద్ధం జరిగితే అంతర్జాతీయ సమాజానిదే బాధ్యత
- కశ్మీర్ అంశాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్తా
- పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యలు
- పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పీవోకే అసెంబ్లీలో ప్రసంగం

**ఇస్లామాబాద్:** ఆర్టికల్ 370 రద్దుపై పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మరోసారి తన నోరుపారేసుకున్నారు. కశ్మీర్ ప్రజల స్వేచ్ఛను కాపాడేందుకు అవసరమైతే యుద్ధానికి సిద్ధమని సంచలన ప్రకటన చేశారు. జమ్ముకశ్మీర్ విషయంలో భారత్-పాక్ మధ్య యుద్ధం జరిగితే అంతర్జాతీయ సమాజానిదే బాధ్యత అని అన్నారు. తాను కశ్మీర్ ప్రజల గొంతుకగా మారుతానని, విశ్వవేదికలపై గళమెత్తుతానన్నారు. బుధవారం పాకిస్థాన్ 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని (పీవోకే) ముజఫరాబాద్‌లో జరిగిన వేడుకల్లో ఇమ్రాన్ పాల్గొన్నారు. అనంతరం పీవోకే అసెంబ్లీలో మాట్లాడారు. కశ్మీర్ అంశంలో మరిన్ని చర్యలు చేపట్టేందుకు భారత్ సిద్ధమవుతున్నదని తమకు విశ్వసనీయ సమాచారం ఉన్నదన్నారు. 'జమ్ముకశ్మీర్ అంశాన్ని మరుగున పడేసేందుకు పుల్వామా అనంతర దాడికన్నా (బాలాకోట్ వైమానిక దాడికన్నా) భారీ ప్రణాళికను సిద్ధం చేసినట్టు మాకు విశ్వసనీయ సమాచారం అందింది. ఇదే నిజమైతే దానికి తగిన ప్రతిచర్య ఉంటుందని మోదీని హెచ్చరిస్తున్నా' అని అన్నారు. 'మాకు గుణపాఠం చెప్పాలని మీరు భావిస్తున్నారేమో. కానీ.. మీకు గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చింది. జాగ్రత్తగా వినండి.. మీరు ఎలాంటి చర్యలకు దిగినా ఎదుర్కొంటాం. అంతుచూస్తాం' అని అన్నారు. 'ఇక్కడ (కశ్మీర్‌లో) ఏం జరుగుతున్నదో మేం గమనిస్తున్నాం. పాక్‌కు వ్యతిరేకంగా భారత్ ఏదైనా చర్యలకు దిగితే చూస్తూ ఊరుకోం. ఎదురించడానికి పాక్ ప్రజలు, సైన్యం ఒక్కతాటిపై నిలుస్తుంది' అని అన్నారు. 'మోదీ తన చివరి అవకాశం వాడుకున్నారు. ఇది మోదీకి, బీజేపీకి, భారత్‌కు భవిష్యత్‌లో ఎంతో నష్టాన్ని మిగుల్చుతుంది. ఎందుకంటే ఇప్పుడు కశ్మీర్ అంశం అంతర్జాతీయ సమాజం దృష్టికి వెళ్లింది' అని చెప్పారు. అదేసమయంలో కశ్మీర్ గురించి ప్రపంచదేశాలు పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఒకవేళ భారత్-పాక్ మధ్య యుద్ధం మొదలైతే.. యుద్ధాల నివారణ కోసం ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థలదే బాధ్యత అని చెప్పారు. ఇప్పటికే తాను ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, ఇస్లామిక్ దేశాల కూటమికి వివరించానన్నారు. వచ్చే నెలలో జరిగే ఐరాస సర్వసభ్య సమావేశ సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు బయటికొచ్చి తమ గళాన్ని వినిపిస్తారన్నారు.

**భద్రతామండలి అత్యవసరంగా చర్చించాలి**

జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై చర్చించటానికి అత్యవసరంగా సమావేశం నిర్వహించాలని ఐరాస భద్రతామండలిని పాక్ కోరింది. ఈ మేరకు, భద్రతామండలి అధ్యక్షుడికి ఒక లేఖ రాశానని ఆ దేశ విదేశాంగమంత్రి షా మహమ్మద్ ఖురేషి బుధవారం తెలిపారు. మరోవైపు, కశ్మీర్ వివాదాన్ని భారత్-పాక్ ద్వైపాక్షికంగా చర్చల ద్వారా పరిష్కరించుకుంటాయని భద్రతామండలి ప్రస్తుత అధ్యక్షుడు జాసెక్ జాపుటోవిక్జ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**కశ్మీరీలు.. పాకిస్థానీలు ఒక్కటే: ఆరిఫ్ అల్వీ**

కశ్మీర్ ప్రజలు, పాకిస్థానీలు ఒక్కటేనని పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ వ్యాఖ్యానించారు. పాక్ ప్రజలంతా కశ్మీరీలకు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇస్లామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దును పాక్ ప్రభుత్వం వ్యతిరేకించడం, ఐరాస భద్రతా మండలిలో చర్చించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. అధికరణల రద్దుతో భారత్ ఐరాస తీర్మానాలను, సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. 'పాకిస్థాన్ శాంతికాముక దేశం. కశ్మీర్ అంశాన్ని చర్చల ద్వారా పరిష్కరించాలన్నదే మా అభిమతం. మా శాంతిని బలహీనతగా భావించొద్దు' అని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రజలు ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొన్నారు.

# గాంధీ హంతకులకు నేనొక లెక్కా?

- జాతి వ్యతిరేకినని నాపై దుష్ప్రచారం చేస్తున్నారు
- మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపణలు
- కేరళ, మహారాష్ట్రలకు రూ.10 లక్షల చొప్పున వరదసాయం



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జాతిపిత గాంధీజీని కాల్చి చంపిన గాడ్సేలకు ఒవైసీ ఓ లెక్కా? అని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. తనపై జాతి వ్యతిరేకి అన్న ముద్ర వేసి తుపాకీతో కాల్చిచంపినా ఆశ్చర్యం లేదన్నారు. ఆయన బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 370వ అధికరణం రద్దును వ్యతిరేకిస్తున్న తనపై దాడులు జరుగవచ్చునన్నారు. కశ్మీర్‌లో పరిస్థితి ప్రస్తుతం ఎమర్జెన్సీని తలపిస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగంలోని మొదటి, మూడో అధికరణలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం నిర్ణయం తీసుకున్నదన్నారు. నెహ్రూ, పటేల్, అయ్యంగార్ సంతకాలతో కూడిన ఒప్పందాన్ని బుట్టదాఖలు చేశారని విమర్శించారు. వారిని మించిన రాజకీయ పరిజ్ఞానం ప్రధాని మోదీకి ఉన్నదా? అని ఒవైసీ ప్రశ్నించారు. 370 అధికరణానికి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కూడా మద్దతు పలికారని గుర్తుచేశారు. ఎన్డీఏ సర్కార్‌కు కశ్మీర్ భూభాగంపైనే ప్రేమ ఉన్నది తప్ప, అక్కడి ప్రజలపై కాదన్నారు. రాష్ట్రాన్ని రెండుగా విభజించడంలో బీజేపీ పూర్తిగా రాజకీయ స్వార్థంతో వ్యవహరించిందని ఆరోపించారు. 'కశ్మీర్‌లో జనాభా పూర్తిగా మారిపోనున్నది. కశ్మీర్‌లో అసెంబ్లీ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా ముస్లిమేతరుడిని, బీజేపీ నేతను సీఎంను చేయడమే ఈ ప్రక్రియ లక్ష్యం' అని చెప్పారు. బీజేపీ అనుకూలురను హెలికాప్టర్లలో తిప్పుతూ దాన్నే శాంతియుత వాతావరణంగా చూపేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నాగాలాండ్, మణిపూర్, మిజోరం, అసోం, హిమాచల్‌ప్రదేశ్‌కు ఉన్న ప్రత్యేక హక్కులను కూడా భవిష్యత్‌లో కేంద్రం రద్దు చేస్తుందని హెచ్చరించారు. మోదీ, అమిత్‌షా కృష్ణార్జునులన్న నటుడు రజినీకాంత్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఇందులో పాండవులెవరు? కౌరవులెవరు? కశ్మీర్‌ను మహ భారతంలా మార్చేస్తారా?' అని ప్రశ్నించారు. కశ్మీర్ విభజనను వ్యతిరేకిస్తే తాను పాకిస్థాన్‌కు అనుకూలమని, జాతి వ్యతిరేకినని ప్రచారం చేస్తున్నారన్నారు. తాము జాతి వ్యతిరేకులం కాదని, హైదరాబాద్‌ను భారత్‌లో విలీనం చేసి గర్వంగా బతుకుతున్నామన్నారు. మరోవైపు వరదలతో తీవ్రంగా నష్టపోయిన కేరళ, మహారాష్ట్రకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్టు ఒవైసీ ప్రకటించారు.

# సీఆర్పీఎఫ్‌కు 75 శౌర్య పతకాలు

- సీబీఐకి 32 పోలీసు పతకాలు
- శారదా, 2జీ కుంభకోణాలను విచారిస్తున్న అధికారులను వరించిన పురస్కారాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శౌర్య పతకాలలో సీఆర్పీఎఫ్‌ను అధికంగా 75 పతకాలు వరించాయి. ఇందులో ఒక కీర్తిచక్ర, రెండు శౌర్య చక్ర పతకాలు కూడా ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో, మావోయిస్టుల కార్యకలాపాలను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించినందుకు సీఆర్పీఎఫ్‌కు ఈ అవార్డులు దక్కాయి. జమ్ములో గతేడాది సెప్టెంబర్‌లో ఓ ఇంట్లో ముగ్గురు ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు బలగాలు అక్కడికి వెళ్లాయి. ఈ సందర్భంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో అప్పటి డిప్యూటీ కమాండెంట్ హర్షపాల్ సింగ్, కానిస్టేబుల్ జకీర్ హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డారు. అయినా వెనుకడుగు వేయకుండా ఆ ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారు. వీరి ధైర్య సాహసాలను గుర్తించిన ప్రభుత్వం హర్షపాల్ సింగ్‌కు శాంతికాలంలో ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం కీర్తిచక్రను, కానిస్టేబుల్ జకీర్ హుస్సేన్‌కు శౌర్యచక్ర అవార్డును ప్రకటించింది. అలాగే గతేడాది కశ్మీర్ లోయలో ఓ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ద్యానేశ్వర్ శ్రీరాం ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాడు. ఆయనను శౌర్యచక్ర అవార్డు వరించింది. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఇబోంచా సింగ్, కానిస్టేబుల్ మాజాహిద్‌ఖాన్ (మరణాంతరం)లకు రాష్ట్రపతి పోలీసు పతకాలు లభించాయి. శ్రీనగర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేసిన ఇద్దరు ఉగ్రవాదులను వీరు హతమార్చారు. ప్రాణాలకు ముప్పు ఉన్నా లెక్కచేయకుండా వీరిద్దరు పోరాడారు. ఈ పోరాటంలో కానిస్టేబుల్ మాజాహిద్‌ఖాన్ అమరుడయ్యాడు. విధినిర్వహణలో వీరు చూపిన ధైర్య సాహసాలకుగాను ఈ పతకాలు వరించాయి. మరోవైపు సీబీఐకి 32 పోలీసు పతకాలు లభించాయి. శారదా కుంభకోణం, 2జీ స్పెక్ట్రం కుంభకోణాన్ని విచారిస్తున్న అధికారులు కూడా పతకాలకు ఎంపికైన వారిలో ఉన్నారు. శారదా కుంభకోణాన్ని పర్యవేక్షిస్తున్న జాయింట్ డైరెక్టర్ పంకజ్ కుమార్ శ్రీవాస్తవకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. 2జీ స్పెక్ట్రం కేసు దర్యాప్తునకు నేతృత్వం వహిస్తున్న ఏఐజీ వివేక్ ప్రియదర్శికి పోలీసు పతకం లభించింది.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

WWW.NTNEWS.COM/DHARMAGANTA

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## మా మాట!

### అధికారులు వెంటనే స్పందిస్తున్నారు



**'నమస్తే తెలంగాణ'లో** ప్రచురితమవుతున్న కథనాలపై అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. గతంలో అధికారులు చేసిన తప్పిదాలతో ఎంతోమంది రైతులు నష్టపోయారు. భూములు కొనుగోలుచేసిన రైతులకు హక్కులు లేకుండా ఉన్నాయి. రెవెన్యూశాఖలో కొందరు అధికారులు తమ లీలలతో పేర్లు మార్పిడిచేసిన ఉదంతాలు ఎన్నో వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం. 'నమస్తే తెలంగాణ'లో రెవెన్యూ అధికారుల తప్పిదాలపై నిత్యం కథనాలు ప్రచురించడం వల్ల పేద రైతులకు మేలు జరుగుతున్నది.

**– సోల్తి సారయ్యగౌడ్, నర్సంపేట, వరంగల్ రూరల్ జిల్లా**

### ఏండ్లనాటి సమస్యలు వెలుగులోకి



**అనేక** ఏండ్లుగా పేరుకుపోయిన సమస్యలు వెలుగులోకి తీసుకురావడంలో 'నమస్తే తెలంగాణ' చేస్తున్న కృషి అభినందనీయం. పత్రికలో గత కొన్ని నెలలుగా వరుస కథనాలు ఇవ్వడం బాగున్నది. రైతులు భూములు కొనుగోలు చేసినా పట్టాలు ఇవ్వక పోవడం, రికార్డులు మార్చడం, ఒకరి భూమి మరొకరి పేరిట రాయడం, మోఖాలో ఉన్నా రికార్డుల్లో భూమి లేకుండా మాయం అవడంలాంటి రెవెన్యూ లీలలు బయటకు వస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పరిష్కారాలు చూపుతున్నారు.

**– ఊడుగుల శ్రీనివాస్, నర్సంపేట, వరంగల్ రూరల్ జిల్లా**

### రైతుల వద్దకే అధికారులు



**కాళ్లు** అరిగేలా తిరిగినా తీరని భూసమస్యలు 'నమస్తే తెలంగాణ' ధర్మగంటలో ప్రచురితమవగానే అధికారులు వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారు. అధికారులు రైతులను వెతుకుంటూ వచ్చి మరీ సమస్యలను అక్కడికక్కడే తీర్చుతున్నారు. ఏండ్లుగా మరుగునపడిన సమస్యలు సహితం 'ధర్మగంట' ద్వారా పరిష్కారమవుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**– చలికంవటి యాదగిరి, జప్తివీప్పగూడెం, మిర్యాలగూడ రూరల్, నల్లగొండ జిల్లా**

### సమస్యలు త్వరగా పరిష్కరిస్తున్నారు



**దీర్ఘకాలంగా** పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'ధర్మగంట'తో పేదోడి ఆవేదన కండ్లకు కట్టినట్టు కనిపిస్తున్నది. దశాబ్దాల సమస్యలు తీరుతున్నాయి. తెలంగాణలో రైతుల బాగుకోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తుంటే.. కొంతమంది అధికారుల తప్పిదాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'ధర్మగంట' ద్వారా సమస్యలు పరిష్కారమవుతుండటం సంతోషంగా ఉన్నది.

**– ఎర్రెడ్ల అంజిరెడ్డి, తోపుచర్ల, మాడ్గులపల్లి మండలం, నల్లగొండ జిల్లా**

# కౌలుదారులే.. పట్టాదారులు

- 6.31 ఎకరాల రికార్డులను ఇష్టారీతిన మార్చిన వీఆర్వో
- 12 ఏండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన ఖమ్మం జిల్లా బాధితుడు

**నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం రెవెన్యూ గ్రామంలో షేక్ హుస్సేన్ సాహెబ్‌కు సర్వే నంబర్లు 1207/ఈ లో 1.20 ఎకరాలు, 1215/ఆ లో 3.02 ఎకరాలు, 1217/1 లో 1.01 ఎకరాల భూమి ఉన్నది. తన సోదరుడు షేక్ గఫూర్ సాహెబ్ వద్ద సర్వే నంబర్లు 1215/ఇ లో ఎకరం, 1217/1లో 0.38 కలిపి 1.38 ఎకరాలను హుస్సేన్ కొన్నారు. మొత్తం 7.31 ఎకరాల భూమిని సాగుచేసుకొంటూ వచ్చారు. కొన్నాళ్ల తర్వాత ఆ భూమిని తెలిసిన వారికే కౌలుకు ఇచ్చారు. అనంతరకాలంలో కౌలుదారులు ఆ భూమిని సొంతంచేసుకోవడానికి ప్రయత్నించారు. దీంతో షేక్ హుస్సేన్‌కు.. కౌలుదారుకు మధ్య భూ తగాదా మొదలైంది. ఇరువర్గాల మధ్య గొడవలు తీవ్రమయ్యాయి. 2000 సంవత్సరంలో షేక్ హుస్సేన్ సాహెబ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆయన భూమి వద్దే హత్యచేశారు. తర్వాత హుస్సేన్ వారసులు మోఖా మీదకు వెళ్తే కౌలుదారులు వారిని భయభ్రాంతులకు గురిచేసి వెళ్లగొట్టారు. 2007లో తాసిల్ కార్యాలయంలో రికార్డులు భద్రపరిచే గది దగ్ధం కావడంతో చాలా రికార్డులు లేకుండాపోయాయి. ఇదే అదునుగా చేసుకొని కౌలుదారు అప్పటి వీఆర్వో సహాయంతో తమకు అనుకూలంగా రికార్డులను తారుమారుచేయించారు. వీఆర్వో కూడా వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారు. తమ భూమిని అక్రమంగా కౌలుదారుకు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తూ హుస్సేన్ పెద్ద కొడుకు షేక్ మూసా రెవెన్యూ కార్యాలయం చుట్టూ పన్నెండేండ్లుగా తిరుగుతూనే ఉన్నారు. అయినా న్యాయం చేయకపోగా, అధికారులు కౌలుదారుకే వత్తాసు పలుకుతున్నారు. భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం నిరుడు జారీచేసిన కొత్త పాస్‌పుస్తకాల్లో ఇద్దరు అన్నదమ్ములకు చెరి 20 గుంటల భూమి మాత్రమే ఉన్నట్టు నమోదుచేసి పాస్‌పుస్తకాలు ఇచ్చారు. పహాణీ రికార్డుల్లో ఇప్పటికీ తమ తండ్రి షేక్ హుస్సేన్ సాహెబ్ పేరే ఉన్నదని బాధితుడు మూసా చెప్తున్నారు. తమ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకొన్నా న్యాయం జరుగలేదని వాపోయారు. తమ భూమిని అన్యాయంగా పట్టా చేయించుకొన్న వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ వాళ్లను పట్టాదారుగా చూపిస్తున్నారని మూసా తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానన్నారు.



రెవెన్యూ అధికారులు 20 గుంటలకే ఇచ్చిన పాస్‌పుస్తకం చూపుతున్న బాధితుడు మూసా

## సరిచేయాలంటే సాగదీస్తున్రు

- ఐదెకరాలకు మిగిలింది 1.10 ఎకరాలే
- న్యాయం చేయాలంటూ సంగారెడ్డి జిల్లా రైతు ఆవేదన



పాస్‌పుస్తకం చూపుతున్న రుక్కమ్మ

**మునిపల్లి:** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన మునిపల్లికి చెందిన రాజగోని రుక్కమ్మకు గ్రామంలో 6.11 ఎకరాల భూమి ఉండేది. అందులో ఎకరం పైచిలుకు ఇతరులకు అమ్మేశారు. మిగిలిన 5.09 ఎకరాలు రుక్కమ్మ పేరిట ఉండాల్సినప్పటికీ అధికారులు.. కబ్జాకోరుల కుమ్మక్కుతో కేవలం 1.10 ఎకరాలు మాత్రమే మిగిలింది. వాస్తవానికి సర్వే నంబర్లు 90 అలో 2.21 ఎకరాలు, 90 ఆ/2లో 2.21 ఎకరాలు, 66 ఇ లో 29 గుంటలు (ఇందులో 26 గుంటలు అమ్ముకోగా.. మిగిలింది 3 గుంటలు) 11అ/2లో 4 గుంటల భూమి ఉన్నది. ఇందులో 1.10 ఎకరాలు రుక్కమ్మ పేరిట ఉంచి మిగతా భూమిని గ్రామానికే చెందిన రాజగోని నరేందర్‌గౌడ్, గణేశ్‌గౌడ్ అనే ఇద్దరు సోదరుల పేరిట రెవెన్యూ అధికారులు మార్చేశారు. ఈ అన్నదమ్ముల్లో నరేందర్ రాజకీయంగా కొంత పలుకుబడి ఉండటంలో మునిపల్లి తాసిల్దార్‌ను తన గుప్పిట్లో ఉంచుకొని దొంగ పాస్‌పుస్తకాల సాయంతో వారి పేర్లమీదకు భూమిని మార్చుకొన్నారని రుక్కమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. తన భూమిని తిరిగి తనపేరిట ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎన్నిసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఉచిత సలహాలిస్తూ సమయం వృథాచేస్తున్నారే తప్ప పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. తనను పొలంలోకి రానివ్వడంలేదని, పొలం దగ్గరకు వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రికార్డులు సరిచేసి తనకు న్యాయంచేయాలని రుక్కమ్మ కోరుతున్నారు.



### రైతుల కలను నెరవేర్చుతున్న సీఎం కేసీఆర్

**రైతులు** కన్న కలలను సీఎం కేసీఆర్ నెరవేర్చుతున్నారు. గత ప్రభుత్వాలు చేయని రైతు సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళన, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతులను అన్ని విధాలుగా ఆదుకొంటున్నారు. 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాలతో రైతు భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కారమవుతున్నాయి.

**– చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి, పెద్దవూర, నల్లగొండ జిల్లా**

## అర ఎకరం అమ్మితే.. మొత్తం భూమి రాసేశారు

- వీఆర్వో చేతివాటం ప్రదర్శించారంటున్న బాధితుడు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నిజామాబాద్ జిల్లా తగ్గెల్లివాసి



బాధిత రైతు మోహన్‌రావు

**బోధన్ రూరల్:** భూరికార్డుల ప్రక్షాళనతో ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే.. ఇదే అదునుగా భావించి కొందరు రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వీఆర్వోలు ఒకరి భూమిని మరొకరికి, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రికార్డుల్లో నమోదు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలాంటి ఘటనే నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో చోటుచేసుకొన్నది. బాధితుడు తనకున్న 1.39 ఎకరాల్లో 20 గుంటలను అమ్మగా, మొత్తం భూమిని అమ్మినట్టుగా కొనుకోలుదారు పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'నా పేరు మోహన్‌రావు. మాది నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని తగ్గెల్లి గ్రామం. నాకు సర్వే నంబర్లు 4/అలో ఎకరం, 4/ఇలో 39 గుంటలు.. మొత్తం 1.39 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో 20 గుంటలను గ్రామానికే చెందిన సుజాతకు నెల రోజుల కిందట విక్రయించాను. అయితే ఆమె పట్టా మార్పిడి కోసం దరఖాస్తు చేసుకొన్నారు. వీఆర్వో అత్యుత్సాహంతో 20 గుంటలకు బదులుగా నా మొత్తం భూమి 1.39 ఎకరాలను ఆమె పేరిట ఆన్‌లైన్‌చేశారు. పంట రుణం రెన్యువల్ కోసం ఆన్‌లైన్ పహాణీ తీయగా, అసలు విషయం బయటపడింది. ఈ విషయమై వీఆర్వోను అడిగితే తనకేమీ తెలియదని, కంప్యూటర్ సమస్య అని చెప్తున్నారు. వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని బోధన్ ఆర్డీవో, తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశాను. ఎలాగైనా నాకు న్యాయంచేయండి.'



**మరుగాళ్ల మురిపెం..**

**వర్షాకాలం** వచ్చిందంటే చాలు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చిన్నారులు మరుగాళ్ల (పాకొండ్లు)పై నడుస్తూ మురిసి పోతుంటారు. ముఖ్యంగా శ్రావణ మాసంలో చిన్నారులు మరుగాళ్లపై ఎక్కువగా నడుస్తుంటారు. చిన్నారులు ఉపయోగించిన మరుగాళ్లను పొలాల అమావాస్య రోజున సమీప వాగుల్లో, శివారు దేవతల వద్ద పడేయడం ఏటా ఆనవాయితీగా వస్తున్నది. బుధవారం జిల్లాలోని దహెగాం మండలంలోని ఇట్యాలలో చిన్నారులు ఇలా మరుగాళ్లపై నడుస్తూ కనిపించారు.

**– దహెగాం**

# అభివృద్ధిలో భాగస్వాములుకండి

### ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మహబూబ్‌నగర్ భగీరథ కాలనీలో హరితహారంతో భాగంగా మొక్కలు నాటారు. హౌసింగ్‌బోర్డు, భగీరథ కాలనీ, పరిమళగిరిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని నెహ్రూ యువకేంద్రం భవనంలో కొనసాగుతున్న వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాన్ని జలశక్తి అభియాన్ చీఫ్ నోడల్ అధికారి శ్రీనివాసరావు, కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఏనుగొండలో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ డీసీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. పాలమూరును సుందరపట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆహ్లాదం కోసం పట్టణంలో పార్కుల అభివృద్ధి చేశామని, మరి కొన్ని పార్కుల అభివృద్ధి చేపడుతామని తెలిపారు. ఐదేండ్లలో రూ.300 కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మయూరి పార్కును ఏర్పాటు చేశానిచెప్పారు. బైపాస్ రోడ్డు, జడ్చర్ల – మహబూబ్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు.



బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బీకేరెడ్డి కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### గ్రామ కార్యదర్శిపై దాడి

సస్పెండైన సర్పంచ్ నిర్వాకం

**రఘునాథపాలెం:** విధుల్లో ఉన్న గ్రామ కార్యదర్శిపై సస్పెన్షన్‌కు గురైన సర్పంచ్ దాడిచేసిన ఘటన బుధవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పంగిడి పంచాయతీలో జరిగింది. పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సర్పంచ్ బానోతు మంగీలాల్‌నాయక్‌ను ఈ నెల 9న కలెక్టర్ సస్పెండ్ చేశారు. గ్రామ కార్యదర్శి ప్రసాద్ బుధవారం ఉపసర్పంచ్ జర్పుల పద్మ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. తన కుమారుడు ప్రవీణ్‌ప్రకాశ్‌నాయక్‌ను వెంటబెట్టుకొని పంచాయతీ కార్యాలయానికి వచ్చిన మంగీలాల్ ఆగ్రహంతో 'నేను లేకుండా గ్రామసభ నిర్వహిస్తావా?' అంటూ కార్యదర్శిపై చేయి చేసుకొన్నాడు. పోలీసులు మంగలాల్, అతని కొడుకుపై కేసు నమోదుచేశారు.

## గర్భంలోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన
- యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వదవాఖానలో ఘటన

**భువనగిరి అర్బన్:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఓ గర్భిణికి గర్భంలోనే శిశువు మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపల్లికి చెందిన లావణ్యకు సోమవారం సాయంత్రం పురిటి నొప్పులు రాగా కుటుంబసభ్యులు ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటల వరకు నొప్పులు ఎక్కువ రావడంతో దవాఖాన సిబ్బంది సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భువనగిరి ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. దవాఖానలో లావణ్యను చేర్చుకొని డ్యూటీ డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితి బాగానే ఉన్నదని సాధారణ ప్రసవం ద్వారానే బిడ్డకు జన్మనిస్తుందని చెప్పారు. కొద్దిసేపటికి లావణ్యకు నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు డ్యూటీ డాక్టర్‌కు విషయం చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. మంగళవారం రాత్రి 10 గంటలకు మరో డాక్టర్ వచ్చి పరిశీలించి ఆపరేషన్ చేశారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో తల్లి కడుపులోనే బాబు మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో గర్భంలోనే శిశువు మృతిచెందిందని బాధితురాలి కుటుంబసభ్యులు, బంధువులు దవాఖానలోనే ఆందోళన చేపట్టారు.

## బాలికపై మైనర్ల లైంగికదాడి

- గద్వాల మండలం ఘటన
- ముగ్గురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

**గద్వాల క్రైం:** జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని ఓ గ్రామంలో ఐదో తరగతి చదువుతున్న బాలికపై అదే ఊరికి చెందిన బాలుడు (14) లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత బాలిక తల్లి వ్యవసాయ కూలీ, తండ్రి ఆటో డ్రైవర్. వీరిద్దరూ బుధవారం ఉదయం పనులకు వెళ్లడంతో ఇంటి దగ్గరే ఉన్న బాలికను, సమీపంలోనే ఉండే బాలుడు ఆడుకుందామని చెప్పి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పింది. ఆరు నెలల కింద కూడా ఈ బాలికపై గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు లైంగికదాడికి పాల్పడ్డారు. గ్రామ పెద్దల జోక్యంతో వ్యవహారం సద్దుమణిగింది. బాలిక తల్లిదండ్రులు బుధవారం తన కూతురిపై లైంగికదాడికి పాల్పడిన బాలుడితోపాటు ఆరు నెలల కిందట కూడా లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు మైనర్లపైనా గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో ముగ్గురు నిందితులపై లైంగికదాడి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆరోగ్య పరీక్షల నిమిత్తం బాలికను దవాఖనకు తరలించి.. ఆ తర్వాత స్టేట్ హోమ్‌కు పంపుతామని గద్వాల సీఐ జక్కుల హనుమంతు చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**పెనుబల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తాళ్లపెంటలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వర్లు (47), దాసరి కృష్ణయ్య (65) పొలం వద్ద రోడ్డు పక్కన ఎరువుల కట్టలు దింపుతుండగా వేగంగా వచ్చిన ఆటో ట్రాలీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు పెనుబల్లి దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి ఇద్దరూ మృతిచెందారు.

## జ్వరంతో వృద్ధుడి మృతి

**మంగపేట(ములుగు):** ములుగు జిల్లా మంగపేట మండలం పూరేడుపల్లి గ్రామానికి చెందిర సప్కనాగయ్య (60) బుధవారం జ్వరంతో మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం నాగయ్యకు జ్వరం రాగా, కుటుంబసభ్యులు ఓ ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. నయం కాకపోవడంతో బుధవారం ఓ ఆటోలో నాగయ్యను తీసుకొని మంగపేటకు బయల్దేరారు. మల్లూరు వాగు వద్ద డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో ఆటో నిలిచిపోయింది. దీంతో నాగయ్యను కుటుంబసభ్యులు చేతులపై ఎత్తుకొని వాగు దాటించి, తీరంపై కూర్చోబెట్టారు. 108 వాహనానికి ఫోన్ చేసినప్పటికీ వాహనం వేరే రూట్‌లో ఉండటంతో రావడానికి ఓ అరగంట ఆలస్యమైంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు.



జ్వరంతో బాధపడుతున్న ములుగు జిల్లా మంగపేట మండలం పూరేడుపల్లికి చెందిన నాగయ్యను మల్లూరు వాగు దాటిస్తున్న కుటుంబసభ్యులు

### మువ్వన్నెల జెండా ర్యాలీలు



**మహబూబ్‌నగర్** జిల్లా చిన్నచింతకుంటలో బుధవారం 83 మీటర్ల భారీ జాతీయ జెండాతో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన దేశ భక్తులను స్మరించుకున్నారు.

**– చిన్నచింతకుంట**



**మంచిర్యాల** జిల్లా బెల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాఠశాల వద్ద ప్రారంభించారు. ర్యాలీ పాఠశాల నుంచి ప్రారంభమై బజార్ ఏరియా మీదుగా కాంటా వరకు కొనసాగింది.

**– బెల్లంపల్లి టౌన్**



### ఎఫ్‌ఆర్వో అనితకు బంగారు పతకం

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర అటవీ శాఖ ఏటా అందించే 'కేవీఎస్ బాబు ఐఎఫ్‌ఎస్ మెమోరియల్' బంగారు పతకానికి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్వో అనిత ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శోభ నుంచి ఉత్తర్వులు అందాయి. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అందులో పేర్కొన్నారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో గురువారం ఈ పురస్కారం అందించనున్నారు.

## అవినీతి అధికారిపై వేటు

**వైరా, నమస్తే తెలంగాణ:** ఖమ్మం జిల్లా వైరాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన సీనియర్ అసిస్టెంట్ ఖదీర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఖదీర్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ డీఆర్వో ఎన్ సైదిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. వైరామండలం సోమవారం గ్రామానికి చెందిన షేక్ గౌస్ పాషా తన కుమార్తె వివాహాన్ని రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. అక్కడి సీనియర్ అసిస్టెంట్ చలానా పేరుతో రూ. 3500 వసూలు చేశాడు. ముస్లింల వివాహ స్పెషల్ రిజిస్ట్రేషన్‌కు కేవలం రూ.20 చలానా మాత్రమే చెల్లించాలని తెలుసుకున్న గౌస్‌పాషా సీనియర్ అసిస్టెంట్ అవినీతి అక్రమాల గురించి మీడియాకు వివరించాడు. ఖదీర్‌ను గౌస్‌పాషా తాను రెండు దఫాలుగా ఇచ్చిన రూ.3500 నగదుకు కట్టిన చలానాలు ఇవ్వాలని నిలదీశాడు. దీంతో ఖదీర్.. గౌస్‌పాషాకు తిరిగి రూ. 3,500 నగదు చెల్లించాడు. ఈ విషయం గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడంతో విచారణ జరిపి అతడిని సస్పెండ్‌చేశారు. వైరాలో పనిచేసిన నాలుగేండ్ల కాలంలో ఖదీర్ సస్పెండ్‌కావడం ఇది రెండోసారి.

epaper.ntnews.com



73వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని వైబ్రెంట్స్ ఆఫ్ కలాం, ఠాగూర్ విద్యా సంస్థల సంయుక్త ఆధర్యంలో ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం 83 మీటర్ల జాతీయ జెండాతో జాతీయ సమగ్రతా ర్యాలీ నిర్వహించారు. -వైరా, నమస్తే తెలంగాణ

# సూదిబెజ్జంలో సమరయోధుల శిల్పాలు

- వరంగల్ కళాకారుడి ప్రతిభ

**నిట్‌క్యాంపస్(వరంగల్):** వరంగల్‌కు చెందిన స్వర్ణకారుడు, ప్రముఖ సూక్ష్మశిల్పి మట్టెవాడ అజయ్ కుమార్ పదిమంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను సూది బెజ్జంలో చెక్కి ఔరా అనిపించాడు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, సరోజనీనాయుడు శిల్పాలను సూది రంధ్రంలో చెక్కాడు.





సూది బెజ్జంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, సూక్ష్మశిల్పి మట్టెవాడ అజయ్ కుమార్

మైక్రోస్కోపు ద్వారా చూస్తే అందులో వారు ధరించిన దుస్తులు, బట్టల మడతలు స్పష్టంగా కనిపించడం విశేషం. వీటిని చెక్కడానికి 67 గంటల సమయం పట్టిందని అజయ్ కుమార్ తెలిపారు.

నేడు రాఖీ పండుగ



## ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

- పాతచట్టం ప్రకారమే పుర ఎన్నికలు
- 109 రోజులు నిబంధన గరిష్ఠ పరిమితి మాత్రమే
- హైకోర్టులో పురపాలకశాఖ వాదనలు
- మున్సి'పోల్స్'పై విచారణ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 132 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పురపాలకశాఖ హైకోర్టుకు నివేదించింది. ప్రీపోల్ ప్రక్రియలో భాగంగా వార్డుల విభజనను అసంబద్ధంగా చేపట్టారని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని పలువురు దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్‌అక్తర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారించింది. అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. వార్డుల విభజన తదితర అంశాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించామని తెలిపారు. పురపాలకశాఖ దాఖలుచేసిన కౌంటర్‌లో అన్ని వివరాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 109 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని సింగిల్ జడ్జి ధర్మాసనం వద్ద అనుమతి తీసుకుని, ఎనిమిదిరోజుల్లో ప్రక్రియను ఎలా పూర్తిచేశారని ప్రశ్నించింది. దీనికి ఏఏజీ సమాధానమిస్తూ.. సింగిల్ జడ్జి ధర్మాసనం ప్రీఎలక్షన్ ప్రక్రియను పూర్తిచేసేందుకు 109 రోజుల గరిష్ఠ పరిమితి మాత్రమే విధించిందని.. ఆలోపు ఎప్పుడైనా ప్రక్రియను పూర్తిచేయవచ్చని పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనల ప్రకారం జీవో 78 జారీచేసి విభజన, ఇతర ప్రక్రియలు చేపట్టినట్టు తెలిపారు. కొత్త చట్టం, ఆర్డినెన్స్ తీసుకొచ్చినప్పుడు పాతచట్టం ప్రకారం జీవో ఎలా జారీచేస్తారని పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. కొత్త ఆర్డినెన్స్ అమలులో ఉన్నప్పుడు పాత చట్టం ప్రకారం ఎన్నికలు ఎలా చేపడుతారని ప్రశ్నించింది. దీనికి ఏఏజీ సమాధానమిస్తూ.. నూతన చట్టంకోసం బిల్లు తీసుకురావటానికి, ఆర్డినెన్స్ జారీచేయడానికి ముందే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించామని, ఈ సందర్భంగా పాత చట్టం ప్రకారమే ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నూతనంగా జారీచేసిన ఆర్డినెన్స్‌తోపాటు వార్డుల విభజనకు అనుసరించిన విధానాన్ని సమర్పించాలని హైకోర్టు కోరింది. ఈ మేరకు విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.

# మత్స్యకారులకు కాళేశ్'వరం'!

- ఏడాది పొడవునా పని
- 3 వేల కుటుంబాలకు జీవనోపాధి
- జీవవైవిధ్యానికి చిహ్నంగా మారనున్న కాళేశ్వరం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందిన కాళేశ్వరం ప్రాజెక్టు మత్స్యకారులపాలిట వరంగా మారనున్నది. గోదావరి ప్రాజెక్టుపై కొత్తగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పరిధిలో నిర్మించిన లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్, పార్వతి(సుందిళ్ల) బరాజ్, సరస్వతి (అన్నారం)బరాజ్‌లతో కొత్తగా 20 వేల హెక్టార్ల విస్తీర్ణంలో నీటి వనరులు చేపల పెంపకానికి వినియోగంలోకి రానున్నాయి. దీంతో చేపలు, రొయ్యల పెంపకంతో మత్స్యకార కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభించనున్నది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి చేపట్టిన నాల్గో విడుత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ మూడు బరాజ్‌ల్లో 1.24 కోట్ల చేపపిల్లలు, 24 లక్షల రొయ్య పిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నిర్ణయంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని 27 గ్రామాలకు చెందిన మత్స్యకారులకు చేపల వేటకు అవకాశాలు మెరుగుకానున్నాయి. ప్రస్తుతం ఈ మూడు జిల్లాల పరిధిలో 27 మత్స్య సొసైటీలకు చెందిన 693 మంది గుర్తింపు పొందిన మత్స్యకారులున్నారు. ప్రాజెక్టులో చేపల పెంపకానికి అవకాశాలు పెరుగడంతో ఈ వృత్తిపై ఆధారపడే వారిసంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని 11 గ్రామాల్లో 92 మంది, మంచిర్యాలలోని ఆరు గ్రామాలకు చెందిన 418 మంది, పెద్దపల్లి జిల్లాలోని 10 గ్రామాలకు చెందిన 193 మంది మత్స్యకారులు చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. కొత్తగా ఈ మూడు బరాజ్‌ల పరిధిలో కొత్తగా చేపల సాగు చేపడుతున్నందున ఈ సంఖ్య 3 వేలకు చేరనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



**బేస్‌లైన్ సర్వే నిర్వహించిన మత్స్యశాఖ**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో మూడు బరాజ్‌ల నిర్మాణం పూర్తికావడానికి ముందే భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో మత్స్యశాఖ ప్రాథమికంగా బేస్‌లైన్ సర్వేను చేపట్టింది. సర్వేలో గోదావరి నదిపై బరాజ్‌లను నిర్మించడంవల్ల మత్స సంపదను పెంచేందుకు అవకాశాలుంటాయని గుర్తించారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని భూపాలపల్లి జిల్లాలోని 11 గ్రామాల్లో ఇప్పటికే 92 మంది చేపల వేట చేపడుతుండగా, కొత్తగా మరో 323 మందిని గుర్తించారు.మంచిర్యాల జిల్లాలో కొత్తగా 450 మందిని, పెద్దపల్లి జిల్లాలో కొత్తగా మరో 250 మంది అర్హత కల్గిన మత్స్యకారులున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కల్గిన మత్స్యకారులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయనున్నట్లు మత్స్యశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

**వరద ఉధృతి తగ్గాకే..**

ఈనెల 16న భూపాలపల్లి జిల్లాలో అధికారికంగా నాల్గో విడుత చేపపిల్లల పంపిణీ ప్రారంభించేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేపట్టింది. కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి అధికంగా ఉండటంతో చేపపిల్లల పంపిణీని లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత పూర్తిస్థాయిలో చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

**ఇతర నదుల నుంచి చేపల వలసతో జీవవైవిధ్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన సుందిల్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లు రాబోయే రోజుల్లో మత్స్యవైవిధ్యానికి నెలవుగా మారే అవకాశాలున్నట్టు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు గోదావరి నదిపై ఆనకట్టలు లేకపోవడంతో.. ఈ నది పరిధిలోని నీటితోపాటు చేపలు కిందకు వలస వెళ్లేవని గుర్తు చేశారు. కొత్తగా బరాజ్‌లు కట్టడం వల్ల గోదావరి నదిలోని నీటిని నిల్వచేయడంతో పాటు, నదిలోని చేపలను నిలిపివేసే అవకాశం లభించిందన్నారు. వీటితో పాటు కడెం, ప్రాణహిత వంటి ఉపనదుల నుంచి కూడా చేపలు ఈ బరాజ్‌లోకి చేరుతాయనీ, కొతగా వదిలే చేపపిల్లలు, రొయ్య పిల్లలతో రాబోయే రోజుల్లో జీవవైవిధ్యం పెంపొందే అవకాశం మెరుగవుతుందని వెల్లడించారు. త్వరలో గ్రామాల్లో మత్స్యశాఖాధికారులు శిక్షణనిచ్చే కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

| బరాజ్ | విస్తీర్ణం | చేపపిల్లలు | రొయ్య పిల్లలు | ప్రస్తుతం మత్స్యకారులు | కొత్తగా గుర్తింపు పొందిన వారు |
|---|---|---|---|---|---|
| లక్ష్మీ (మేడిగడ్డ) | 9,400 హెక్టార్లు | 47లక్షలు | 11.75 లక్షలు | 92 | 323 |
| సరస్వతి (అన్నారం ) | 7,200 హెక్టార్లు | 36 లక్షలు | 9.00లక్షలు | 193 | 250 |
| పార్వతి(సుందిల్ల) | 4,200హెక్టార్లు | 21లక్షలు | 5.25 | 418 | 450 |

## మొక్కలను సంరక్షించుకోవాలి

- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్:** భవిష్యత్ తరాలు బాగుండాలంటే పచ్చదనం పెంపొందించడమే మార్గమని విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదోవిడుత హరితహారంలో భాగంగా సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని చెవ్వెంల మండలంలో బుధవారం ఒకేరోజు 1.12 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మూడుగ్రామాల్లో 4 కిలోమీటర్ల మేర హరితహారం నిర్వహించారు. మంత్రి జగదీశ్‌రెడ్డికి అడుగడుగునా విద్యార్థులు నృత్యాలు, ఆటపాటలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొక్కలు నాటకుంటే భవిష్యత్‌లో ఆక్సిజన్ కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నాటిన ప్రతి మొక్కకు రాఖీలు కట్టి సోదరభావంతో మొక్కలను సంరక్షించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, కలెక్టర్ అమయ్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా చివ్వెంలలో మొక్కనాటి పారతో మట్టిపోస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

### ఆనందంగా జీవించేందుకు 'సర్వే ఆనందోత్సవ్'

- ఒకేసారి లక్షమందికి నేర్పనున్న శ్రీశ్రీ రవిశంకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణః జీవితాన్ని ఆనందంగా గడపడం ఎలాగన్న విషయాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ ఈ నెల 16, 17, 18 తేదీల్లో 'సర్వే ఆనందోత్సవ్' ద్వారా ఒకేసారి లక్షమందికి నేర్పించనున్నారు. హైదరాబాద్‌లోని 80కిపైగా కేంద్రాలుసహా తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఔత్సాహికులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం, సుదర్శన క్రియ ద్వారా ఎవరికివారే తమ శక్తిని పెంచుకోవచ్చని, మూడురోజులపాటు జరిగే 'సర్వే ఆనందోత్సవ్' కార్యక్రమంలో పరస్పర చర్చలు, జ్ఞానబోధలు చేయడంతోపాటు జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులను, కష్టాలను అధిగమించేందుకు సుదర్శన క్రియ, యోగా, ప్రాణాయామం, ధ్యానం, తదితర విధానాలను నేర్పిస్తారని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం https://www.artofliving.org/in-en/anand-utsav వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## బాబు ప్రోద్బలంతోనే బీజేపీలో చేరికలు

- కాలంచెల్లిన నాయకులతో బీజేపీకి ఒరిగేది శూన్యం
- కశ్మీర్ అంశాన్ని రాజకీయ కోణంలో చూడలేం
- అందుకే ఆర్టికల్ 370 రద్దుకు టీఆర్ఎస్ మద్దతు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగుదేశం పార్టీ నేతలు బీజేపీలో చేరడంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రోత్సాహం ఉన్నదని, బీజేపీలో టీడీపీ నేతల చేరిక గురించి చంద్రబాబు నోరుమెదపకపోవడమే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాలంచెల్లిన, ప్రజాదరణ కోల్పోయిన నాయకుల చేరికతో బీజేపీకి లాభమేమీ ఉండదని, క్యాడర్ లేకుండా నాయకులు చేరినంత మాత్రాన పార్టీ బలపడదని, కేంద్ర ప్రభుత్వ పలుకుబడి మున్సిపల్ ఎన్నికల్లో పనిచేయదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడమన్నది కేవలం ఊహాగానం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. కశ్మీర్ అంశాన్ని రాజకీయ కోణంలో చూడలేమని, అందుకే పార్లమెంట్‌లో ఆర్టికల్ 370 రద్దు బిల్లుకు టీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమన్న బీజేపీ.. ఆ బిల్లును ఎందుకు ఆమోదించడంలేదని మంత్రి తలసాని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు కేంద్రం జాతీయ హోదా ఎందుకు ఇవ్వడంలేదని నిలదీశారు. బీజేపీలో కొత్త నాయకులు లేరని, ఆ పార్టీలో గత రెండు మూడు దశాబ్దాలుగా ఉన్న నాయకులే ఇప్పుడూ ఉన్నారని, బీజేపీకి నిజంగా బలముంటే పరిషత్ ఎన్నికల్లో కనీస సీట్లను కూడా ఎందుకు గెలవలేకపోయిందని ప్రశ్నించారు. ఏపీలో చంద్రబాబు ఓడిపోతాడంటే చాలామంది నమ్మలేదని, అక్కడ ఫలితం ఏవిధంగా ఉన్నదో ఇప్పుడు అందరూ చూశారని అన్నారు. తన కుమారుడు సాయికిరణ్‌కు మేయర్ పదవి అడిగినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని మంత్రి తలసాని పేర్కొన్నారు.



## డోలి మోసి.. ప్రాణాలు నిలిపి

### ఆదర్శంగా నిలిచిన ఉల్వనూరు వైద్యుడు రాంబాబు

**పాల్వంచ రూరల్:** వైద్యుడు భగవంతుడితో సమానమన్న నానుడిని నిజం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండంలోని ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు. బుధవారం పాల్వంచ మండలంలోని రాళ్లచెలకలో వైద్యశిబిరం నిర్వహించేందుకు వైద్యుడు రాంబాబు వెళ్లారు. గ్రామంలో మడివి సుక్క అనే మహిళ కవలలకు జన్మనిచ్చి అస్వస్థతకు గురైంది. ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉండటంతో ఆమెకు వైద్యుడు ప్రాథమిక చికిత్సను అం దించారు. అంబులెన్స్‌కు సమాచారమిచ్చి బంధువుల సాయంతో ఆరు కిలోమీటర్లు డోలిలో ఉల్వనూరు వరకు మోసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాళ్ల చెలకలో డోలి మోస్తున్న డాక్టర్ రాంబాబు

## కళేబరాల డంపుతో ఇబ్బందులు



నిజామాబాద్ జిల్లా మల్కాపూర్(ఎ) శివారులో పడేసిన కళేబరాలు

**నిజామాబాద్ రూరల్:** నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్(ఎ) గ్రామశివారులో ఉన్న గుట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి పశువుల కళేబరాలను పెద్దఎత్తున డంపు చేసి ఆరబెట్టాడు. వాటి దుర్వాసనకు మల్కాపూర్(ఎ), లక్మాపూర్, గుండారం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాపూర్(ఎ) సర్పంచ్ శేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, గుండారం సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఎంపీటీసీ అంకల గంగాధర్, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు బుధవారం పశువుల కళేబరాలు డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. భరించలేని దుర్వాసన వెదజల్లడంతో ముఖాలకు ముసుగులు ధరించి వాటిని పరిశీలించారు. ఈ విషయాన్ని పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఎదురుకాకుండా చర్యలుతీసుకోవాలని మల్కాపూర్(ఎ) సర్పంచ్ శేఖర్‌గౌడ్ అధికారులను కోరారు.

## గ్రామాభివృద్ధికి పెద్దపీట

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల

**మంథని, నమస్తే తెలంగాణ/కమాన్‌పూర్:** గ్రామాభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ దూసుకెళ్తున్నారనీ.. పల్లెల ప్రగతికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో బుధవారం పర్యటించిన మంత్రి, పలుఅభివృద్ధి పనులను ప్రారంభించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మొదటగా డిస్ట్రిక్ మినరల్ ఫండ్ కింద మంజూరైన రూ.28 కోట్లతో పెద్దపల్లి – మంథని రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. మంథని పట్టణంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కోటిమొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. చైనాలో 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ చైనా' అనే ఉద్యమాన్ని నిర్వహించి 600 కోట్ల మొక్కలు నాటారనీ.. అదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంథనిలో సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీచేశారు. కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఖేలో ఇండియాకు మంథని గురుకుల చెందిన ఇద్దరు విద్యార్థులుండటం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నాయకురాలు గీతాబాయి మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్‌నేత, జడ్పీ చైర్మన్ పుట్ట మధు

### మల్లన్నసాగర్ కేసులో హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పుపై స్టే

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్నసాగర్ నిర్మాణంలో కోర్టు ధిక్కారం విషయమై కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్‌ఈ టి.వేణు, సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి, తొగుట తహసీల్దార్ వీర్‌సింగ్‌లకు హైకోర్టు సింగిల్ జడ్జి రెండు నెలల జైలుశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై బుధవారం హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి తప్పుడు సమాచారం ఇవ్వలేదన్న ప్రభుత్వ న్యాయవాది చేసిన వాదనతో ఏకీభవిస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రచౌహన్, జస్టిస్ షమీమ్‌అక్తర్‌తో కూడిన ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు, శిక్షల పై స్టే విధించినట్టు సిద్దిపేట కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. కేసు పూర్వాపరాల విషయానికి వస్తే 2016 – 17లో భూపరిహారం చెల్లించినప్పటికీ పునరావాస పరిహారం చెల్లించనిదే ప్రాజెక్టు నిర్మాణం చేయకూడదని గతంలో హైకోర్టు పలు కేసుల్లో స్టేలు విధించింది. పునరావాస పరిహారాన్ని యుద్ధ ప్రాతిపదికన గత మే, జూన్ నెలల్లో ప్రభుత్వం చెల్లించింది. అదే సమయంలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగడంపై నిర్వాసితుల్లోని కొందరు కోర్టు ధిక్కార కేసులు వేశారు. దాదాపు 8 కోర్టు ధిక్కార కేసుల్లో 3 కేసుల్లో సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. మొదటి, రెండు కేసుల్లో తొగుట ఎస్సై, ప్రాజెక్టు ఎస్‌ఈ, ఈఈతో పాటు ప్రాజెక్టు కాంట్రాక్ట్ మేనేజర్లకు రెండు నెలల జైలుశిక్షను విధించారు. రెండు వారాల క్రితమే డివిజన్ బెంచ్ ఆ శిక్షలను సస్పెండ్ చేసింది. మూడో కేసులో ఆర్డీవో, తహసీల్దార్, ఎస్‌ఈల పై జైలు శిక్ష విధించిన క్రమంలో బుధవారం డివిజన్ బెంచ్ అప్పీల్లో స్టే విధించి రద్దు పరిచింది.

## 'ఫ్యాన్స్' ఎగ్జికూటివ్ కౌన్సిల్‌కు హేమలత ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ న్యూట్రిషన్ సొసైటీస్ (ఫ్యాన్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ హేమలత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నాలుగేండ్లపాటు (2019 నుంచి 2023 వరకు) ఆమె ఈ కౌన్సిల్‌లో కొనసాగుతారు. గర్భిణులతోపాటు శిశువుల పోషకాహారంపై అనేక పరిశోధనలు చేసిన డాక్టర్ హేమలత.. పండూరి వీఆర్ రావు గోల్డ్‌మెడల్‌తోపాటు డాక్టర్ రాజమ్మల్ పీ దేవదాస్ మెమోరియల్ అవార్డును అందుకున్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్, తెలంగాణ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ న్యూట్రిషన్ సైన్సెస్‌లో ఫెలోగా కూడా ఆమె ఉన్నారు.

## 'బాబుకు97 మందితో భద్రత కల్పించాలి'

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** టీడీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు మొత్తం 97 మంది భద్రతా సిబ్బందిని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. క్లోజ్‌డ్ సెక్యూరిటీ ఎవరి పని అనే అంశంపై ఎన్ఎస్‌జీ, స్టేట్ సెక్యూరిటీ మధ్య నెలకొన్న అభిప్రాయభేదాలపై మూడు నెలల్లో ఒక నిర్ణయానికి రావాలని నిర్దేశించింది. చంద్రబాబు కాన్వాయ్‌లో జామర్ వాహన సౌకర్యం కల్పించాలని ఆదేశించింది. చంద్రబాబుకు సీఎస్‌వోను ప్రభుత్వం నియమించవచ్చని హైకోర్టు తెలిపింది. తన భద్రతను కుదించడాన్ని సవాల్‌చేస్తూ చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఇటీవలే వాదనలు ముగిశాయి.

### జగిత్యాల కలెక్టర్‌కు

# ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అవార్డు

- 21న ఢిల్లీలో ప్రదానోత్సవం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌లెన్స్ ఇన్ గవర్నెన్స్' అవార్డును అందుకోనున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాంవిలాస్ పాశ్వాన్, రవిశంకర్‌ప్రసాద్, పీయూష్ గోయల్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. శరత్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జాతీయస్థాయి గుర్తింపు లభించినప్పటికీ వివిధ కారణాలరీత్యా పురస్కార ప్రదానోత్సవం వాయిదాపడింది. దీంతో ఆ పురస్కారాన్ని అందుకునేందుకు ఢిల్లీకి రావాల్సిందిగా నిర్వాహకులు ఇటీవల శరత్‌కు ఆహ్వానాన్ని పంపారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించిన సర్వేలో శరత్ జాతీయస్థాయిలో ఉత్తమ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలుచేయడం, ఉత్తమ పాలన కోసం కృషిచేయడం లాంటి అంశాల్లో ఈ సర్వే నిర్వహించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్.. దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్ల పనితీరుపై లోతైన అధ్యయనం జరిపిన అనంతరం ఒక్కో రంగంలో ఒకరిని ఎంపిక చేసింది. జిల్లాల అభివృద్ధి కోసం వినూత్న రీతిలో కృషిచేస్తున్న టాప్–15 కలెక్టర్లలో శరత్ ప్రథమ స్థానంలో నిలిచారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌లెన్స్ ఇన్ గవర్నెన్స్' అవార్డుకు ఎంపికవడం చాలా సంతోషాన్ని కలిగిస్తున్నదని, ఈ అవార్డు తనను వరించడానికి రాష్ట్రప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే కారణమని శరత్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, తన విధులను మరింత సమర్థంగా నిర్వర్తించేందుకు ఈ అవార్డు ప్రోత్సాహకంగా నిలుస్తుందని చెప్పారు.



# ప్రపంచ విజేత భారత్

**వికలాంగుల వరల్డ్ టీ20 సిరీస్.. ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయం**



**ముంబై:** వైకల్యం శరీరానికే కానీ..ప్రతిభకు కాదని నిరూపించారు మన భారత వికలాంగ క్రికెటర్లు. బ్రిటీష్ గడ్డపై టీమ్ఇండియా క్రికెటర్లు తమ స్వప్నాన్ని నెరవేర్చుకోలేని చోట వికలాంగులు.. మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించారు. తొలి వికలాంగుల ప్రపంచ టీ20 సిరీస్‌లో భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ఆతిథ్య ఇంగ్లండ్‌పై 36 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆర్‌జీ సాంతె(34 బంతుల్లో 53) అర్ధ సెంచరీకి తోడు ఓపెనర్ కేడీ ఫనాసె(36), మహేంద్రన్(33) రాణించడంతో టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్..ఫనాసె, గోయల్ బౌలింగ్ విజృంభణతో 9 వికెట్లకు 144 పరుగులకే పరిమితమైంది. లక్ష్యాన్ని అందుకునే క్రమంలో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడం ఇంగ్లండ్ కొంపముంచింది. వరల్డ్ టీ20 సిరీస్ గెలిచిన భారత వికలాంగుల జట్టును బీసీసీఐ ప్రత్యేకంగా అభినందించింది. బోర్డు గుర్తింపు ఉన్నా..ఎలాంటి ఆర్థిక సహాయం పొందని వికలాంగుల జట్టు అంచనాలకు అనుగుణంగా రాణించి విజేతగా నిలిచింది. దీంతో పలువురు మాజీ క్రికెటర్లు భారత వికలాంగుల జట్టు ప్రదర్శనను అభినందిస్తున్నారు.

**సంక్షిప్త స్కోర్లు: భారత్:** 20 ఓవర్లలో 180/7 (సాంతె 53, ఫనాసె 36, ఓబ్రెయిన్ 2/35), **ఇంగ్లండ్:** 20 ఓవర్లలో 144/9 (బ్రౌన్ 44, ఫ్లిన్ 28, ఫనాసె 2/15).

# సునీల్‌కు మందలింపు

**క్షమాపణతో వెనక్కి తగ్గిన బీసీసీఐ**

**విండీస్ పర్యటనకు కొనసాగించేందుకు నిర్ణయం**



**న్యూఢిల్లీ:** అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సునీల్ సుబ్రమణ్యం విషయంలో బీసీసీఐ కొన్ని గంటల వ్యవధిలో మనసు మార్చుకుంది. భారత హైకమిషన్ అధికారులతో అమర్యాదకరంగా ప్రవర్తించాడన్న కారణంతో ఉన్నఫళంగా వెస్టిండీస్ పర్యటన నుంచి బయల్దేరి రావాల్సిందిగా ఆదేశించిన బీసీసీఐ తమ నిర్ణయాన్ని విరమించుకుంది. భేషరతు క్షమాపణతో సంతృప్తి చెందిన బీసీసీఐ మిగిలిన పర్యటనకు సుబ్రమణ్యంను కొనసాగించేందుకు మొగ్గుచూపింది. ఈ మేరకు క్రికెట్ పరిపాలకుల కమిటీ(సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్ మీడియాతో మాట్లాడారు. 'భారత ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తి అనేది సునీల్ సుబ్రమణ్యంకు తెలియదు. హైకమిషన్ అధికారులతో అమర్యాదకరంగా ప్రవర్తించాడని తెలిసిన తర్వాత వెంటనే స్వదేశానికి బయల్దేరి రావాల్సిందిగా ఆదేశించాం. కానీ జరిగిన దాని పట్ల అతను బేషరతుగా క్షమాపణలు చెప్పాడు. దీంతో విండీస్ పర్యటన పూర్తయ్యే వరకు జట్టుతో కొనసాగేందుకు సునీల్‌కు అవకాశమిచ్చాం' అని రాయ్ అన్నారు. అయితే జరిగిన విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సీవోఏ చీఫ్..సునీల్‌ను తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. పూర్తి వివరాల్లోకెళితే ప్రభుత్వ ఆదేశాల మేరకు జల సంరక్షణ కోసం భారత క్రికెటర్లతో కలిసి ఓ వీడియో షూట్ చేసేందుకు సహకరించాలని అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సునీల్‌ను హైకమిషన్ అధికారులు కోరారు. 'విసిగించేలా నన్ను సందేశాలతో ముంచెత్తకండి' అంటూ సీనియర్ అధికారుల పట్ల సునీల్ అమర్యాదకరంగా ప్రవర్తించాడు. దీంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సునీల్ ప్రవర్తనపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నఫళంగా విండీస్ నుంచి బయల్దేరి రావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే నిద్రలేమి కారణంగా తాను అలా ప్రవర్తించాల్సి వచ్చిందని సునీల్ క్షమాపణలు కోరాడు. అయినా ఇలాంటివి సునీల్‌కు కొత్తేం కాదు..ఆస్ట్రేలియాలో భారత్ టెస్ట్ సిరీస్ గెలిచినప్పుడు అక్కడి సీఏ అధికారులతో ఈ మేనేజర్ వ్యవహరించిన తీరు వార్తల్లోకెక్కింది. దీనికి తోడు ఇటీవలి ప్రపంచకప్‌లోనూ జట్టు గురించి పట్టించుకోవాల్సిందిపోయి కుటుంబసభ్యులు, స్నేహితుల కోసం టిక్కెట్లు కేటాయించడంలో సునీల్ బిజీగా గడిపినట్లు బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు.

# డేవిస్‌కప్‌లో మార్పుల్లేవ్

**వాయిదా వేయబోమన్న ఐటీఎఫ్**

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌లో జరిగే డేవిస్‌కప్ మ్యాచ్‌లను వాయిదా వేయాలని లేదా తటస్థ వేదికకు మార్చాలన్న అఖిల భారత టెన్నిస్ సమాఖ్య(ఏఐటీఏ) విజ్ఞప్తులను అంతర్జాతీయ టెన్నిస్ సంఘం(ఐటీఎఫ్) తోసిపుచ్చింది. నిర్ణయించిన తేదీల్లో, వేదికల్లో ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు చేయడం లేదని బుధవారం ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరిగినందున పాక్‌తో తమ జట్టు ఆడే మ్యాచ్‌లను వాయిదా లేదా తటస్థ వేదికకు మార్చాలని అంతకు ముందు ఐటీఎఫ్‌ను ఏఐటీఏ కోరింది. దీనికి స్పందించిన ఐటీఎఫ్ మార్పులు కుదరవంటూ భద్రత ప్రణాళికను ఏఐటీఏకు పంపింది. సోమవారం తమ భద్రత అధికారులతో చర్చించాలని సూచించింది. 'భద్రత ప్రణాళికను వారు(ఐటీఎఫ్) పంపారు. దాని ఆధారంగా తేదీలు, వేదిక మార్చడం అవసరం లేదని భావిస్తున్నారు. రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు వారు అర్థం చేసుకోవడం లేదు. చర్చల కోసం ఐటీఎఫ్‌ను కోరాం. కానీ డేవిస్‌కప్ గురించి బోర్డు చర్చించదని చెబుతున్నారు. డేవిస్‌కప్ కమిటీతో మాట్లాడాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఈనెల 19న ఐటీఎఫ్ భద్రత సలహాదారు, ఎగ్జిక్యూటివ్‌లు చర్చిస్తారు' అని ఏఐటీఏ ప్రధాన కార్యదర్శి హిర్మణయ్ చటర్జీ తెలిపారు.

# ప్రపంచ రెజ్లింగ్ చాంప్ దీపక్




**జూనియర్ వరల్డ్ రెజ్లింగ్‌లో భారత్‌కు స్వర్ణం**

**న్యూఢిల్లీ:** భారత యువ రెజ్లర్ దీపక్ పూనియా చరిత్ర సృష్టించాడు. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాన్ని అద్భుతంగా ఒడిసి పట్టుకున్నాడు. ఎస్తోనియా వేదికగా జరిగిన జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో దీపక్ పసిడి పతకంతో సత్తాచాటాడు. 18 ఏండ్ల తర్వాత ప్రతిష్ఠాత్మక టోర్నీలో స్వర్ణం గెలిచిన తొలి భారత రెజ్లర్‌గా పూనియా రికార్డుల్లోకెక్కాడు. పూనియా కంటే ముందు 2001లో జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ టోర్నీలో రమేశ్ కుమార్(69కి), పల్విందర్‌సింగ్(130కి) భారత్‌కు పసిడి పతకాలు అందించారు. బుధవారం జరిగిన పురుషుల 86కిలోల ఫైనల్లో దీపక్, రష్యా రెజ్లర్ అలిక్ షెబుజ్‌కోవ్‌తో బౌట్ 2-2తో సమమైంది. అయితే చివరి పాయింట్ దీపక్ ఖాతాలోకి రావడంతో రిఫరీ అతడ్ని విజేతగా ప్రకటించాడు. తన తొలి బౌట్‌లో మిలాన్ కోర్సాగ్‌పై 10-1తో, ఆపై హంటర్ లీ(కెనడా)పై 5-1తో గెలిచిన పూనియా..సెమీస్‌లో మైరానీ మైసురాడ్జెను 3-2తో చిత్తుచేసి తుది పోరులో నిలిచాడు. మరోవైపు 92కిలోల విభాగంలో వికీ 4-3తో బాట్మజ్ఞ ఎన్కుతువిషిన్(మంగోలియా)పై గెలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు.




**స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**

# విండీస్ జోరు

**గేల్ ధనాధన్ ఇన్నింగ్స్**

**భారత్‌తో మూడో వన్డే**

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** భారత్, వెస్టిండీస్ సిరీస్‌ను వరుణుడు నీడలా వెంటాడుతూనే ఉన్నాడు. టీ20 సిరీస్ తొలి మ్యాచ్ నుంచి మొదలుపెడితే వన్డే సిరీస్‌లోనూ కొనసాగుతూ ప్రతీ మ్యాచ్‌కు అంతరాయం కల్గిస్తూనే ఉన్నాడు. అలా రావడం ఇలా వెళ్లడంతో మైదానంలో ఉన్న అభిమానులకు తోడు టీవీల్లో చూస్తున్న ప్రేక్షకులకు ఒకింత చిరాకు కల్గించింది. వర్షం కారణంగా 35 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో కడపటి వార్తలందేసరికి విండీస్ 29 ఓవర్లలో 4 వికెట్లకు 194 పరుగులు చేసింది.



**గేల్ ధనాధన్:**

తొలుత టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్..బ్యాటింగ్ ఎంచుకున్నాడు. విండీస్ విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్(41 బంతుల్లో 72, 8 ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మరో ఓపెనర్ ఎవిన్ లెవిస్(29 బంతుల్లో 43, 5ఫోర్లు, 3సిక్స్‌లు)తో కలిసి దూకుడైన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. భువనేశ్వర్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా ముగించిన గేల్..ఫ్రీ హిట్‌ను సిక్స్‌గా మలిచి ఖాతా తెరిచాడు. వరుణుడు రంగప్రవేశంతో మ్యాచ్ కొద్దిసేపు ఆగిపోయింది. భువీ బౌలింగ్‌లో లెవిస్ రెండు ఫోర్లు, సిక్స్ బాదగా, తానేం తక్కువ కాదన్నట్లు గేల్..షమీని లక్ష్యంగా చెలరేగాడు. ఓ భారీ సిక్స్‌కు తోడు మూడు ఫోర్లతో 20 పరుగులు పిండుకున్నాడు. విండీస్ ద్వయం ఎడాపెడా బౌండరీలు బాదడంతో పది ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 114 పరుగులు చేసింది.

**స్కోరుబోర్డు**

**వెస్టిండీస్:** గేల్(సి)కోహ్లీ(బి)ఖలీల్ 72, లెవిస్(సి)ధవన్(బి)చాహల్ 43, హోప్ (బి)జడేజా24, హెట్మెర్(బి) షమీ25, 18 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 29 ఓవర్లలో 194/4; **వికెట్ల పతనం:** 1-115, 2-121,3-171,4-171; **బౌలింగ్:** భువనేశ్వర్ 5-1-48-0, షమీ 5-1-41-1, ఖలీల్ 5-0-50-1, చాహల్ 7-0-32-1, జడేజా 4-0-18-1.

# గేల్ గుడ్‌బై..!

**అంతర్జాతీయ క్రికెట్‌కు స్వస్తి..!**




**అతడు ఫామ్‌లోకి వస్తే బౌండరీలు చిన్నబోతాయి... బౌలర్లు బెదిరిపోతారు.. బంతి ఎక్కడేసిన బౌండరీ గీత దాటుతుంది.. స్కోరు ప్రవాహంలా పరుగెత్తుతూనే ఉంటుంది.. వీరబాదుడు ముందు కొండంత లక్ష్యాలు అమాంతం కరిగిపోతాయి.. అతడే విండీస్ వీరుడు క్రిస్ గేల్. హిట్టింగ్‌కు మారుపేరులా మారిన ఈ కరీబియన్ క్రికెట్ కింగ్ అంటే వెస్టిండీస్ అభిమానులకే కాదు ప్రతీ క్రికెట్ ప్రేమికుడికి ఇష్టమే. మ్యాచ్‌ను మరిచి ఒక్కోసారి ప్రత్యర్థి ఆటగాళ్లే అతడి బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తారంటే అతిశయోక్తి కాదేమో. క్రికెట్‌లో విండీస్ తరపున ఎన్నో రికార్డులను సృష్టించి.. ఎన్నో అపూర్వ విజయాలను అందించిన గేల్ అంతర్జాతీయ కెరీర్‌కు ఇక ఫుల్‌స్టాప్ పడినట్టే. అతడి కెరీర్‌లోని మరుపురాని ఇన్నింగ్స్‌లు.. రికార్డులు కూడా ఎన్నో ఉన్నాయి.**

**గేల్**
**72**

*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*

క్రిస్టోఫర్ హెన్రీ గేల్... క్రికెట్‌లో విధ్వంసానికి ఓ చిరునామా. బౌలర్ ఎవరు.. వేదిక ఏది.. పరిస్థితులెలా ఉన్నాయనే విషయాలు ఈ విండీస్ వీరుడిపై ప్రభావాన్ని చూపవు. ఫామ్‌లోకి వస్తే సునామీలా విరుచుకుపడతాడు. ప్రత్యర్థి జట్టును బౌండరీలతో అమాంతం ముంచేసి విజయాన్ని పట్టుకుపోతాడు. కొండంత అనుకున్న లక్ష్యాన్ని వీరబాదుడుతో నీరుగార్చేసి ఇంతేనా అన్నట్టు గంభీరమైన ముఖం పెడతాడు. సంతోషమొస్తే దాచుకోకుండా కరీబియన్ మార్క్ నృత్యంతో మైదానంలో వినోదాన్ని పంచుతాడు. తన బ్యాటింగ్‌తో విండీస్ జట్టుకు టీ20 ప్రపంచకప్ సహా ఎన్నో అపూర్వ విజయాలు అందించిన గేల్... ఇక అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పినట్టే. భారత్‌తో స్వదేశంలో జరిగే సిరీస్ తర్వాత తప్పుకుంటానని గతంలో ప్రకటించిన అతడికి టెస్టు సిరీస్‌లో చోటు దక్కలేదు. దీంతో భారత్‌తో బుధవారం జరిగిన మూడో వన్డేనే అతడికి చివరిదని భావించొచ్చు. ఆ మ్యాచ్‌లో ఔటయ్యాక భారత ఆటగాళ్లు అతడిని అభినందించారు. ఐపీఎల్‌లో తన కెప్టెన్ కోహ్లీతో ట్రేడ్‌మార్క్ మూవ్‌మెంట్‌ను గేల్ చేశాడు. పెవిలియన్ చేరే ముందు బ్యాట్ హ్యాండిల్‌పై హెల్మెట్‌ను ఉంచి.. ఇక అంతర్జాతీయ క్రికెట్‌కు సెలవు అన్నట్టు అభిమానులకు అభివాదం చేస్తూ వెళ్లిపోయాడు.

**గేల్ రికార్డుల్లో కొన్ని..**

- వెస్టిండీస్ తరపున ఎక్కువ వన్డేలు ఆడిన బ్యాట్స్‌మెన్(301), వన్డేల్లో ఎక్కువ పరుగులు(10,480).
- అంతర్జాతీయ టీ20లో మొదటి సెంచరీ (2007 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై).
- అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక సిక్సర్లు (105) బాదిన రెండో బ్యాట్స్‌మన్. రోహిత్ శర్మ(107).
- టెస్టుల్లో రెండు ట్రిపుల్ సెంచరీలు చేసిన నలుగురిలో ఒక్కడు. వన్డేల్లో డబుల్ సెంచరీ.

**మొదటిది - చివరిది**

1999లో భారత్‌పై వన్డేల్లో అరంగేట్రం చేసిన గేల్.. భారత్‌పై బుధవారం చివరి మ్యా చ్ ఆడాడు. 2000లో జింబాబ్వేపై తొలి టెస్ట్ ఆడిన విండీస్ వీరుడు 2014లో బంగ్లాపై చివరి టెస్టు ఆడాడు. 2006లో న్యూజిలాండ్‌పై అంతర్జాతీయ టీ20 అరంగేట్రం చేసిన గేల్ చివరగా ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్‌పై బరిలోకి దిగాడు.

**కింగ్ ఆఫ్ టీ20**

టీ20 క్రికెట్ తన కోసమే పుట్టిందన్నట్టు తన కెరీర్‌లో క్రిస్ గేల్ చెలరేగిపోయాడు. ఆ ఫార్మాట్‌లో జరిగిన తొలి ప్రపంచకప్‌లోనే సెంచరీ సాధించి సత్తాను చాటిచెప్పాడు. 20ఓవర్ల క్రికెట్‌కు ఐకాన్‌గా మారాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక సిక్సర్లు(105) బాదిన జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. 2006 టీ20 ప్రపంచకప్‌ను విండీస్ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. దేశం తరపునే కాకుండా ప్రపంచంలో ఏ మూలన లీగ్ జరిగిన గేల్ ఉండాల్సిందే. అతడు లేకపోతే ఆ లీగ్ కళతప్పినట్టే అన్న భావన వచ్చేలా చేశాడు.

**సరదాగా డ్యాన్స్‌లతో జిగేల్**

బ్యాటింగ్‌లో బాదుడుతో భయంకరంగా విరుచుపడే గేల్.. మైదానంలోనూ.. బయట చాలా సరదాగా, ఉత్సాహంగా ఉంటాడు. బ్యాటింగ్‌లో సెంచరీ చేసినా.. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు వికెట్ పడినా.. మ్యాచ్ గెలిచినా అతడి సంబరాలు ప్రత్యేకంగా ఉంటాయి. ట్రేడ్ మార్క్ డ్యాన్స్‌తో అలరిస్తాడు. గంగ్నమ్ స్టైల్ డ్యాన్స్‌కు మరింత ఊపుతెచ్చింది ఈ కరీబియన్ కింగే. తన డ్యాన్స్‌తో అభిమానులను ఉత్సాహపరుస్తాడు. జట్టులో ఉత్తేజాన్ని నింపుతాడు.

**ఫుట్‌వర్క్ లేకుండా..**

బ్యాటింగ్ రాణించాలంటే ఫుట్‌వర్క్ చాలా ముఖ్యం. అయితే ఈ విషయంలో గేల్ మాత్రం మినహాయింపు. అసలు గేల్ కాలు కదపకుండానే బంతిని ఎటైనా బాదేస్తాడు. బంతిని చూసి బ్యాట్‌తో దిశ చూపిస్తే చాలు అతడి కండ బలంతో బంతి పరుగెడుతుంది. అతడి టైమింగ్ కూడా అలానే ఉంటుంది. అయితే కొన్నిసార్లు ఫుట్‌వర్క్ లేమి అతడికి ప్రతికూలంగానూ మారింది.

**టెస్టుల్లో ఆ రెండు ఇన్నింగ్స్‌లు**

గేల్ కెరీర్‌లో బెస్ట్ టెస్టు ఇన్నింగ్స్ అనగానే అందరూ 333 పరుగులు అనేస్తారు. కానీ గేల్ పోరాటపటిమకు మరో మ్యాచ్ కూడా నిదర్శనంగా నిలించింది. 2009లో ఆస్ట్రేలియాతో ఆడిలైడ్ వేదికగా జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో గేల్... ఏడున్నర గంటల పాటు బ్యాటింగ్ చేసి 165 పరుగులతో నాటౌట్‌గా నిలిచి.. ఆ మ్యాచ్‌ను డ్రాగా ముగించి తన సహనాన్ని చాటిచెప్పాడు. ఆ తర్వాతి సంవత్సరమే శ్రీలంకపై 333 పరుగులు చేశాడు. 2005లోనూ దక్షిణాఫ్రికాపై అతడు ట్రిపుల్ సెంచరీ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో బంతితోనూ గేల్ రాణించాడు.

**క్రిస్ గేల్ అంతర్జాతీయ కెరీర్**

| | టెస్టులు | వన్డేలు | టీ20లు |
|---|---|---|---|
| మ్యాచ్‌లు | 103 | 301 | 58 |
| పరుగులు | 7214 | 10480 | 1627 |
| సగటు | 42.19 | 37.70 | 32.54 |
| అత్యధిక స్కోరు | 333 | 215 | 117 |
| సెంచరీలు | 15 | 25 | 2 |
| అర్ధ సెంచరీలు | 37 | 54 | 13 |
| వికెట్లు | 73 | 167 | 17 |

**జెర్సీ 301**

కెరీర్‌లో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలుత 45 నంబర్ జెర్సీతో గేల్ బరిలోకి దిగేవాడు. 2010లో టెస్టుల్లో 333 పరుగుల అత్యధిక స్కోరు సాధించాక దాన్నే జెర్సీ సంఖ్యగా మార్చేసుకున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ సహా ఐపీఎల్‌లోనూ 333 జెర్సీతోనే వచ్చేవాడు. అయితే తన చివరి మ్యాచ్‌లో తాను ఆడిన వన్డేల సంఖ్య 301 ప్రత్యేక జెర్సీలో బరిలోకి దిగాడు. వెస్టిండీస్ తరపున అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాడిగా గేల్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.




# తొలి రోజు వర్షార్పణం

**యాషెస్ రెండో టెస్ట్**

**లండన్:** ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య యాషెస్ సిరీస్ రెండో టెస్ట్ మ్యాచ్ తొలి రోజు పూర్తిగా రద్దయ్యింది. తొలుత నిర్ణీత సమయం కంటే కొంత ఆలస్యంగా మ్యాచ్ మొదలవుతందనుకున్నా..ఆ తర్వాత వర్షం నిరంతరాయంగా కురువడంతో సాధ్యపడలేదు. మైదానాన్ని పలుమార్లు పరిశీలించిన అంపైర్లు అలీమ్ దార్, క్రిస్ గాఫనీ చిత్తడి ఉండటంతో బుధవారం ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వరల్డ్‌కప్ హీరో, ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్ ఇంగ్లండ్ తరపున టెస్ట్‌ల్లో అరంగేట్రానికి మరో రోజు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్టీవ్ స్మిత్ సెంచరీల హోరుతో యాషెస్ తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.



# వికాస్ విజృంభణ



**యూపీపై హర్యానా విజయం**

**అహ్మదాబాద్ :** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో హర్యానా స్టీలర్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఇక్కడ యూపీ యోధాపై జరిగిన మ్యాచ్‌ను 36-33 తేడాతో హర్యానా చేజిక్కించుకుంది. రైడర్ వికాస్ కండోలా(12 రైడ్‌పాయింట్లు) అద్భుత ప్రదర్శన తోడు సునీల్(6 ట్యాక్లింగ్ పాయింట్లు) రాణించడంతో ఉత్కంఠ పోరులో స్టీలర్స్ పైచేయి సాధించింది. మ్యాచ్‌లో యూపీ యోధా శుభారంభం చేసింది. తొలి రైడ్‌కు వెళ్లిన రైడర్ మను గోయత్ రెండు పాయింట్లు తెచ్చి యూపీని ఆధిక్యంలో నిలపగా.. నితేశ్ కుమార్ స్టీలర్స్ ఆటగాడిని పట్టేయడంతో యోధా 3-0తో ముందంజ వేసింది. రవికుమార్ ట్యాక్లింగ్ ద్వారా హర్యానా ఖాతాను ప్రారంభించగా.. ఆ తర్వాత కండోలా చెలరేగాడు. యూపీ యోధా డిఫెన్స్ ఛేదించి వరుసగా పాయింట్లు సాధిస్తూ హర్యానాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. 13వ నిమిషంలో యూపీని ఆలౌట్ చేయడం ద్వారా హర్యానా ఏకంగా 11-7తో దూసుకుపోయి... తొలి అర్ధభాగం ముగిసే సరికి 16-12తో నిలిచింది.

**యూపీ పోరాడినా...**

రెండో అర్ధభాగంలో యూపీ యోధా అద్భుతంగా పోరాడింది. హర్యానా స్టార్ రైడర్ కండోలాను పట్టేసి కోర్టుకు కాసేపు దూరంగా ఉంచగలిగింది. సురేందర్ సింగ్, గోయట్ అటాకింగ్‌తో పాటు సుమిత్ డిఫెన్స్‌తో ఏకంగా హర్యానాను ఆలౌట్ చేసిన యూపీ 21-19తో ఆధిక్యంలోకి వచ్చి గెలుపు ఆశలను పెంచుకుంది. అయితే ఆ తర్వాత హర్యానా ఆత్మవిశ్వాసంతో ఆడడంతో స్కోరు ఓ దశలో 27-27తో సమమైంది. ఇక చివరి వరకు ఉత్కంఠగా పోరు సాగినా 39 నిమిషంలో యూపీని ఆలౌట్ చేసిన హర్యానా 36-33తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. అంతకు ముందు జరిగిన మరో మ్యాచ్‌లో ఆతిథ్య గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై 28-26 తేడాతో బెంగాల్ వారియర్స్ విజయం సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది.

# క్రికెట్‌లోకి వేగన్ బంతి




**లండన్ :** కొందరు క్రికెటర్లు వేగన్(జంతు ఉత్పత్తి రహిత) ఆహారానికి మారడం చాలా సార్లు చూశాం. ఈ విషయానికొస్తే టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా వేగనే. అయితే క్రికెట్ బంతి విషయంలోనే వేగన్ సూత్రాన్ని పాటించాలని ఇంగ్లండ్‌లోని ఇయర్లీ క్రికెట్ క్లబ్ నిర్ణయించుకుంది. జంతు చర్మంతో చేసిన లెదర్‌తో కాకుండా రబ్బర్‌ను వినియోగించి బంతిని తయారు చేసింది. త్వరలో ప్రయోగించనుంది. ఇప్పటికే ఆ క్లబ్ ప్లేయర్లు వేగన్ బంతితో సన్నాహకాలు చేస్తున్నారు. ఇయర్లీ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గ్యారీ షాక్లడీ ఐదేళ్ల కిందట వేగన్‌గా మారారు. రెండేండ్ల నుంచి వేగన్ టీ(క్షీర రహిత)ని ఆటగాళ్లకు అందిస్తున్నారు. అలాగే ప్లేయర్లకు మాంసం, సాండ్‌విచ్‌ల స్థానంలో వేగన్ ఆహారాన్నే ఇస్తున్నారు. అందుకే ఈ క్రికెట్ క్లబ్‌కు వేగన్ అనే మరోపేరు కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. త్వరలో ఈ క్రికెట్ క్లబ్ జంతు చర్మంలో స్థానంలో రబ్బరుతో చేసిన బంతితో ఆడనుంది.

# ధనంజయ మ్యాజిక్

**ఐదు వికెట్లతో విజృంభణ**

**న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 203/5**




ధనంజయ
(5/57)

**గాలె :** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజు న్యూజిలాండ్ తొలుత తడబడినా.. రాస్ టేలర్ పోరాటంతో నిలబడింది. బుధవారమిక్కడ ప్రారంభమైన టెస్టులో ఐదు వికెట్లకు 203 పరుగులతో కివీస్ తొలి రోజును ముగించింది. శ్రీలంక మిస్టరీ స్పిన్నర్ అఖిల ధనంజయ(5/57) అద్భుత బౌలింగ్‌తో కివీస్ బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపాడు. లంచ్ సమయానికి 71/3తో కష్టాల్లో ఉన్న కివీస్‌ను సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్(131 బంతుల్లో 86 నాటౌట్, 6ఫోర్లు).. నికోలస్(78 బంతుల్లో 42, 2ఫోర్లు) సాయంతో ఆదుకున్నాడు. వర్షం కారణంగా తొలి రోజు ఆటలో 22 ఓవర్ల కోత పడింది. టేలర్, సాంట్నర్(8) ప్రస్తుతం క్రీజులో ఉన్నారు. గురువారం రెండో రోజు ఆట నిర్ణీత సమయం కన్నా త్వరగా మొదలు కానుంది. టెస్టు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శ్రీలంక, న్యూజిలాండ్‌కు ఇదే తొలి మ్యాచ్.

**ధనంజయ విజృంభణ:**

అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కలిగి ఉన్నాడని గతేడాది ఆరోపణలు ఎదుర్కొన్న ధనంజయ... సరికొత్త యాక్షన్‌తో కివీస్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగాడు. కివీస్‌కు ఓపెనర్లు లాథమ్(30), రావల్(33) మోస్తరు ప్రారంభాన్ని ఇచ్చారు. అయితే 27వ ఓవర్లో ధనంజయ.. లాథమ్‌ను ఔట్ చేసి 64 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. అదే ఓవర్లో కివీస్ కెప్టెన్ విలియమ్సన్(0)ను పెవిలియన్‌కు పంపి దెబ్బకొట్టాడు. ఆ సమయంలో సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్(86 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌కు హెన్రీ నికోలస్(42) సహకారమందించాడు. దీంతో వారిద్దరి మధ్య 100 పరుగుల భాగస్వామ్యం పూర్తయింది. మరోసారి ధనంజయ రెండు ఓవర్ల వ్యవధిలోనే నికోలస్ సహా ఆ తర్వాత వచ్చిన వాట్లింగ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని ఔట్ చేసి లంకను పైచేయిలో నిలిపాడు.

**సెన్సెక్స్** 37,312 ↑353

**నిఫ్టీ** 11,029 ↑104

**ముడి చమురు (బ్రెంట్)** ↓58.78 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 37,945 |
| 22 క్యారెట్లు | 37,775 |
| వెండి (కిలో) | 44,310 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 68.00 | 73.50 |
| యూరో | 76.00 | 82.50 |
| బహ్రెయిన్ దినార్ | 178.50 | 192.50 |
| కువైట్ దినార్ | 223.50 | 235.50 |
| సౌదీ రియాల్ | 17.70 | 19.50 |
| యూఏఈ దిర్హామ్ | 18.00 | 19.70 |



నేడు రాఖీ పండుగ

# కొనుగోలు శక్తి కుదేలు



## కీలక రంగాల్లో నిస్తేజం • మాంద్యం గుప్పిట్లోకి ఆర్థికం

- పడకేసిన తయారీ.. పోతున్న ఉద్యోగాలు
- ఆందోళనలో పరిశ్రమ.. ఆలోచనల్లో కేంద్ర ప్రభుత్వం




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**

వాహన విక్రయాలు లేక ఆటోమొబైల్ రంగం వెలవెలబోతున్నది. ఇండ్ల అమ్మకాలు జరుగక నిర్మాణ రంగం నిరాశలో కూరుకుపోతున్నది. వ్యాపారం కరువై ఎఫ్ఎంసీజీ రంగం కుదేల వుతుంటే.. బ్యాంకింగ్ రంగాన్ని మొండి బకాయిలు, బ్యాంకింగేతర రంగాన్ని నగదు కొరత వేధిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం భారతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటున్నది. దీనంతటికీ కారణం వినియోగదారుల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లడమే. అవును.. ఈ ఒక్కదాని వల్లే దేశ జీడీపీకి ఊపిరినిచ్చే కీలక రంగాలు బలహీనతకు లోనవుతున్నాయి.

### ఎందుకీ పరిస్థితి ప్రమాదకరం?

ఆర్థిక వ్యవస్థ అనేది విభిన్న రంగాల సమాహారం. ఓ అనుసంధాన ఆధారిత ప్రక్రియ మూల రూపం. ఇందులోని ఏ రంగానికి ఇబ్బంది వచ్చినా అది ఇతర రంగాలనూ ప్రభావితం చేస్తుంది. ఈ ఇబ్బందులు రాకుండా ఉండాలంటే జీవనాడిగా ఉన్న వినియోగదారుడి కొనుగోలు శక్తి బలంగా ఉండాల్సిందే. ఇది ఎంత బలంగా ఉంటే అంతగా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుంది. అన్ని రంగాలు ప్రకాశవంతంగా పనిచేస్తాయి. అయితే ప్రస్తుతం భారత జీవనాడికి జబ్బు చేసింది. దాని ప్రభావమే జీడీపీ మందగమనం. కీలక రంగాలు కోలుకోవాలంటే.. కొనుగోలు శక్తి పుంజుకోవాలి. ఇప్పుడదే మోదీ సర్కారుకు పెద్ద సవాలుగా పరిణమిస్తున్నది. అందుకే ఈ ప్రతికూల పరిస్థితులు.. భయానక వాతావరణం.

### ఎఫ్ఎంసీజీపై పెను ప్రభావం



ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా మనగలిగే ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) సంస్థలు కూడా ప్రస్తుతం సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ వృద్ధిరేటు క్షీణించడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మందగమన పరిస్థితులు ఈ రంగానికి ప్రధాన సమస్యగా మారాయి. గ్రామీణ ప్రజలకున్న నగదు కొరత వినిమయ సామర్థ్యాన్ని భారీగా దెబ్బ తీసింది. పట్టణ, నగర ప్రాంతాల్లోనూ ఎదురుదెబ్బలు తప్పడం లేదు. ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యునీలీవర్ వృద్ధిరేటు నిరుడు ఏప్రిల్-జూన్‌తో పోల్చితే ఈసారి 12 శాతం నుంచి 5.5 శాతానికి దిగజారింది. డాబర్ వృద్ధిరేటు కూడా 21 శాతం నుంచి 6 శాతానికి పడిపోయింది. అలాగే బ్రిటానియా, ఏషియన్ పెయింట్లది 12 శాతం నుంచి 6, 9 శాతాలకు క్షీణించింది.

### 'రియల్' దయనీయం



**దేశ** ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన నిర్మాణ రంగం ఇప్పుడు అత్యంత దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. దాదాపు 250 అనుబంధ పరిశ్రమలకు మూలాధారమైన నిర్మాణ రంగంలో నెల కొన్న నిస్తేజం.. జీడీపీని పెద్ద ఎత్తునే ప్రభావితం చేస్తున్నది. ఇటుకలు, సిమెంట్, ఉక్కు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్, రంగులు తదితర ఎన్నో రంగాలు ఇండ్ల అమ్మకాలు లేక కుదేలయ్యాయి. చివరకు బ్యాంకులు, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల రుణ వృద్ధిరేటూ దెబ్బ తిన్నది. 42 నెలలుగా అమ్ముడుపోని ఇండ్లు, ఫ్లాట్లు ఉన్నాయంటే భారతీయ రియల్ ఎస్టేట్ పరిస్థితి ఎలా ఉందో? ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దీంతో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని, ఉద్దీపనలు ఇవ్వాలని, రుణ లభ్యతను పెంచాలని నిర్మాణ రంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

## రూపాయి దెబ్బ

**రూపాయి** విలువ ఒడిదుడుకులూ దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గడిచిన పదేండ్లలో ఏడేండ్లు క్షీణతకే గురైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల దేశీయ కార్పొరేట్ సంస్థల్లో విదేశీ మదుపరుల వాటాలు, ప్రభుత్వ బాండ్లలో విదేశీ పెట్టుబడులు పడిపోతున్నాయి. ఈ నెల విషయానికే వస్తే.. రూపా యి విలువ 3.6 శాతానికిపైగా దిగజారింది. 2013 సెప్టెంబర్ నుంచి రూపాయికి ఇదే అత్యంత ప్రతికూల నెలగా ఉండటం గమనార్హం. బుధవారం ఫారెక్స్ మార్కెట్ ట్రేడింగ్‌లో కూడా రూపాయి విలువ 6 నెలల కనిష్ఠాన్ని తాకింది. 13 పైసలు పతనమై 71.27 వద్ద స్థిరపడింది. మంగళవారం 62 పైసలు క్షీణించిన సంగతి విదితమే. దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు కూడా రూపాయి బలహీనతకు కారణంగా నిలుస్తున్నాయి. నిజానికి రిజర్వ్ బ్యాంక్.. రూపాయి బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నా.. దేశ, విదేశీ పరిణామాల వల్ల పెద్దగా ఫలితం లేకుండా పోతున్నది. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం కూడా దేశంలో రూపాయి నిల్వలను తగ్గిస్తున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఆటోకు షాక్

**ఆటో** మొబైల్ రంగం గడిచిన 20 ఏండ్లలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితులను నేడు ఎదుర్కొంటున్నది. ఓవైపు అమ్మకాలు లేకపోవడం.. మరోవైపు ఉత్పత్తి నిలిచిపోవడంతో పది లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం సియామ్ చెబుతున్నది. ఒక్క ఆటో రంగ సంస్థల్లోనే 2.30 లక్షల ఉద్యోగాలు పోతున్నాయని, ఆటో కంపోనెంట్, ఇతర అనుబంధ రంగాలను కలుపుకుంటే తొలగింపులు నాలుగు రెట్లు పెరుగుతున్నాయని చెప్పింది. టూవీలర్లు, కార్లు, ట్రాక్టర్ల విక్రయాలు పడిపోవడం వల్ల ఇప్పటికే దేశవ్యాప్తంగా 300 డీలర్‌షిప్‌లు మూతబడ్డాయని సియామ్ తెలియజేసింది. దేశీయ ప్రతికూల పరిస్థితులకుతోడు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం, బ్రెగ్జిట్ వంటి అంశాలు ఆటో రంగ ప్రగతిని మింగేశాయని అభిప్రాయపడింది. సేల్స్, మార్కెటింగ్ సిబ్బందితో పాటు తాత్కాలిక ఉద్యోగులపై ప్రభావం ఎక్కువగా ఉంటున్నదని ఓ స్వతంత్ర హెచ్ఆర్ ఇండస్ట్రీ ఆందోళన వ్యక్తం చేస్తున్నది.



### వేధిస్తున్న నగదు లభ్యత

**గల్లీలో** ఉన్న కిరాణా దుకాణం నుంచి.. ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వందాకా అందరినీ నగదు లభ్యత వేధిస్తున్నది. మొండి బకాయి (ఎన్‌పీఏ లేదా నిరర్థక ఆస్తులు)ల మూలంగా బ్యాంకులు రుణాల మంజూరును కఠినతరం చేయడంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలు నగదు కొరతను ఎదుర్కొంటుంటే.. ఆదాయం లేక ప్రభుత్వం ఈ సమస్యను చవిచూస్తున్నది. జీఎస్టీతో ఆదాయం గణనీయంగా పడిపోయిన వేళ.. ప్రభుత్వ వ్యయం ఆర్థిక వ్యవస్థలో సగటున దాదాపు 10 శాతంగా నమోదవుతున్నది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో ఇది 19 శాతం, 13 శాతంగా ఉండటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం దేశ వృద్ధిరేటు కూడా ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 6.8 శాతంగా నమోదైన విషయం తెలిసిందే.

### నిపుణుల మాటేంటి?

**వ్యాపార,** పారిశ్రామిక రంగాలకు ఆర్థిక చేయూతనందించి.. ప్రభుత్వం అనవసరపు వ్యయాలను తగ్గించుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. అప్పుడే వచ్చే ఐదేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న కేంద్ర ఆశయం కాస్తోకూస్తో నెరవేరే వీలుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా జీడీపీ గాడిలో పడాలంటే ఎంఎస్ఎంఈలకు రుణాలు అందాలని సూచిస్తున్నారు. ఆటో, నిర్మాణ రంగాలకూ ఉద్దీపనలు ప్రకటిస్తే కొంత ఉపశమనం లభిస్తుందని అంటున్నారు. ఇదే సమయంలో ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, పెట్టుబడులకు ఊతమివ్వాలని కోరుతున్నారు.

## డిమాండ్ లేమితో
# తగ్గిన పసిడి

- తులంపై రూ.425 దిగిన ధర

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** గడిచిన కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.425 తగ్గి రూ.37,945 వద్దకు చేరుకున్నది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. రికార్డు స్థాయిలో పెరిగిన వెండి ఆ మరుసటి రోజే భారీగా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు కొనుగోళ్లకు మొగ్గుచూపకపోవడంతో కిలో వెండి ధర రూ.690 తగ్గి రూ.44,310 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా తగ్గుముఖం పట్టాయని ట్రేడర్ వెల్లడించారు.

# ఎగుమతులు ఆశాజనకం

- జూలైలో 2.25 శాతం వృద్ధి
- నాలుగు నెలల కనిష్ఠానికి వాణిజ్యలోటు



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** గడిచిన కొన్ని నెలలుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన ఎగుమతులు ఎట్టకేలకు సరైన ట్రాక్‌లోకి వచ్చాయి. విదేశాల్లో దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ ఊపందుకోవడంతో గత నెలలో ఎగుమతుల్లో 2.25 శాతం వృద్ధి నమోదైంది. జూలై నెలలో 26.33 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఇతర దేశాలకు ఎగుమతి అవగా, క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 25.75 బిలియన్ డాలర్లతో పోలిస్తే రెండు శాతం కంటే అధికం. ఇదే సమయంలో భారత్ 39.76 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాది చేసుకున్న దాంతో పోలిస్తే 10.43 శాతం క్షీణత కనబరిచింది. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 13.43 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది మార్చిలో నమోదైన 10.89 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు తర్వాత ఇదే కనిష్ఠం. చమురు, పసిడి దిగుమతులు భారీగా తగ్గడం వాణిజ్యలోటు అదుపులోకి రావడానికి ప్రధాన కారణమని వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

### భారీగా తగ్గిన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గడిచిన నెలలోనూ పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 42.2 శాతం తగ్గి 1.71 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. బంగారంతోపాటు చమురు దిగుమతులు కూడా 22.15 శాతం తగ్గి 9.6 బిలియన్ డాలర్లకు పరిమితమవగా, చమురేతర దిగుమతులు 5.92 శాతం తగ్గి 30.16 బిలియన్ డాలర్ల వద్ద ముగిశాయి. కెమికల్, ఇనుప ఖనిజం, విద్యుత్ పరికరాలు, సముద్ర ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల్లో వృద్ధి నమోదయ్యాయి. అయినప్పటికీ పలు కీలక రంగాల్లో ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. వీటిలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ(-6.82 శాతం), ఇంజినీరింగ్ గూడ్స్(-1.69 శాతం), పెట్రోలియం ఉత్పత్తులు(-5 శాతం) ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలు(ఏప్రిల్-జూలై) ఎగుమతులు 0.37 శాతం తగ్గి 107.41 బిలియన్ డాలర్లకు పరిమితమవగా, ఇదే సమయంలో దిగుమతులు 3.63 శాతం క్షీణించి 166.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ నాలుగు నెలల్లో వాణిజ్యలోటు 59.36 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అంతర్జాతీయ దేశాల్లో డిమాండ్ లేకపోవడం, టారిఫ్ యుద్ధంతో అనిశ్చిత పరిస్థితుల వల్ల ఎగుమతులు మందకొడి వృద్ధిని నమోదు చేసుకున్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్(ఎఫ్ఐఈవో) ప్రెసిడెంట్ శరద్ కుమార్ సరాఫ్ తెలిపారు. గడిచిన ఆరు వారాల్లో రూపాయి విలువ 3.5 శాతం పతనం చెందడంలో కేంద్ర ప్రభుత్వం పలు రాయితీలు ఇవ్వాలని ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(టీపీసీఐ) చైర్మన్ మోహిత్ సింగ్లా తెలిపారు. భారత్‌లో సెంటిమెంట్ నిరాశావాదంగా తయారైందని, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ పరికరాలకు డిమాండ్ లేకుండా పోయిందన్నారు.

## ఖాతాదారులకు ఊరట

- బ్యాలెన్స్ ఎంక్వైరీ, విఫల లావాదేవీలను నెలసరి ఉచిత ఏటీఎం లావాదేవీల్లో కలుపవద్దు
- బ్యాంకులకు ఆర్బీఐ సూచన

**ముంబై, ఆగస్టు 14:** ఉచిత ఏటీఎం లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ స్పష్టతనిచ్చింది. సాంకేతిక కారణాలతో విఫలమైన లావాదేవీలను, బ్యాలెన్స్ ఎంక్వైరీ, చెక్‌బుక్ విజ్ఞప్తి వంటి నగదేతర లావాదేవీలను నెలనెలా అందించే ఐదు ఉచిత లావాదేవీల్లో భాగం చేయవద్దని సూచించింది. పన్నుల చెల్లింపులు, నిధుల బదిలీలనూ లెక్కించవద్దన్నది. ఖాతాదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆర్బీఐ ఈ మేరకు స్పందించింది. ఏటీఎంల్లో నగదు లేక, సాంకేతిక ఇబ్బందుల కారణంగా రద్దైన లావాదేవీలనూ బ్యాంకులు ఉచిత ఏటీఎం లావాదేవీలుగా లెక్కిస్తున్నాయని కస్టమర్లు ఆర్బీఐకి ఫిర్యాదు చేశారు. దీంతో వీటిని ఉచిత లావాదేవీల్లో లెక్కించవద్దని, ఖాతాదారుల నుంచి ఎలాంటి చార్జీలనూ వసూలు చేయవద్దని బ్యాంకులకు ఆర్బీఐ స్పష్టం చేసింది.

# కోలుకున్న స్టాక్ మార్కెట్లు

- 353 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- 11 వేల పాయింట్లపైకి నిఫ్టీ




**ముంబై, ఆగస్టు 14:** స్టాక్ మార్కెట్ల భారీ పతనం తర్వాత తిరిగి కోలుకున్నాయి. దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, చైనాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై సుంకం విధించడం ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన వార్తలు మార్కెట్లలో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. లాభాల్లో ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ 515 పాయింట్ల స్థాయిలో కదలాడి చివరకు 353.37 పాయింట్లు అందుకొని 37,311.53 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ మళ్లీ 11వేల పాయింట్ల మైలురాయిని దాటి 11,029.40 వద్ద ముగిసింది. చివరకు 103.55 పాయింట్లు లాభపడినట్లు అయింది. రిటైల్, టోకు ధరల సూచీ గణాంకాలు అదీనంలోనే ఉండటం మదుపరుల్లో నెలకొన్న సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని మార్కెట్ పండితులు వెల్లడించారు. దీంతో వచ్చే సమీక్షలోనూ వడ్డీరేట్లను తగ్గించడానికి ఆర్బీఐకి వీలు పడిందన్నారు. వేదాంతా, టాటా స్టీల్, యెస్ బ్యాంక్, టెక్ మహీంద్రా, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల షేర్లు 4.83 శాతం వరకు లాభపడ్డాయి. కానీ, సన్‌ఫార్మా, ఓఎన్జీసీ, కొటక్ బ్యాంక్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, ఎన్టీపీసీలు ఐదు శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. రంగాల వారీగా చూస్తే హెల్త్‌కేర్, మెటల్, టెలికం, క్యాపిటల్ గూడ్స్, చమురు అండ్ గ్యాస్, ఫైనాన్స్, బ్యాంకెక్స్, టెక్‌ల షేర్లు 2.68 శాతం లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ఎగువముఖం పట్టాయి.

### నేడు మార్కెట్లకు సెలవు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం స్టాక్ మార్కెట్లు మూసివేసి వుంచనున్నారు. ఈక్విటీ మార్కెట్లతో పాటు కమోడిటీ, డెరివేటివ్, బులియన్, ఇతర మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. తిరిగి శుక్రవారం యథాతథంగా పనిచేయనున్నాయి.

# ఆ ఫ్లాట్లు కొనొద్దు

- రెరా అనుమతి తీసుకోకుండా విక్రయిస్తున్న ప్రమోటర్లు..
- పేర్లు, సర్వే నెంబర్ల వివరాల్ని విడుదల చేసిన రెరా అథారిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా) మోసపూరిత డెవలపర్లను దారిలోకి తేవడానికి మొదటి ప్రయత్నాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలోనే రెరాలో నమోదు కానీ మూడు ప్రాజెక్టుల్లో ఫ్లాట్లను కొనుగోలు చేయవద్దంటూ బుధవారం పత్రికా ప్రకటనను విడుదల చేసింది. డెవలపర్ల పేర్లు, అపార్టుమెంట్లను నిర్మించే ప్రాంతం, సర్వే నెంబర్లు తదితర వివరాల్ని బహిర్గతం చేసింది. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు ఎట్టి పరిస్థితుల్లో ఈ నిర్మాణాల్లో కొనవద్దని అథారిటీ మెంబర్ సెక్రెటరీ కె విద్యాధర్ సూచించారు. నిబంధనల ప్రకారం 500 చదరపు మీటర్ల విస్తీర్ణం తర్వాత ఎనిమిది లేదా అంతకుమించిన సంఖ్యలో ప్లాట్లు, ఫ్లాట్లను అభివృద్ధి చేసే ప్రతి ఒక్క ప్రమోటర్.. రెరా అథారిటీ వద్ద నమోదు చేసుకోవాల్సిందే. ఇందుకోసం ఫీజు కూడా నామమాత్రంగా ఉంటుంది. అయినప్పటికీ డెవలపర్లు అశ్రద్ధ చేస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు ప్రమోటర్ల వివరాల్ని రెరా అధికారులు బుధవారం విడుదల చేశారు. వారిలో..

- బీ ప్రతాప్‌రెడ్డి తదితరులు సర్వే నెంబర్: 477, ప్లాటు నెంబర్లు: 13, 14,15, కూకట్‌పల్లి (గ్రామం), హైదరాబాద్
- కే బసవ శంకర్ రావు, సర్వే నెంబర్ 56, కొండాపూర్, హైదరాబాద్
- ఎం శ్రీనివాస రావు, సర్వే నెంబరు 148-155, ప్లాటు నెంబర్లు 595, 596, గోపాల్‌రావు నగర్, కూకట్‌పల్లి ఉన్నారు.

### అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయరా?

హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో దాదాపు వెయ్యికిపైగా లేఅవుట్లు, అపార్టుమెంట్లు నేటికీ తెలంగాణ రెరా అథారిటీ వద్ద నమోదు కాలేదు. వాటి వివరాలు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వద్ద ఉన్నప్పటికీ చర్యలు శూన్యం. నగరానికి చెందిన ఓ నిర్మాణ సంస్థ చందానగర్‌లోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ చేరువలో ప్రీలాంచ్ ఆఫర్‌లో భాగంగా రూ.25 లక్షలకే డబుల్ బెడ్‌రూం ఫ్లాటు అంటూ కొనుగోలుదారుల్ని బురిడీ కొట్టిస్తున్నది. మరో సంస్థ కొంపల్లిలో రూ.30 లక్షలకేనని, ఇంకో కంపెనీ మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ చేరువలోని బాచుపల్లి రోడ్డులో 40 అంతస్తుల నిర్మాణంలో తక్కువ రేటుకే ఫ్లాటు అంటూ విక్రయిస్తున్నది. ఇలా నగరం నలువైపులా అనేక సంస్థలు ప్లాట్లు, ఫ్లాట్లను ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నా.. వాటిని అరికట్టడంలో రెరా అథారిటీ వైఫల్యం చెందుతున్నదన్న విమర్శలు రెరాలో నమోదైన పలువురు డెవలపర్ల నుంచి వస్తున్నాయి.

# 25 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

- జూలైలో 1.08 శాతంగా నమోదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ఆహార పదార్థాలు, చమురు ధరలు శాంతించడంతో టోకు ఆధారిత ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) రెండేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. జూలై నెలకుగాను 1.08 శాతంగా నమోదైందని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జూన్‌లో 2.02 శాతంగా నమోదైన టోకు ధరల సూచీ..ఏడాది క్రితం ఇదే నెలలో 5.27 శాతంగా ఉన్నది. జూన్ 2017లో నమోదైన 0.9 శాతం ఇప్పటి వరకు నమోదైన కనిష్ఠ గణాంకాలు. రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 3.15 శాతంగా నమోదు కావడంతో అక్టోబర్ నెలలో రిజర్వు బ్యాంక్ ప్రకటించనున్న పరపతి సమీక్షలో మరోసారి కీలక వడ్డీరేట్లను తగ్గించడానికి వీలు పడనున్నది. టోకు ధరల సూచీలో 15 శాతం వాటా కలిగిన ఆహార ధరల సూచీ 6.15 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 6.98 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గుముఖం పట్టినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. బంగాళాదుంప ధరలు ఇంకా ప్రతికూలంగానే కొనసాగుతున్నాయి. గత నెలలో -23.63 శాతంగా నమోదవగా, కూరగాయల ధరల సూచీ 24.76 శాతం నుంచి 10.67 శాతానికి పతనమయ్యాయి.

## బ్లాక్‌స్టోన్ చేతికి కాఫీ డే బెంగళూరు టెక్ పార్క్!

ఒప్పందం విలువ రూ.3 వేల కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** బెంగళూరులో కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌కు ఉన్న గ్లోబల్ విలేజ్ టెక్నాలజీ పార్క్‌ను బ్లాక్‌స్టోన్ కొనుగోలు చేయబోతున్నది. ఒప్పందం విలువ రూ.3 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో కాఫీ డే అప్పులు భారీగా తగ్గనున్నాయి. అప్పులు అంతకంతకు పెరుగడంతో కాఫీ డే ఫౌండర్ వీజీ సిద్ధార్థ ఆత్మహత్య చేసుకున్న కొన్ని వారాల్లో ఈ ఒప్పందం జరుగడం విశేషం. గ్లోబల్ విలేజ్ టెక్ పార్క్‌ను విక్రయించడానికి బుధవారం సమావేశమైన బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కొనుగోలుకు బ్లాక్‌స్టోన్ ఆసక్తి చూపినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది.


తెలంగాణ ప్రభుత్వము
**కలెక్టరేట్:: నారాయణపేట**

No.G/554/LA/2019 తేది 12-7-2019

విషయము: LA, R&R చట్టం 2013లో నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు-నారాయణపేట జిల్లా- నారాయణపేట మండలం & టౌన్ సత్యనారాయణ చౌరస్తా నుండి మార్కండేయ దేవాలయము వరకు R&B రోడ్డు వెడల్పు చేయుటకు భూములు, కట్టడాలు సేకరణ ఫారం...Cలో ప్రకటన ప్రతిపాదనలు దాఖలైనవి-ఆమోదించబడినవి.

రిఫరెన్స్: 1. G.O.Ms No.52, జనరల్ అడ్మినిస్ట్రేషన్ (I&PR)శాఖ, తేది:14-02-17
2. కలెక్టర్-నారాయణపేట Procg.no. G/554/LA/2019 తేది: 09-07-2019
3. కలెక్టర్-నారాయణపేట రాజపత్రము నెం.11/2019. తేది: 12-07-2019

దిగువ వివరించిన విధంగా కట్టడాలు కలిపి భూములను సేకరించుటకు ఫారం-Cలో ప్రకటనలో-రెఫరెన్స్ 2 మరియు 3లను జిల్లా కలెక్టరు, నారాయణపేట వారు ఆమోదించియున్నారను విషయాన్ని గమనించవలసిందిగా నేను కోరుచున్నాను.

| క్ర. సం. | Prog.No.& తేది | గ్రామం & మండలం పేరు | నోటిఫికేషన్ రకము | ప్రయోజనం | విస్తీర్ణం ఎ.సెంట్లు |
|---|---|---|---|---|---|
| 1. | G/554/LA/2019 dt.09.07.2019 | నారాయణపేట గ్రామం నారాయణపేట మండలం | Form-C | వెడల్పు చేయుట మరియు మునిసిపల్ టౌన్ లిమిట్స్‌కి నాలుగు వరుసలుగా పటిష్ఠపరుచుట (సత్యనారాయణ చౌకు నుండి మార్కండేయ దేవాలయ వరకు | 435 చ.గజాలు |
| | | మొత్తము | | | 435 |

LA R&R (తెలంగాణ సవరణ) చట్టం 2016 (2017, చట్టం నెం. 21)లో RFCT (రూలు 6/12 చూడండి). 10A క్రింద సెక్షన్ 11 క్రింద మినహాయింపు పొందినది ఫారం-C ప్రకటన కాపీ ఒకదానిని జత చేయుచున్నాను.

సం/- కలెక్టరు తరపున, నారాయణపేట

DIPR No.:431/LA/PP/Agency/2019-20



తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, P.R. రీజియన్, కరీంనగర్**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

e-Notice No. 154 to 156/SE/Tenders/2019-20 తేది: 07.08.2019

పని వివరణ: జగిత్యాల జిల్లా, జగిత్యాల మున్సిపాలిటీ వద్ద కరీంనగర్ రోడ్డు నుండి DSP ఆఫీస్ వరకు & కరీంనగర్ రోడ్డు (లక్కీ రెస్టారెంట్) నుండి శ్రీ రెసిడెన్సీ వరకు C.C. రోడ్డు వేయుట మరియు పాత బస్టాండ్ రోడ్డు నుండి బాలాజీ స్వీట్ హౌస్ వరకు C.C. రోడ్డుతో వరద నీటి డ్రెయిన్ నిర్మాణం. ECV: రూ. 2.10 కోట్లు. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ & ముగింపు తేది 16.08.2019 నుండి 26.08.2019 వరకు. తదుపరి వివరాల కొరకు www.tenders.telangana.gov.in దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R రీజియన్, కరీంనగర్

DIPR RO. No. 891-DP/CL/Advt/1/2019-20, Dt: 14/08/2019



తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, ఆదిలాబాద్**

NIT No. SE/R&B/ADB/25 to 27/2019-20, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన** తేది: 06-08-2019

దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. పని పేరు: శాంతినగర్ వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం & మహలక్ష్మీవాడలో కమ్యూనిటీ హాల్ మరియు అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం మరియు ద్వారకా నగర్ వద్ద వార్డు ఆఫీసు నిర్మాణం. పనులన్నీ ఆదిలాబాద్ టౌన్ పరిధిలో కలవు. ECV: రూ. 45.35 లక్షలు. ప్రారంభ తేది: 14-08-2019. ముగింపు తేది: 21-08-2019. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in దర్శించండి.

DIPR RO.No. 895-DP/CL/ADVT/1/2019-20, Dt: 14-08-2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, ఆదిలాబాద్

నేడు రాఖీ పండుగ

# గుడ్డు పెంకు నుంచి ఎముక!

## ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీ జలంధర్ పరిశోధకుల అద్భుత ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గుడ్డు పెంకు నుంచి ఎముకకు ప్రత్యామ్నాయాన్ని ఉత్పత్తి చేసినట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- హైదరాబాద్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- జలంధర్ పరిశోధకులు వెల్లడించారు. ఎముకకు ప్రత్యామ్నాయ పదార్థంగా వినియోగించే ట్రై కాల్షియం ఫాస్ఫేట్ (టీసీపీ)ను ఎలాంటి విషరసాయనాలు ఉపయోగించకుండా ఉత్పత్తి చేశామని, దీని కోసం సహజంగా లభించే గుడ్డు పెంకులను మూలవనరుగా చేసుకున్నామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పెంకుల్లో 95.1 శాతం కాల్షియం, స్వల్పంగా ప్రొటీన్లు, నీరు ఉంటాయన్నారు. ఆధునిక వైద్యవిధానంలో ఎముకల మార్పిడి కోసం అదే రోగి నుంచి లేదా దాత నుంచి తీసుకున్న ఎముకలను, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లాంటి కృత్రిమ పదార్థాలను వినియోగిస్తున్నారని, అలాంటివాటికంటే గుడ్డు పెంకుతో రూపొందించిన ట్రై కాల్షియం ఫాస్ఫేట్ లాంటి బయో సిరామిక్స్ ఎముకకు సరైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని భావిస్తున్నామని వారు వివరించారు.


మోహన్ (ఫైల్)

## ఒకరి మృతికి కారణమయ్యానని
# భవనంపైనుంచి దూకి ఆత్మహత్య

**కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి మరణానికి తాను కారణమయ్యానని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు బుధవారం ఆత్మహత్యచేసుకున్నాడు. కూకట్‌పల్లి మాధవీనగర్‌కు చెందిన మోహన్ (23) బావర్చిలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులతో కలిసి కారులో పటాన్‌చెరు సమీపంలో ఉన్న అనంత పద్మనాభస్వామిని దర్శించుకొనేందుకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుడి తలుపులు మూసేసి ఉండటంతో కారులో కూకట్‌పల్లికి తిరుగుప్రయాణమయ్యారు. దారిలో నందిగామ వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టడంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో కారును నడుపుతున్న మోహన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అనంతరం కూకట్‌పల్లికి చేరుకున్న తర్వాత తన అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తు నుంచి దూకేశాడు. తీవ్ర గాయాలతో ఉన్న మోహన్‌ను స్థానికుల దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు.




ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్. చిత్రంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు

## హైదరాబాద్‌లో ఫొటో జర్నలిస్టుల
# ఛాయాచిత్ర ప్రదర్శన

- ప్రారంభించిన ఎంపీ సంతోష్‌కుమార్

**రవీంద్రభారతి:** తెలంగాణ ఫొటో జర్నలిస్టుల ఛాయాచిత్ర ప్రదర్శనను బుధవారం సాయంత్రం రవీంద్రభారతిలో రాజ్యసభ సభ్యుడు జే సంతోష్‌కుమార్ ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక, భాషాసాంస్కృతిక శాఖల సౌజన్యంతో తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ఫొటో జర్నలిస్టులు, నిర్వాహకులను సంతోష్ అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిజంలో ఫొటో చాలా కీలకమైనదన్నారు. వందలమాటల్లో భావాన్ని ఒక్క ఫొటో వ్యక్తంచేస్తుందన్నారు. కేసీఆర్ నిరాహారదీక్ష, శ్రీకాంతాచారి ఆత్మబలిదానం లాంటి చిత్రాలు తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేశాయని చెప్పారు. జర్నలిస్టులకు అందించే అన్ని సదుపాయాలను ఫొటో జర్నలిస్టులకు వర్తింపజేస్తామన్నారు. కార్య క్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ భాస్కర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు సతీశ్, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు జీ చిన్నయాదగిరిగౌడ్, వినయ్, శెట్టి, చారి, పరమేశ్వర్, సర్వేశ్వర్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.


ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎంపీ సంతోష్‌కుమార్ తీసిన 13 ఫొటోలు

# నెలకు 15 జీబీ డాటా!

ఉదయం లేచిన తర్వాత టిఫిన్ లేదా మధ్యాహ్నం భోజనం ఆర్డర్ చేయాలంటే యాప్. సినిమా టికెట్లు బుక్‌చేయాలంటే యాప్. గేమ్స్ ఆడాలంటే యాప్. సినిమాలు, వీడియోలు చూడాలన్నా యాప్. బ్యాంకు లావాదేవీలు.. స్టాక్‌మార్కెట్ వ్యవహారాలు సరేసరి! చివరకు మనం ఎంతసేపు నిద్రపోయామో తెలుసుకోవాలన్నా.. యాప్!! స్మార్ట్‌ఫోన్ వినియోగం గణనీయంగా పెరుగటంతో వచ్చిన సౌలభ్యాలివి! మరి.. స్మార్ట్‌ఫోన్ పనిచేయాలంటే డాటాకావాలి. ఒకప్పుడు చాలా ఖరీదైన వ్యవహారంగా ఉండిన డాటా.. ఇప్పుడు అగ్గువకే లభిస్తుండటంతో.. యథేచ్ఛగా వాడేస్తున్నాం! ప్రపంచంలోనే డాటా వినియోగంలో భారత్ ముందు వరుసలో ఉంటే.. తెలంగాణ కూడా తానేమీ తక్కువ కాదంటున్నది. మనోళ్లు నెలకు సగటున ఒక్కో స్మార్ట్‌ఫోన్‌లో ఏకంగా 15 జీబీ డాటాను వాడేస్తున్నారు!

- రాష్ట్రంలో పెరిగిన స్మార్ట్‌ఫోన్ సగటు వ్యక్తిగత వాడకం
- ఏడునెలల్లో 10 లక్షల టెరాబైట్స్ వినియోగం
- దేశంలో స్మార్ట్‌ఫోన్ సగటు వినియోగం 9.8 జీబీ
- 2024కల్లా 18 జీబీకి చేరుకునే అవకాశం
- వీడియోల వీక్షణకే అధిక డాటా ఖర్చు..
- రిలయన్స్ జియో రాకతో మారిన సీన్



**శిరందాస్ ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునేదాకా.. స్మార్ట్‌ఫోన్ నిత్యజీవితంలో భాగంగా మారిపోయింది. సోషల్‌మీడియాతోపాటు, సమాచారం, వినోద, ఆర్థిక అంశాల్లో స్మార్ట్‌ఫోన్లు కీలకపాత్రనే పోషిస్తున్నాయి. ప్రపంచ ధోరణులకు అనుగుణంగానే భారతదేశంలో, తెలంగాణ రాష్ట్రంలో మొబైల్‌ఫోన్ల డాటా వినియోగం గణనీయంగా పెరుగుతున్నది. డాటా వినియోగంలో ప్రపంచంలోనే భారత్ ముందువరుసలో ఉన్నది. స్వీడిష్ టెలికం ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ ఎరిక్సన్ తాజాగా విడుదలచేసిన 'ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టు జూన్- 2019' ప్రకారం ఇండియాలో సగటున ఒక్కో స్మార్ట్‌ఫోన్ నెలకు 9.8 జీబీ డాటాను వినియోగిస్తున్నట్టు పేర్కొంది. అదే తెలంగాణలో వాడకం 15 జీబీలుగా ఉన్నది. జాతీయస్థాయిలో 2024 సంవత్సరానికి రెట్టింపు.. అంటే ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడి డాటా వినియోగం 18 జీబీకి చేరనున్నది. 2016 సెప్టెంబర్‌లో వచ్చిన రిలయన్స్ జియో సంచలనానికి మారుపేరుగా నిలిచింది. దాని రాకతోనే ఇండియాలో డాటా వినియోగం గణనీయంగా పెరిగింది. దాంతో మిగతా ఆపరేటరింగ్ సంస్థలు కూడా తక్కువ ధరలతోనే డాటా ఆఫర్లను ప్రకటించాయి. ఫలితంగా డాటా చౌకగా లభిస్తున్న నేపథ్యంలో వినియోగం కూడా అంతేస్థాయిలో పెరుగుతున్నది. మొబైల్ డాటా ట్రాఫిక్ కూడా నానాటికీ పెరుగుతున్నది. భారతీయులు అత్యధిక డాటాను వీడియోలు చూసేందుకే వినియోగిస్తున్నారని వెల్లడైంది. 2024 నాటికి 75 శాతం డాటా.. కేవలం వీడియోల వీక్షణలోనే ఖర్చుకానున్నదని ఎరిక్సన్ నివేదిక పేర్కొన్నది.

### తెలంగాణలో డాటా వినియోగం అధికం

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లో ఇంటర్నెట్ కనెక్షన్ల సంఖ్య పెరుగుతున్నది. తెలంగాణలో 2018లో 15 లక్షల (టీబీ) టెరాబైట్స్ డాటాను వినియోగించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకే 10 లక్షల టీబీ డాటా వినియోగించినట్లు నివేదికలు చెప్తున్నాయి. రాష్ట్రంలో ప్రతి స్మార్ట్‌ఫోన్ ద్వారా 14 టీబీ నుంచి 15 టీబీ డాటా వినియోగిస్తున్నారు. ఇందులో 70% రిలయన్స్ జియో వినియోగదారులేనని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మొబైల్‌టవర్లతో అతిపెద్ద ఆపరేటింగ్ సంస్థగా నిలిచామని రియలన్స్ జియో తెలంగాణ, ఏపీ కార్పొరేట్ కమ్యూనికేషన్ హెడ్ ఎం వెంకట్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ లిట్రసీపైనా దృష్టిపెట్టింది. డిజిటల్ ఇండియాను సక్రమంగా అమలుచేస్తూ ఇప్పటికే 46 గ్రామాలను 100% డిజిటల్ లిట్రసీగా మార్చింది. ప్రభుత్వం రూపొందించిన టీ వ్యాలెట్.. డిజిటల్ లిట్రసీ పెరుగుదలలో ఒక అంశంగా నిలిచింది. టోల్‌గేట్ మొదలు.. అన్నింటా ఈ వ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం కల్పించింది. ప్రైవేటు వ్యాలెట్ల వినియోగంలో యుటిలిటీ ఫీజులు భారంగా ఉంటాయి. అందుకే టీవ్యాలెట్‌వైపు మొగ్గు చూపుతున్నారు.

### మూడేండ్లలోనే పెరుగుదల 109 శాతం

భారత్‌లో 4జీ అడాప్షన్‌తో మూడేండ్లలోనే డాటా వినియోగం 109% పెరిగింది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ పనితీరుపై నోకియా వార్షిక మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ట్రాఫిక్ (ఎంబీఐటీ) ఇండెక్స్ అధ్యయనంలో 2018 నాటికి సగటు వినియోగం 10 జీబీగా పేర్కొంది. అంటే 69% పెరుగుదలగా చూపింది. ఆధునిక సాంకేతికతతో ఇంటర్నెట్ వాడకం మరింత పెరుగనున్నది.

### ఆన్‌లైన్‌లో అత్యధికం ఇవే

ఆన్‌లైన్ కంటెంట్‌లో వీడియోలు (న్యూస్, యాడ్స్, సోషల్ మీడియా) అధికం. వీటిని చూడటంలోనే అధికంగా డాటా ఖర్చవుతుంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌ల వినియోగం నానాటికీ పెరుగుతున్నది.

**ప్రపంచంలో డాటా వినియోగదారులు.. ట్రాఫిక్.. ఇలా**

| | 2017 | 2018 | 2024 (అంచనా) |
|---|---|---|---|
| ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు | 772 | 788 | 879 |
| స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు | 440 | 510 | 716 |
| మొబైల్ పీసీ, టాబ్లెట్, రూటర్లు | 27 | 28 | 33 |

**ట్రాఫిక్ డాటా (నెలకు గిగాబైట్లలో)**

| | 2017 | 2018 | 2024 (అంచనా) |
|---|---|---|---|
| స్మార్ట్‌ఫోన్ డాటా ట్రాఫిక్ | 3.1 | 5.6 | 20 |
| మొబైల్ పీసీ డాటా ట్రాఫిక్ | 10.2 | 12.5 | 26 |
| టాబ్లెట్ డాటా ట్రాఫిక్ | 4.6 | 5.8 | 14 |

### డిజిటల్ లిట్రసీవైపు వేగంగా అడుగులు



డిజిటల్ లిటరసీవైపు తెలంగాణ అడుగులు వేస్తున్నది. పటిష్ఠమైన నాయకత్వం ఉండటంవల్ల గ్రామాలుసైతం డిజిటల్‌గా మారుతున్నాయి. ప్రతిపల్లెలో స్మార్ట్‌ఫోన్ వినియోగం కనిపిస్తున్నది. మూడు లక్షలమందికిపైగా సర్టిఫైడ్ కంప్యూటర్ అక్షరాస్యులున్నారు. మేం గద్వాల దగ్గర గట్టు అనే మారుమూల ప్రాంతానికి వెళ్తే 8, 9 తరగతులు చదివే పిల్లలు కూడా డిజిటల్ లిటరసీపై అవగాహన కలిగి ఉన్నారు. ఇప్పటికే 46 గ్రామాలు డిజిటల్‌గా మారాయి. దేశంలోనే మొదటి క్యాష్‌లెస్ టెంపుల్‌టౌన్‌గా యాదాద్రి మారింది. ఐతే ఫేక్ న్యూస్, సమాచారం, నిషేధిత అప్లికేషన్లపట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు మొబైల్స్ ఇచ్చేటప్పుడు ఎంతసేపు డాటా వినియోగిస్తున్నారన్నదానిపై దృష్టిపెట్టాలి.

- సందీప్ మక్తాల, అధ్యక్షుడు, తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్

### మొబైల్ అధికంగా వినియోగిస్తే మానసిక ఒత్తిడి



మొబైల్ అధికంగా వినియోగించడం వల్ల మానసిక ఒత్తిడి, తలనొప్పి మతిమరుపు, చికాకు, అధిక రక్తపోటు వంటి సమస్యలు తలెత్తుతాయి. సాంకేతికరంగంలో విప్లవాత్మక మార్పులతో వచ్చిన ఫోన్లను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. చైన్‌స్మోకర్స్ తరహాలో చైన్ సెల్‌టాకర్స్‌గా మారుతున్నారు. అవసరానికి మించి వాడితే ఏదైనా అనర్థమే. బ్రిటన్ హెల్త్ ప్రొడక్షన్ ఏజెన్సీకి చెందిన సర్ విలియం స్టీవార్ట్ జరిపిన పరిశోధనలో మొబైళ్ల నుంచి విడుదలయ్యే రేడియోధార్మిక కిరణాలు సున్నితమైన మెదడు కణజాలాన్ని నాశనం చేస్తున్నాయని, ఇది చిన్నపిల్లల్లో మరింత ఎక్కువగా ఉన్నదని తేలింది. దక్షిణ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు 30 వేల మంది చిన్నారులకు వివిధ రక్తపరీక్షలు చేసి అధ్యయనం నిర్వహించగా.. పిల్లలు రేడియేషన్ ప్రభావానికి గురైనట్లు తెలిసింది.

- డాక్టర్ ఆకుల సంజయ్‌రెడ్డి, ఫార్మకాలజిస్టు, తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు

# ఆర్మీ ఉద్యోగాలకు సింగరేణి శిక్షణ

- ఒకేసారి 450 మందికి మూడుశిబిరాల్లో రెసిడెన్షియల్ తరహాలో కోచింగ్
- రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులతో తర్ఫీదు.. రాత పరీక్షలకు ప్రత్యేక తరగతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు కల్పించడానికి ఆ సంస్థ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఆర్మీలో చేరాలనుకొనే యువతకు ప్రాథమిక అర్హతా పరీక్షలు నిర్వహించి పాసైన 450 మందిని ఎంపికచేసి, మూడునెలలపాటు రెసిడెన్షియల్ తరహాలో ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. పూర్తి చిత్తశుద్ధితో శిక్షణ ఇచ్చి నూరు శాతం మంది ఆర్మీలో ఉద్యోగాలు పొందేలా చూడాలని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశించిన నేపథ్యంలో డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ శిక్షణ శిబిరాల ఏర్పాటుకు రంగం సిద్ధంచేశారు. గతంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలను స్థానిక ఉద్యోగులు లేదా క్రీడాకారులతో నిర్వహించారు. కానీ, ఈసారి రిటైర్డ్ ఆర్మీ అధికారులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. రాతపరీక్షలో మంచి తర్ఫీదునివ్వడానికి సింగరేణి రిటైర్డ్ ఉపాధ్యాయుల బృందాలను నియమించారు. రాతపరీక్షకు కావాల్సిన మెటీరియల్‌ను సింగరేణి మూడు రీజియన్ కేంద్రాలకు సరఫరాచేశారు. ప్రణాళిక ప్రకారం బోధించడంతోపాటు రోజూ పరీక్షలు నిర్వహించి, లోటుపాట్లను సవరిస్తూ, యువకులను రాతపరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇలా పెద్దసంఖ్యలో ప్రీ ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిక్షణనివ్వడం రాష్ట్రంలోనే తొలిసారి అని, ప్రభుత్వ సంస్థలు ఇలాంటి చొరవ చూపడం అరుదని ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు ప్రశంసిస్తున్నారు.

### స్ఫూర్తిదాయక పాట విడుదల

ప్రీ ఆర్మీ శిక్షణలో పాల్గొంటున్నవారిలో స్ఫూర్తి నింపడానికి ప్రజాకవి జయరాజు రాసిన పాట సీడీని సింగరేణి జీఎం ఆంటోని రాజు, నర్సింహమూర్తి బుధవారం హైదరాబాద్‌లో విడుదలచేశారు.


తుమ్మిళ్ల డెలివరీ సిస్టర్న్ వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి


ఎత్తిపోతల పథకం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# సమైక్యపాలనలో కృష్ణానీళ్లు వృథా

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఎంజీకేఎల్ఐ మోటర్‌ను ప్రారంభించిన మంత్రి

**నాగర్‌కర్నూల్ / జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:** సమైక్యరాష్ట్రంలో పాలకుల విధానాలవల్ల కృష్ణానది నీళ్లు వృథాగా వెళ్లాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఐదేండ్లనుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేయించారని చెప్పారు. ఫలితంగా జిల్లాలోని బీడుభూములు బంగారుపంటలు పండిస్తున్నాయని తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని ఎంజీకేఎల్ఐ మూడో రిజర్వాయర్‌లో మొదటి మోటర్ ద్వారా మంత్రి నిరంజన్‌రెడ్డి నీటిని విడుదలచేశారు. రాజోళి మండలం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో ఒక పంప్‌ను ప్రారంభించి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఆయా కార్యాక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. ఎంజీకేఎల్ఐలో భాగంగా కొత్తగా 40 రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఆర్డీఎస్ రైతుల కన్నీళ్లు తుడిచేందుకే తుమ్మిళ్ల ప్రాజెక్ట్‌కు ఏర్పాటుచేశామని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో నాడు గుప్పెడు నీటికోసం గొడ్డెండ్లతో సహవాసం చేసిన మనం.. నేడు స్వరాష్ట్రంలో సయోధ్యతో సిరులు పండించుకుంటున్నామన్నారు. త్వరలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటించి ప్రాజెక్టులను పరిశీలిస్తారని, ఆ సమయంలో తుమ్మిళ్ల ప్రాజెక్ట్ రెండోదశ పనులకు సంబంధించి శుభవార్తను ప్రజలు వింటారని చెప్పారు.

## స్పెషల్‌డ్రైవ్ ద్వారా దోస్త్ వెబ్ ఆప్షన్ల ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 17,490 మంది ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారని దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 16,076 మంది అభ్యర్థులు కొత్తగా వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని పేర్కొన్నారు. స్పెషల్‌డ్రైవ్ ద్వారా 16,911 మందికి సీట్లు కేటాయించగా, అందులో 15,497 మంది కొత్తగా ఆప్షన్ ఎంపిక చేసుకున్న అభ్యర్థులున్నారని తెలిపారు. అభ్యర్థులకు సీట్లు కేటాయించిన ప్రకారంగా ఈ నెల 16 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 18న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

## డిమాండ్‌కు తగినట్లు యూరియా సరఫరా

### కలెక్టర్లకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎరువుల సరఫరా, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారధి బుధవారం కలెక్టర్లకు లేఖరాశారు. ప్రతిజిల్లాకు ఎన్ని ఎరువులు, ఎప్పుడు సరఫరా చేస్తున్నారో ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు కేంద్ర ఎరువులశాఖ పెడుతున్నదని, వీటిని కలెక్టర్లు తప్పనిసరిగా చూడాలని పేర్కొన్నారు. యూరియా సరఫరా, అమ్మకాలపై దృష్టిపెట్టాలని ఆయన ఆదేశించారు.

## మెడికల్ సీట్ల భర్తీపై హైకోర్టు తీర్పు రిజర్వు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) పరిధిలోని కన్వీనర్ కోటా రెండోదశ కౌన్సెలింగ్ ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌లో తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. మొదటి పిటిషన్‌లో వాదనలు ముగియడంతో జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కేశవరావు నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ప్రకటించింది. అంతకుముందు యూనివర్సిటీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వ జీవో, రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడుతున్నట్టు తెలిపారు.

# మళ్లీ ఇంటింటికీ వైద్య బృందాలు

- 2 నుంచి 70 ఏండ్ల వయసు వారికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు
- అంటువ్యాధులను గుర్తించేందుకు యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌లు
- 26 నుంచి ప్రారంభం, గాంధీ జయంతిలోగా ముగింపు
- నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఉన్నవారికి హెల్త్‌కార్డులు సిద్ధం

**అహ్మద్‌నగర్:** రాష్ట్రంలో వైద్య బృందాలు మళ్లీ ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నాయి. ఇప్పటివరకు నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్‌ను గుర్తించేందుకు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించిన వైద్య బృందాలు.. తాజాగా కమ్యూనికబుల్ డిసీజెస్‌ను (అంటువ్యాధులను) కూడా గుర్తించేందుకు యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌లు నిర్వహించనున్నాయి. ఏప్రిల్‌లో ప్రారంభించిన ఎన్‌సీడీ హెల్త్ స్క్రీనింగ్‌లలో బీపీ, షుగర్, క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన రోగులకు హెల్త్‌కార్డులను సిద్ధంచేసిన అధికారులు.. ఇప్పుడు నిర్వహించనున్న ఆరోగ్య పరీక్షల్లో లెప్రసీ (కుష్ఠు), టీబీ (క్షయ) తదితర లక్షణాలున్నవారికి గుర్తింపు కార్డులతోపాటు మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటివరకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలే నిర్వహించిన ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లకు భిన్నంగా యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌లలో పీహెచ్‌సీ, అంగన్‌వాడీ, ఆశా, మలేరియా, టీబీ, లెప్రసీ తదితర ప్రభుత్వ విభాగాల సిబ్బంది పరీక్షలు నిర్వహించనున్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లలో 30 ఏండ్లు పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా.. యూనివర్సల్ స్క్రీనింగ్‌లలో 2 నుంచి 70 ఏండ్లవారికి పరీక్షలు నిర్వహించి సరికొత్త ఆరోగ్య విప్లవానికి నాంది పలుకనున్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలను జాతిపిత మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్ 2)లోగా పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం మేరకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఇప్పటికే బస్తీ దవాఖానలు, స్పెషలిస్ట్ ఔట్‌రీచ్ క్యాంపులు, పాఠశాలల్లో ఆర్బీస్కే వైద్యసేవలు, పీహెచ్‌సీల్లో ఈవినింగ్ క్లినిక్‌లతో సంపూర్ణ ఆరోగ్యం దిశగా తెలంగాణ అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల 'కంటి వెలుగు' మెగా వైద్య శిబిరాలతో లక్షలమంది జీవితాల్లో వెలుగు నింపిన తెలంగాణ ప్రభుత్వం.. తాజాగా యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్‌ల ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలను (హెల్త్ ప్రొఫైల్‌ను) సిద్ధంచేసి ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు ఇవ్వనున్నది.




## నాటుసారా తరలిస్తున్న టీడీపీ నేత అరెస్టు

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** సముద్రం మీదుగా బోటులో నాటుసారా తరలిస్తున్న కాకినాడ జిల్లా టీడీపీ నేత మెడిశెట్టి బుజ్జిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్టుచేసి పెద్దఎత్తున సారా, బోటు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఆయన ఇలాగే సారా తరలిస్తూ పోలీసులకు చిక్కాడు.

## షోలాపూర్-వాడి సెక్షన్‌లో పలు రైళ్లు రద్దు

### హైదరాబాద్-శ్రీకాకుళం మధ్య 4 ప్రత్యేక సర్వీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** షోలాపూర్- వాడి సెక్షన్ పరిధిలో డబ్లింగ్ పనులు జరుగుతున్నందున ఈ నెల 16, 17, 18, 20, 21, 22, 23, 25 తేదీల్లో 42 రైళ్లను పూర్తిగా, 8 రైళ్లను పాక్షికంగా రద్దుచేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే వెల్లడించింది. రద్దీ దృష్ట్యా హైదరాబాద్-శ్రీకాకుళం మధ్య 17, 18, 19, 20 తేదీల్లో నాలుగు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ప్రకటిచించింది.

## 85.20 లక్షల ఎకరాల్లో
# వానకాలం పంటలు

- వారంరోజుల్లో 16 శాతం పెరిగిన వరినాట్లు
- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా 85.20 లక్షల ఎకరాల్లో వానకాలం పంటల సాగు నమోదయినట్టు వ్యవసాయ శాఖ బుధవారం ప్రభుత్వానికి నివేదించింది. వానకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 80 శాతం నమోదయింది. ఈ నెల ప్రారంభం నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. వానకాలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 23.83 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 14.70 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. గత వారంరోజుల్లోనే వరినాట్లు 16 శాతం పెరిగాయని, మిగిలిన నాట్లు రానున్న పదిరోజుల్లో పూర్తవుతాయని వ్యవసాయశాఖ వెల్లడించింది.

### 42.98 లక్షల ఎకరాల్లో పత్తి

రాష్ట్రంలో అత్యధికంగా పత్తి సాగవుతున్నది. ఇప్పటివరకు 42.98 లక్షల ఎకరాల్లో పత్తి పంట వేసిన రైతులు.. 8.53 లక్షల ఎకరాల్లో (69 శాతం) మొక్కజొన్న, 6.60 లక్షల ఎకరాల్లో (92 శాతం) కందులు, 4.23 లక్షల ఎకరాల్లో సోయాబీన్, 1.47 లక్షల ఎకరాల్లో పెసర్లు వేశారు. ప్రస్తుత వానకాలంలో ఆహారపంటలు 47.69 లక్షల ఎకరాల్లో వేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 33 లక్షల ఎకరాల్లో (69 శాతం) వేశారు. 4 జిల్లాల్లో 100 శాతం, 16 జిల్లాల్లో 76 శాతం నుంచి 100 శాతం, 12 జిల్లాల్లో 51 నుంచి 75 శాతం వరకు పంట సాగు నమోదైంది. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు.. జోగుళాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకుతున్నట్టు వ్యవసాయాధికారులు నిర్ధారించారు.

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
జిందగీ
గురువారం 15 ఆగస్టు 2019
/nt.zindagi

# బతకడానికి ఒక ఆశ ఉంటే..

**తల్లిదండ్రులు లేని పిల్లలను సమాజం చిన్నచూపు చూస్తుంది. వారికి ఎలాంటి రిజర్వేషన్ కల్పించకుండా ప్రభుత్వం వారిని ఒంటరిగానే బతకాలంటూ హేళన చేస్తుంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి అనాథలకు రిజర్వేషన్ కల్పించిందో మహిళ.**

గోవాకు చెందిన 24 ఏండ్ల అమృతా కార్వాండే అనాథాశ్రమంలో పెరిగింది. ఆమె బాధ్యతలు ఆశ్రమం పట్టించుకొనే గడువు కూడా తీరింది. ఆశ్రమం నుంచి బయటకు వచ్చిన అమృత ఎవరి కోసం బతకాలి? ఎందుకు బతకాలి? అనే అలోచనలతో ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. అంతలోనే ఓ వృద్ధ అంధ దంపతులు కంటపడ్డారు. వారు ఎవరిమీదా ఆధారపడకుండా బొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిని చూసి జీవితంపై కొత్త ఆలోచనలు, ఊహలు మొదలయ్యాయి అమృతకు. ఫ్రెండ్ సలహాతో పుణేలోని మోడ్రన్ కాలేజ్‌కు అప్లై చేసింది. కాలేజ్ హాస్టల్‌లో చేరింది. రాత్రి కాలేజ్‌కు వెళ్లడం, పగలు చిన్న ఉద్యోగం చేసేది. చదువు పూర్తి అయిన తర్వాత 2017లో ఓపెన్ కేటగిరి కింద మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు హాజరై 100కు 39 మార్కులు సాధించింది. మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ఉన్నా అమృతకు ఎలాంటి కాల్ రాలేదు. దీనికి ప్రధాన కారణం, తల్లిదండ్రుల సర్టిఫికేట్ లేకపోవడం. దీన్నంతటితో వదులకుండా అనాథలందరినీ ఒకచోట చేర్చి పోరాడాలనుకున్నది. తహశీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అందర్నీ కలిసి ఎన్నో ప్రయత్నాలు చేసింది. సాయం చేయడానికి వారికి ఎలాంటి అధికారం లేదని చెప్పారు. దీంతో అమృత అనాథ పిల్లలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రానికి ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సిఫారసు పంపింది. 2018లో అనాథల కోసం ప్రభుత్వ ఉద్యోగాలలో 1 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆమె పోరాటం అలా వృథా కాకుండా ఎంతోమంది అనాథలకు ఆశ రూపం అయింది.






# తియ్యని బంధం!

## మిల్క్ మైసూర్ పాక్



**కావాల్సినవి :**

**చక్కెర :** 400 గ్రా., **మిల్క్‌పౌడర్ :** 100 గ్రా., **మైదా :** 50 గ్రా., **నెయ్యి :** 100 గ్రా., **నట్స్ :** గార్నిష్ కొరకు

**తయారీ :**

నెయ్యి, మిల్క్‌పౌడర్, మైదాను కలిపి పెట్టుకోవాలి. కడాయిలో నీరు పోసి చక్కెర వేయాలి. పాకం తీగలా వచ్చేలా తయారు చేసుకోవాలి. దానిలో నెయ్యి, మిల్క్ పౌడర్, మైదా మిశ్రమాన్ని వేసుకొని బాగా కలుపుకోవాలి. మైదా కలర్ మారే వరకూ కలుపాలి. ఈ మిశ్రమాన్ని ట్రేలో వేసి చల్లారనివ్వాలి. ఇది పూర్తిగా చల్లారక ముందే వాటిని ముక్కలుగా కట్ చేసుకోవాలి. తరిగిన నట్స్‌తో అలంకరించుకొని సర్వ్ చేసుకుంటే రుచితో పాటు కలర్‌ఫుల్‌గానూ ఉంటుంది.

## ఐస్‌క్రీమ్ బర్ఫీ

**కావాల్సినవి :**

**చక్కెర :** 250 గ్రా., **పిస్తా :** 20 గ్రా., **మిల్క్ పౌడర్ :** 100 గ్రా., **నెయ్యి :** 50 గ్రా.

**తయారీ :**

మైదా, నెయ్యి, మిల్క్ పౌడర్ కలిపి పెట్టుకోవాలి. కడాయి పెట్టుకొని చక్కెర రెండు తీగల పాకం చేసుకోవాలి. అందులో మైదా, నెయ్యి, మిల్క్ పౌడర్ కలిపిన మిశ్రమాన్ని వేసి దించేయాలి. మిశ్రమం బాగా దగ్గర పడేవరకు కలుపాలి. ఆ తర్వాత ఒక పెద్ద ప్లేట్ మీద నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని పోయాలి. దీన్ని మీకు నచ్చిన షేప్‌లో కట్ చేసుకొని తరిగిన పిస్తాతో అలంకరించుకోవాలి. అంతే.. టేస్టీ ఐస్‌క్రీమ్ బర్ఫీ రెడీ!



## కోవా గుజియా



**కావాల్సినవి :**

**కోవా :** 150 గ్రా.
**నెయ్యి :** 50 గ్రా.
**చక్కెర :** 200 గ్రా.
**తినే సోడా :** 2 గ్రా.
**మైదా :** 250 గ్రా.
**నూనె :** తగినంత.

**తయారీ :**

మైదా, నెయ్యి, తినే సోడా, నీరు పోసి చపాతీ పిండిలా కలుపుకొని గంటపాటు పక్కన పెట్టుకోవాలి. చక్కెర రెండు తీగల పాకం పట్టుకోవాలి. మైదాను చిన్న ఉండలు చేసుకొని వాటిని ఒత్తుకోవాలి. కోవా ఫిల్లింగ్ పెట్టుకొని గుండ్రంగా చుట్టుకోవాలి. కావాలనుకున్నవాళ్లు సగం చంద్రుడు ఆకారంలో కూడా చుట్టుకోవచ్చు. కడాయిలో నూనె పోసి ఉండలను దోరగా వేయించుకోవాలి. వీటిని చక్కెర పాకంలో రెండు నిమిషాలు నానబెట్టి తీసివేయాలి. తయారయిన దాన్ని బాదం, పిస్తాలలో అలంకరించుకోవాలి.

## బ్రెడ్ రస్‌మలాయ్ రబ్డీ

**కావాల్సినవి :**

**బ్రెడ్ ముక్కలు :** 4, **పాలు :** 500 మి.లీ., **యాలకుల పొడి :** అర టీస్పూన్, **బాదం :** 10 గ్రా., **పిస్తా :** 10 గ్రా. **మిల్క్‌మెయిడ్ :** 50 మి.లీ., **చక్కెర :** 50 గ్రా., **నూనె :** తగినంత

**తయారీ :**

బ్రెడ్ ముక్కల మీద కొన్ని పాలు చిలుకరించి వాటిని కలుపుకొని ముద్దలా చేసుకోవాలి. బ్రెడ్ ఉండల మధ్యలో తరిగిన బాదం, పిస్తా పెట్టి మళ్ళీ రోల్ చేసుకోవాలి. కడాయిలో నూనె వేసి వేడి చేయాలి. సన్నని సెగపై రోల్స్‌ను దోరగా వేయించి చల్లారనివ్వాలి. మందపాటి గిన్నెలో మిగిలిన పాలు పోసి చిక్కపడే వరకూ మరిగించాలి. అందులో చక్కెర, మిల్క్‌మెయిడ్ వేసి బాగా మరిగించి యాలకుల పొడి వేసుకోవాలి. ఇప్పుడు దోరగా వేయించిన బ్రెడ్ రోల్స్‌ను మరిగిన పాలలో వేసి సన్నని సెగపై ఐదు నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో గంటపాటు ఉంచాలి. బాదం, పిస్తాలతో అలంకరించుకొని సర్వ్ చేయాలి.





**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

## విశ్వసనీయ వాగ్దానం..

# రక్షాబంధనం



**సహృదయం సాంమనస్యమవిద్వేషం కృణోమివః!**
**అన్యో ఉద్యమభిహర్యత వత్సం జాతిమివాఘ్న్యః!!**

మంచి మనుషులుగా, మానవత్వం ఉట్టిపడే వ్యక్తులుగా మిమ్మల్ని రూపొందించాను. మానవ జీవితాల్ని అర్థవంతం చేసుకోండని మనుషులను ఆశీర్వదిస్తూనే 'మనుర్భవ మనుషులు' కండని లోకాన్ని జాగృత పరుస్తుంది వేదవాఙ్మయం.

మన నమ్మకాలే మన ఆలోచనలు మన ఆలోచనలే మన మాటలు. మన మాటలే మన చేతలు. మన చేతలే మన అలవాట్లు. మన అలవాట్లే మన విలువలు. మన విలువలే మన జీవితం. రక్షాబంధనం భారతీయత నీడలో పెల్లుబికిన నైతిక విలువల వారసత్వానికి ఆలంబనై నిలిచింది. వ్యక్తి కేవలం కుటుంబంలోని ఆడపిల్లలకు రక్షణనివ్వడంతో పాటు వ్యవస్థకు ఆసరా ఇచ్చే స్థాయికి ఎదగాలనే విశ్వశ్రేయస్సును ధ్వనింపజేస్తున్నది రక్షాబంధనం. ప్రపంచం మనుగడ ముందుకు సాగుతుంటే మనిషి వ్యక్తిత్వం, మానవత్వం మరుగున పడుతాయి. అమానుషత్వాన్ని రూపుమాపే రామరక్ష కావాలి రక్షాబంధనం. సంప్రదాయాలూ, విలువలూ మనిషికి ఎప్పుడూ ఒకే విధంగా దిశానిర్దేశం చేస్తాయి. ప్రపంచం, సమాజం ఎప్పుడూ మనిషి వెన్నంటి ఉంటాయి. మనం ప్రపంచానికి బాధ్యతాయుత భరోసాను ఇవ్వగలగడమే మనుషులుగా ప్రథమ కర్తవ్యం.

> మంచి మనుషులుగా, మానవత్వం ఉట్టిపడే వ్యక్తులుగా మిమ్మల్ని రూపొందించాను. మానవ జీవితాల్ని అర్థవంతం చేసుకోండని మనుషులను ఆశీర్వదిస్తూనే 'మనుర్భవ మనుషులు' కండని లోకాన్ని జాగృత పరుస్తుంది వేదవాఙ్మయం.

విశ్వసనీయ వాగ్దానంగా భావించే రక్షాబంధనం రక్తసంబంధానికి మాత్రమే కాదు మానవీయ బంధాలకూ ప్రతీకగా నిలవాలి. త్యాగం, ప్రేమ, అనుబంధం, ఆదరణ, ఆప్యాయత, ఆలోచనలనే విలువల వారధి కావాలి. సంస్కృతీ పరంపరలో అనాదిగా వస్తున్న రక్షాబంధన వేడుక సహృదయతకు చిహ్నం. సహృదయత విశ్వశాంతినీ, సమరస భావనలనూ పెంపొందిస్తుంది. కల్మషం లేని మనుషుల భావతోరణం రక్షాబంధనమై నిలిస్తే సమాజంలోని అరాచక, అమానుష, అనిశ్చితి క్రియలను కార్యరూపం దాల్చకుండా చేస్తుంది. స్త్రీజాతి నిశ్చింతగా నిలబడగలుగుతుంది. బలం బలహీనతకు అభయం అవ్వాలి. కానీ భయం అవ్వకూడదు. శ్రీకృష్ణుడు చెప్పినట్లు రక్షా బంధనాన్ని ఒక్కసారి కట్టించుకుంటే ఆ సంవత్సరమంతా దుష్టశక్తుల భయాలుండవని.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అమానుష దుష్ట శక్తులన్నింటినీ సోదరులకు సోదరీమణులు కట్టే రాఖీ పారదోలాలని, ధైర్యంగా ప్రపంచం ముందుకు నడవాలనీ, మనుషులుగా మనుషులు తమపై విజయం సాధించాలనీ కోరుకోవాలి.

ప్రతీ ఆచరణ ఒక కొత్త ఆలోచనతోనే సాధ్యపడుతుంది. ప్రతి ఒక్కరూ ఆడపిల్లని గౌరవిస్తే కేవలం స్త్రీ జాతికి భద్రతనిచ్చినట్లు కాదు. కుటుంబాలను రక్షించినట్లు! వేద విజ్ఞానం అయినా, పురాణ కథనం అయినా, సంప్రదాయ వారసత్వం అయినా, సంస్కృతీ పరంపర అయినా మనిషిని విలువలకు రూపంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్ష వంటిది. రక్షాబంధన వేడుకు కూడా మానవీయ విలువలను అనుబంధాలకు ప్రతీకగా, విశ్వసనీయతకు ఆలంబనగా, భద్రతకు ప్రతిరూపంగా పరిఢవిల్లాలని కోరుకుంటూ రక్షాబంధన శుభాకాంక్షలు.

- ఇట్టేడు అర్కనందనాదేవి.






II.
నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 15 ఆగస్టు 2019
raithubadi@ntnews.com



# పత్తి పంటలో పురుగులు, తెగుళ్ల నివారణ

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు, మబ్బులతో కూడుకున్న చల్లని వాతావరణం వల్ల పత్తి పంటలో చాలాచోట్ల పేనుబంక, పచ్చదోమ ఉధృతి గమనించాం. అలాగే ముందుగా విత్తుకున్న పత్తి పూత దశకు వచ్చింది. కొన్నిచోట్ల ఈ పూతకు వచ్చిన పత్తి పంటలో గులాబీరంగు కాయ తొలుచు పురుగు గమనించాం. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే కింది సూచనలు పాటించి పత్తి పంటను పురుగు తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

అధిక వర్షాలకు చాలాచోట్ల పత్తి పంటలో వడలు తెగులు (పారావిల్ట్) గమనించాం. దీని నివారణకు వాన నీటిని కాలువల ద్వారా బయటకు పంపి, వడలుపోయిన మొక్కలు, చుట్టూ ఉన్న మొక్కల మొదళ్ళ వద్ద వేరు వ్యవస్థ బాగా తడిచేటట్లుగా లీటరు నీటికి 3 గ్రా.ల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపిపోయాలి. వారం వ్యవధిలో అవసరాన్ని బట్టి మళ్లీ ఇదే పద్ధతిలో భూమిని తడపాలి.

వానలు ఆగిన వెంటనే మొక్కలపై లీటరు నీటికి 10 గ్రా.ల 13–0–45 (మల్టి.కె) లేదా 19:19:19 (పాలీఫీడ్) పిచికారీ చేసుకున్నట్లయితే వడలు తెగులు, పోషకాల సమస్యల నుంచి పత్తి పంటను కాపాడుకోవచ్చు. అవసరాన్ని బట్టి వారంరోజుల వ్యవధిలో మళ్లీ పిచికారీ చేయాలి. అలాగే గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల అక్కడక్కడ పత్తి పంటలో సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులును గమనించాం. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండిజిమ్ లేదా 2.5 గ్రా.ల కార్బండజిమ్+మాంకోజెబ్ మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.

ప్రస్తుతం కురిసిన అధిక వర్షాలు, మబ్బులతో కూడుకున్న వాతావరణం వల్ల పత్తి పంటను పచ్చదోమ ఆశించే అవకాశం ఎక్కువగా వున్నది. పచ్చదోమ నివారణకు కాండానికి మందుపూతను మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో పంట 45,60 రోజులలో పూసుకోవాలి లేదా ఫిప్రొనిల్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పై మందులతో పాటు అడపాదడపా 5 శాతం వేప కషాయాన్ని లేదా 5మి.లీ వేపనూనె (1500 పీపీఎం) ను కలిపి కూడా సాయంత్రం పూట పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

ప్రస్తుత వాతావరణంలో పత్తి పంటలో అక్కడక్కడ పొగాకు లద్దె పురుగు ఆశించి పత్తి ఆకులను జల్లెడ ఆకులుగా మార్చి నష్టపరుస్తుంది. దీని నివారణకు, పురుగు గుడ్లను, పెద్ద లార్వాలను, పురుగులున్న జల్లెడ ఆకులను ఎప్పటికప్పుడు ఏరివేసి నాశనం చేయాలి. అలాగే లీటరు నీటికి 2.5 మి.లీ క్లోరోపైరిఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 0.5 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. మూడవ దశ దాటిన లేదా బాగా పెరిగిన లద్దె పురుగులను రసాయన మందులతో అదుపు చేయడం కష్టం. కాబట్టి తవుడు బెల్లం కలిపిన విషపు ఎరను వాడాలి. దీనికి గాను ఎకరానికి 10 కిలోల తవు డు, 2 కిలోల బెల్లంతో పాటు 1 లీటరు మోనోక్రోటోఫాస్ లేదా 750 మి.లీ. క్లోరోపైరిఫాస్ లేదా 300 గ్రా.ల థయోడికార్బ్ మందుకు సరిపడే నీటిని కలిపి, మిశ్రమం పులిసిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో చేనులో చల్లుకోవాలి. వానలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎకరానికి 30–35 కేజీల యూరియా+10 కేజీల పొటాషియంను వేసుకోవాలి.



పేను బంక నివారణకు కాండానికి మందు పూతను (పైన లేత ఆకు పచ్చ భాగంలో) మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో మరియు ఫ్లోనికామిడ్, నీరును 1:20 నిష్పత్తిలో 45, 60 రోజుల్లో పూయాలి. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా లేదా ఫిప్రొనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.



అధిక వానలకు అక్కడక్కడ ఆకులు పసుపు రంగు లేదా ఎరుపు రంగులోకి మారడం గమనించడం జరిగింది. దీనికిగాను పై పాటుగా లీటరు నీటికి 10 గ్రా.ల యూరియా+10 గ్రా.ల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి వారం–పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. అధిక వానలకు సమయానుకూలంగా అంతరకృషి చేయలేకపోవడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. లేత గడ్డి జాతి కలుపు నివారణకు లీటరు నీటికి 2 మి.లీ.ల క్విజలోఫాప్ ఇథైల్ (టర్గా సూపర్) లేదా 1.25 మి.లీ ప్రొపాక్విజాఫాప్ (ఏజిల్)ను పిచికారీ చేయాలి. కేవలం వెడల్పాటి కలుపు మొక్కలు ఉన్నట్లయితే లీటరు నీటికి 1.25 మి.లీ. పైరిథయోబ్యాక్ సోడియం (హిట్ వీడ్/థీమ్) కలిపి పిచికారీ చేయాలి. సన్న గడ్డి, వెడల్పాటి గడ్డి రెండూ ఉన్నట్లయితే లీటరు నీటికి 2 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ లేదా 1.25 మి.మీ. ప్రొపాక్విజాపాప్ మరియు 1.25 మి.మీ పైరిథయోబ్యాక్ సోడియం కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

చాలాచోట్ల ముందుగా విత్తుకున్న పత్తిలో గులాబీరంగు కాయతొలుచు పురుగు 'గుడ్డిపూల' రూపంలో ఆశించి నష్టపరుస్తున్నట్టు గమనించాం. కాబట్టి రైతులు పురుగుపై నిఘా ఉంచడానికి ఎకరానికి 4 లేదా 8 లింగాకర్షక బుట్టలను తక్షణమే పెట్టుకోవాలి. ఈ బుట్టలలో వరుసగా 3 రోజులు 5 నుంచి 8 చొప్పున మగ రెక్కల పురుగులు పడినట్లు గమనిస్తే ఉదయం 6 గంటల నుంచి 11 గంటలలో లేదా సాయంత్రం 4–6 గంటలలోపు ఈ కింది రసాయన మందులను పిచికారీ చేసుకోవాలి. 5 శాతం వేప కషాయాన్ని లేదా వేపనూనె 5 మి.లీ లీటరు నీటికి కలిపి వాడాలి.థయోడికార్బ్ 1.5 గ్రా లేదా ప్రొఫెనోఫాస్ 2. మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి. దీనిద్వారా చాలావరకు పురుగు గుడ్లను చిన్న పురుగును (లార్వాను) నివారించుకోవచ్చు. గుడ్డి పూలను ఎప్పటికప్పుడు నాశనం చేస్తే పురుగు ఉధృతిని తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

డాక్టర్ బి. రాంప్రసాద్
సీనియర్ శాస్త్రవేత్త (కీటక విభాగం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్

ఎ. సుదర్శనమ్
ప్రధాన శాస్త్రవేత్త (పత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, వరంగల్

# ఉద్యానపంటల్లో ప్లాస్టిక్, మల్చింగ్‌తో ఉపయోగాలు

ఉద్యానరంగాల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల నీటి ఆదాతో పాటు నేలలో తేమ ఆవిరి కాకుండా చేసి నాణ్యమైన అధిక దిగుబడులను పొందవచ్చు. ప్లాస్టిక్ తేలికగా ఉండి ఎక్కువరోజులు మన్నిక కలిగి ఉంటుంది. తక్కువ ధరకు లభిస్తుంది. నిర్వాహణ కూడా చాలా అనుకూలంగా ఉన్నది. దీనివల్ల రైతులలో మంచి అవగాహన కలిగి వీటి వాడుక అనతికాలంలోనే బాగా పెరిగింది. పంటల్లో మంచి దిగుబడులు సాధించాలంటే రైతులు ఉద్యానరంగాల్లో ప్లాస్టిక్ పరికరాలను విరివిగా ఉపయోగించాలని నిపుణులు సూచించారు. అయితే వీటి వాడకం, వీటివల్ల కలిగే ఉపయోగాల గురించి గడ్డిపల్లి కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ వివరించారు. అదనపు సమాచారం కోసం 9603268682 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

మొక్కల చుట్టూ ఉండే వేళ్ళ భాగాన్ని ఏవేని పదార్థాలతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. పూర్వం ఈ పద్ధతికి వరిపొట్టు, రంపపు పొట్టు, చెరుకు పిప్పి, ఎండిన ఆకులు చిన్నచిన్న గులకరాళ్ళు మొదలైనవి వాడేవారు. కానీ వీటి వినియోగం ఇతర అనుబంధ సంస్థలలో ఉన్నందువల్ల (ఉదా: ఇటుకబట్టీలు మొదలైనవి), వాటి లభ్యత రాను రాను తగ్గుతున్నందున ప్లాస్టిక్ షీటుతో మల్చింగ్ చేయడం ప్రాముఖ్యం సంతరించుకున్నది. ప్లాస్టిక్ షీటుతో మొక్క చుట్టూరా కప్పి ఉంచడాన్ని 'ప్లాస్టిక్ మల్చింగ్' అంటారు. ఈవిధానాన్ని పలురకాల తోటలలో అవలంబించి ఆ తోటలలో నాణ్యతతో కూడిన దిగుబడులను పొందవచ్చు.



### మల్చింగ్‌తో లాభాలు

**నీటి ఆదా:** మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమను ఆవిరికాకుండా నివారిస్తుంది. దీనివల్ల వివిధ కాల పరిమితులు గల పంటలకు 30–40 శాతం వరకు నీటి ఆదా అవుతుంది. దీన్ని బిందు సేద్య పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20 శాతం నీరు ఆదా అవుతుంది. తద్వారా పంటలకు 2–3 నీటి తడులు ఆదా అవుతాయి.

**కలుపు నివారణ:** సూర్యరశ్మిని నేరుగా కలుపు మొక్కలకు చేరనీయదు. దీనివల్ల కిరణజన్య సంయోగక్రియ జరుగక సుమారు 85 శాతం వరకు నివారణవుతుంది. తద్వారా పర్యావరణ సంరక్షణ జరుగుతుంది.

**మట్టికోత నివారణ:** వర్షపు నీరు నేరుగా భూమిపైన పడకుండా నివారించడం వల్ల మట్టి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించవచ్చు.

**నేల ఉష్ణోగ్రత నియంత్రణ:** మొక్క చుట్టూ సూక్ష్మవాతావరణ పరిస్థితులను కలుగజేస్తూ నేల ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. తద్వారా నేలలో ఉండే సూక్ష్మజీవుల చర్య అధికమై నేల నిర్మాణాన్ని వృద్ధి చేస్తూ మొక్కలకు అన్ని పోషక పదార్థాలు అందేలా చేస్తుంది.

**భూమిలోని చీడపీడల నివారణ:** పారదర్శక ఫిల్మును వేసవిలో భూమిపై పరిచి సూర్యరశ్మిని లోనికి ప్రసరింపజేసి భూమిలోని క్రిమికీటకాదులను, తెగుళ్ళను నివారిస్తుంది. ఈ ప్రక్రియను 'నేల సోలరైజేషన్' అని అంటారు.

### ఎరువులు, క్రిమిసంహారక మందుల ఆదా

నేలలో వేసిన ఎరువులు భూమి లోపలి పొరల్లోకి వెళ్ళకుండా నివారిస్తుంది. దీనివల్ల కలుపు నివారణ జరిగి క్రిమిసంహారక మందుల ఆవశ్యకత తగ్గుతుంది.

**నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు:** మొక్కలకు వాటి జీవితకాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు కలుగడం వల్ల పంట ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు (20–50 శాతం) పొందవచ్చు.

**నేల తయారీ ఖర్చు ఆదా:** భూమిలో ఎల్లప్పుడు తేమ నిల్వ ఉండటం వల్ల నేల గుల్లబారి వేరువ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపలి పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది. దీనివల్ల పంట కాలం తర్వాత నేల తయారీకి అయ్యే ఖర్చు ఆదా అవుతుంది.

మల్చిషీట్లు అతినీలలోహిత, పరారుణ కిరణాలకు తట్టుకునే విధంగా రసాయనశుద్ధి ద్వారా తయారుచేస్తారు. దీనివల్ల వీటి మన్నిక కనీసం మూడేండ్ల వరకు ఉంటుంది. ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు వివిధ రంగుల్లో లభిస్తాయి. ఉదా: నలుపు, తెలుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, వెండి రంగు మరియు రెండు వైపులా వేర్వేరు రంగులవి కూడా లభిస్తాయి. ఉదా: నలుపు– తెలుపు, పసుపు–నలుపు, వెండిరంగు గలవి. ఒక్కొక్క రంగు షీటు ఒక్కొక్క పంటకు మరియు కాలములలో ఉపయోగించవలసి ఉంటుంది. ఉదా: టమాటాలో ఎరుపు, నలుపు, ఆకుపచ్చ, మల్చిషీటు వాడటం వల్ల తెలుపు, వెండిరంగు పారదర్శక షీట్ల కంటే నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందవచ్చు. అలాగే సిమ్లా మిర్చిలో ఎరుపు రంగుది తెలుపు రంగు కంటే, కాలిఫ్లవర్‌లో నలుపుది తెలుపు రంగుకంటే క్యాబేజీలో పసుపు రంగుది ఆకుపచ్చరంగు కంటే అధిక దిగుబడులనిస్తాయి. కొబ్బరి చెట్లకు వెండిరంగు మల్చిషీట్లను కాండానికి తొడిగితే మొవ్వ పురుగు తాకిడిని నివారించవచ్చు. అధే విధంగా వేసవికాలంలో తెలుపు రంగు షీటును, చలికాలంలో నలుపు రంగు షీటును వాడాలి. మొక్కల గింజలు మొలకెత్తడానికి పలుచటి నలుపు రంగు మల్చి షీట్లను వాడాలి.

**మల్చిషీటు లక్షణాలు:** ఇవి గాలి భూమిలోనికి చొరబడనీయనివై ఉండాలి. నేలలో ఉండే ఉష్ణోగ్రతను బయటి వాతావరణంలో కలువనీయకుండా ఉండాలి. మల్చిషీటు మన్నిక ఒకసారి భూమిపై వేసిన తర్వాత కనీసం ఒక పంటకాలానికైనా వచ్చేదై ఉండాలి.

**మల్చింగ్ చేసే విధానం:** మొక్కలకు ఇరువైపులా (కూరగాయలు) లేక చుట్టూరా (పూలు, పండ్లమొక్కలు) 5–10 సెం.మీ లోతు గాడీ చేయా లి. మల్చి షీటును కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతీ వరుసలో లేక చెట్టు దగ్గర మరీ వదులుగా లేక బిగువగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడీలోకి పోయేటట్లు చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను 'యాంకరింగ్' అంటారు. దీనివల్ల మల్చిషీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

### అనేక లాభాలు



ఉద్యానరంగంలో ప్లాస్టిక్ వినియోగంతో అనేక లాభాలు ఉంటాయి. నీటి ఆదాతో పాటు కలుపు నివారణ కూడా రైతులకు చాలా తేలిక అవుతుంది. అలాగే నేలలో తేమ కూడా కాపాడుకోవచ్చు. అలాగే ఎరువులకు అయ్యే ఖర్చు కూడా చాలా తగ్గించుకోవచ్చు. దీనితో బిందు సేద్యాన్ని ఆచరిస్తే మరీ మంచిది.

– సీహెచ్.నరేష్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

### మల్చింగ్ చేసే విధానం: ఇది రెడు రకాలుగా ఉంటుంది

**1) విత్తుటకు ముందుగా మల్చింగ్ చేసే విధానం:** మొక్కకు మొక్కకు, అలాగే వరుసకు వరుసకు మధ్య దూరాన్ని బట్టి ముందుగానే షీటుపై రంధ్రాలు చేసుకోవాలి. (ప్రస్తుతం రంధ్రాలు గల షీట్లు కూడా లభ్యమవుతున్నాయి) ఈ షీట్లను ప్రతి వరుస మీద ఊతమివ్వాలి.. రంధ్రాలలో ఒక్కొక్క విత్తనం వేసి మట్టితో కప్పాలి. ఆ తర్వాత నీరు పెట్టాలి. దీనివల్ల సుమారు 20–25 శాతం విత్తనాలు ఆదా అవుతాయి.

**2) నాటిన పైరుకు మల్చింగ్ చేసే విధానం:** మొక్కల చుట్టూ అనుకూలంగా మల్చిషీటును ముందుగా తగిన సైజులో కత్తిరించుకోవాలి. ఆ తర్వాత మల్చిషీటుపై మొక్కల దగ్గర చిన్నచిన్న రంధ్రాలు చేసి వాటిని తొడిగి అన్ని చివరలను ఊతమివ్వాలి.

### మల్చింగ్ వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మల్చిషీటును బలంగా లాగరాదు. చల్లని వాతావరణ సమయాల్లో అంటే పొద్దుగాల లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే మల్చిషీటు వేయాలి. ఎందుకంటే దీనికి సాగే గుణం ఉంటుంది కాబట్టి సరిగ్గా పని చేయదు. గంటకు 5 కి.మీ కంటే ఎక్కువ వేగంతో గాలి ఉండే ప్రాంతాల్లో మల్చి వేయకూడదు. పంటకాలం తర్వాత మల్చిషీటును పొలం నుంచి తీసివేసి పొలం పనులు చేసుకోవాలి. 7–25 మైక్రాన్‌ల మందం కల్గిన మల్చిషీట్లు మూడేండ్ల వరకు మన్నికగా వాడుకోవచ్చు.

-నట్టె కోటేశ్వర్‌రావు, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

# ఇంటిపైన ఇంద్రధనస్సు రంగులు




ఇంద్రధనస్సు రంగులన్నీ ఇంటిపైన విరబూసినట్టు
సీతాకొకచిలుకల వర్ణాలే కొమ్మల్లో పూలై వాలినట్టు
శీతాకాలపు సౌందర్యం శాశ్వతంగా ఇక్కడే నిలిచినట్టు
ఒక సంభ్రమం..ఒక విభ్రమం. ఈ వర్ణరంజిత దృశ్యాన్ని దర్శిస్తే
మనమున్నది నగరనడిబొడ్డులోనా, పూలలోయల వాలులోనా
అని ఒక్కక్షణం తత్తరపడక తప్పదు. సమయాన్ని, సృజనను మిళితం చేసి
ఒక నిర్జీవ స్థలాన్ని పూలవనంలా మార్చిన వేదాంతం లీలారవి
ప్రకృతి ప్రేమకు సలాం చేయాల్సిందే.

చాలామంది లాగానే లీలా రవికి కూడా మొక్కలంటే చాలా ఇష్టం. భర్త సింగరేణి కాలరీస్‌లో డి.జి.ఎం (సివిల్ డిపార్ట్‌మెంట్)గా పనిచేసేటపుడు క్వార్టర్స్‌లో కావలసినంత స్థలం ఉండటంతో క్రోటన్స్, పూల మొక్కలు, కూరగాయలు పెంచారు. తరువాత హైదరాబాద్ వచ్చాక సొంత ఇంట్లో కొద్దిస్థలం మాత్రమే ఉండటంతో కొన్ని మొక్కలు నాటారు. సొర తీగను కింద నుంచి మూడంతస్థులపైకి పాకించి పైన పందిరి వేశారు. 1996లో శ్రీనగర్ కాలనీ కమలానగర్‌లో ఇళ్లు కట్టుకున్నాక తన కలల్ని ఇంటి పైన అందమైన వనంలా అల్లుకున్నారు.

సాయంత్రం వేళల్లో సువాసనలు విరజిమ్మే గోవర్ధనం, రెండు మూడు రోజుల పాటు వాడిపోకుండా నూతనంగా ఉండే దొంతర మల్లె,సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు తాజాగా ఉండే ఫోరో క్లాక్ ఫ్లవర్ (చంద్రకాంత), తేనెటీగలను ఆకర్షించే హనీ సకెల్, స్కార్లెట్ మిల్క్‌వీడ్, రుతువులకతీతంగా రోజూపూసే నిత్యమల్లెలు, డిసెంబర్‌లోనే పూసి సీతాకొకచిలుకలను విపరీతంగా ఆకర్షించే కలోంజెస్, ఉదయం తెలుపు, మధ్యాహ్నం వైట్‌పింక్, సాయంత్రానికి మెజంతా పింక్ వర్ణంలోకి మారే పత్తిమందారం, మొగ్గలుగా ఉన్నపుడు మ్యూజికల్‌నోట్స్‌లా ఉండే తెల్లని పూల మొక్కలు, శివుడికి ప్రీతికరమైన దేవకాంచనం, గన్నేరు, శంఖు పూలు, లలితాంబకు ఇష్టమైన మందారాలు, లక్ష్మీదేవికి ఇష్మమైన కలువలు, తామరలు.. ఒకటా రెండా సుమారు 1200 చదరపు అడుగుల స్థలంలో దాదాపు 500 కుండీల్లో రకరకాల పూల మొక్కలు. నిజంగా ఒక ఇంటిపై ఇన్ని మొక్కలు కనిపించడం అరుదు. కొన్ని నర్సరీల నుంచి మరికొన్ని మొక్కలు స్నేహితుల దగ్గర నుంచి వచ్చినవి. అలా అలా విస్తరించిన ఈ తోటలో ఒక అవ్యక్త పరిమళమేదో గుబాలిస్తుంటుంది. అసలు కొన్ని మొక్కలకైతే ఆమే సొంతంగా అనువైన, సులువైన పేర్లు పెట్టుకున్నారు. లాబ్‌క్యాస్టర్‌ను ప్యారట్ ఫ్లవర్ అని, గుర్రపుడెక్క (వాటర్ హయసింత్) పుష్పానికి నెమలిపింఛం అని, అమరిల్లీస్ పుష్పాలకు గ్రామ్‌ఫోన్ ఫ్లవర్ అని పేరు పెట్టుకున్నారు. పొద్దున లేచి తోటలోకి వచ్చాకే నారోజు మొదలవుతుంది అంటారు లీలారవి. ఆమె కవిత్వం అల్ల డం, అల్లికలు కూర్చడం చేసినట్టుగానే పూలు, కూరగాయలు,విత్తనాలు ఆమె చేతిలో అందమైన అలంకరణలుగా రూపుదిద్దుకుంటాయి. ప్రతీ పండగ సందర్భం ఆమె చేతల్లో ఓ అందమైన వర్ణచిత్రమై తళుక్కుమంటుంది.

ఆమె సృజనకు తోడుగా ఈ మిద్దెపై తేనెటీగలు ఝుమ్మంటూ సంగీతాన్ని వినిపిస్తుంటాయి. పలువర్ణాల, పరిమళభరిత పుష్పాల మకరందాన్ని చుక్కాచుక్కా ఒడిసిపట్టి తేనెబొట్లుగా రంగరించి దాచుకున్న ఒక పెద్ద తేనెపట్టు దేవగన్నేరు మొక్కపై కొలువైంది. దీనికితోడు పిచ్చుకలు, పావురాలు, ఉడతలు, హమ్మింగ్‌బర్డ్ వంటి చిన్న చిన్న పక్షులు ఈ సుగంధవనం చుట్టూతా తిరుగుతుంటాయి. ఆమెకు ఎక్కువగా పూల మీద వ్యామోహం ఉన్నప్పటికీ, ఇంటికి కావలసిన కూరగాయలు కూడా పండిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతులు, తీగజాతులతో పాటు మక్కజొన్న వేశారు. ఆర్నమెంటల్ చిల్లీస్, పైకి కాసే నల్ల మిరపవంటి అరుదైన మొక్కలు ఇక్కడ కనిపిస్తాయి. సొర మొదటిసారి ఫ్రూట్‌ఫ్లై సమస్య వల్ల సక్సెస్‌ఫుల్‌గా పండిచలేకపోయానంటారు. కానీ ఈసారి మొక్క ఆరోగ్యంగా పెరుగుతోంది అంది ఆనందంగా. టమాటా, మిరప, దోస నా తోటలో వాటంటరీ ప్లాంట్స్. నాటనవసరం లేకుండా వాటంతటవే పెరుగుతాయి. దానిమ్మ, జామ, నిమ్మ వేయకుండానే పడేసిన విత్తనం నుండే పుట్టాయి. నిమ్మ నూరు శాతం సక్సెస్‌ఫుల్. ఇపుడు ఇరవైదాకా నిమ్మకాయలు కాశాయి. తొక్క చాలా పలుచగా ఉండి, రసం ఎక్కువగా వస్తోంది అంటారామె.

ఐతే తన తోటలోంచి వచ్చిన విత్తనాలను, మొక్కలను ఎప్పటికపుడు పంచుతుంటారు లీలారవి. మొక్కకు మొదట వచ్చిన కాయను విత్తనానికి ఉంచి, వాటి నుంచి సేకరించిన విత్తనాలను, తన వద్ద అదనంగా ఉన్న మొక్కల లిస్ట్‌ను ఇంటిపంటల గ్రూప్‌లలో పెట్టి, స్పందించిన వాళ్లకు అందిస్తుంటారు. అలాగే తన ఇంటిలో పండిన కూరగాయలతో రకరకాల వంటలు చేసి గ్రూప్‌లో పెడతారు. ఒకసారి ఇంటిపంట గ్రూప్ యానివర్సరీకి, రూఫ్ గార్డెన్ మిత్రుల ఎరువు కోసం వంద ప్యాకెట్ల చెరకు వ్యర్థాల్ని పంచారు. ఇలా ఎప్పటికపుడు ఏదో ఒక యాక్టివిటీతో తన ప్రకృతి ప్రేమికుల్ని ఉత్తేజపరుస్తుంటారు. అసలు ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో ఆమె తను పండించిన వాడితో ఎలాంటి డిజైన్స్ చేసి ఫోటోలు పెడుతుందా అని సోషల్ మీడియా గ్రూపుల్లో ఎదురు చూస్తారంటే అర్థమవుతున్నది ఆమె ప్రత్యేకత. ఇలా బహుముఖ ప్రజ్ఞతో ఆమె ఇంట్లోనే తనదైన ప్రపంచాన్ని సృష్టించుకున్నారు.

భర్త స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, బిల్డర్‌గా స్థిరపడ్డాక శంషాబాద్‌లో శృంగేరీ పీఠానికి చెందిన శారదాంబ అమ్మవారి గుడి నిర్మించారు. అక్కడ శివునికి ఇష్టమైన మొక్కల గురించి వివరాలు సేకరించి తెలుసుకుని అందులో బిల్వ, అశ్వత్థ, పున్నాగ, పొగడ, పున్న, రుద్రాక్ష, సంపంగి, వేప, రావి, మర్రి మొక్కలు నాటారు. మొక్కల గురించి తెలుసుకోవడం,వాటిని పెంచడం, పంచడం ఆమె అణువణువునా జీర్ణించుకపోయిందంటే అతిశయోక్తి లేదు.

మరింత అందమైన మిద్దెతోటను మేనేజ్‌చేయాలంటే కుండీల నుంచి మట్టిమిశ్రమం ప్రతి దశలో చాలా జాగ్రత్తలు తీసుకోవాంటారు లీలా రవి. కావలసినంత మట్టి మిశ్రమం పట్టేలా కుండీలు ఉండాలి. ఏ ఒక్క ఎంత సైజు కుండీలో పెరుగుతుందో చూసుకోవాలి. కుండీ అడుగున ఎక్కువైన నీరు వెళ్లేందుకు రంధ్రాలు చేయాలి. అవి పూడిపోకుండా రెండు అంగుళాల మందాన గులకరాళ్లు వేయాలంటారు. మట్టిమిశ్రమం విషయానికి వస్తే, కుండీ లో సగం ఎర్రమట్టి, ఇరవై శాతం ఇసుక, కొంచెం వేపపిండి, కొంచెం కోకోపిట్ కలిపి వేస్తారు. ఈ మిశ్రమం కలిపిన తరువాత ఒక ప్లాస్టిక్ బాటిల్ అడుగు భాగాన్ని నాలుగైదు ఇంచుల ఎత్తుమేర గుండ్రంగా కత్తిరించి, అడుగు భాగంలో చిన్నచిన్న రంధ్రాలు చేసి,విత్తనం వేసాక దాని చుట్టూ పెడతారు. అపుడు ఎదిగే వరకు నీళ్లు పోసినా మొక్క కదలకుండా,పక్కకు జరగకుండా అలాగే ఉంటుంది.

ఎరువు తయారీలో భాగంగా ఒక కుండలో పండ్లు,కూరగాయలు, పూల వ్యర్థాలు వేసి అందులో మూడురోజులకొకసారి కోకోపిట్,వర్మికంపోస్ట్ వేసి పైకి కిందకు కలిపితే, నలభై రోజుల్లో తయారవుతుంది. అప్పుడపుడూ కూరగాయలు, పండ్లు, పూల వ్యర్థాలను రెండురోజులపాటు అలాగే మిక్సీ పట్టి జ్యూస్ చేసి ఎరువు కుండలో పోస్తారు. అందులో పచ్చి వేపాకులు తెచ్చి గ్రైండ్ చేసి అందులో పోస్తే ఎలాంటి పురుగులు దరిచేరవు అంటారు లీలారవి. దీనిని పదిహేనురోజులకొకసారి గుప్పెడు వేస్తారు. కుండీలలో కాఫీ పొడి కూడా వేస్తున్నారు. దీనివల్ల పూలు బాగా పూస్తాయంటారు. శంషాబాద్‌లో తమ మెయింటెనెన్స్‌లో ఉన్న గోశాలనుంచి ఆవుమూత్రం తెచ్చి పిచికారీ చేస్తారు. కొన్నిసార్లు ఘనజీవామృతం తయారుచేసుకుని వాడుకుంటున్నారు. తెగుళ్లకు బూడిద, పసుపు కలిపి చల్లుతున్నారు. మిల్లీబగ్స్ సమస్యకు పుల్లనిమజ్జిగలో పసుపు కలిపి వాడుతున్నారు. దీనివల్ల టమాటా, పచ్చిమిర్చిలో కాత కూడా బాగా వస్తుందని ఈ మధ్యే తెలిసిందంటారు. అసలు కింద నేల బాగుంటే పైన అంతా బాగుంటుందంటారామె.

తోట మనకొక బాధ్యత, మనకది భరోసా. అందులో మొక్కలను పిల్లలను చూసినట్టు చూడాలి. అపుడే అది పచ్చగా మన మనసుల్లోకి అల్లుకుని,తన ఒడిలో మనకు స్వాంతన అందిస్తుంది. నేను రోజుకు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు తోటలో గడుపుతాను, కానీ దాని పరిమళం ప్రతి క్షణం నన్ను వెన్నాడుతూనే ఉంటుందంటారు లీలారవి తన్మయంగా. చివరకు గోరింటాకు కూడా మాఇంట్లోదే పెట్టుకుంటానని ఆనందంగా చెప్పే లీలారవి చేతినే కాదు తన జీవితాన్ని కూడా నిండుగా పండించుకుంటున్నారు. అసలామె జీవితాన్ని తరిచి చూస్తే, ఒక లైఫ్‌ను ఎంత రంగులమయంగా, మరెంత ఆనందంగా జీవించవచ్చో తెలుస్తుంది.

–కె.క్రాంతికుమార్‌రెడ్డి, 9603214455
నేచర్స్‌వాయిస్



**లీలారవి ఇంటిని అల్లుకుంటున్న మొక్కలు**

**కూరగాయలు:** వంగ, బెండ, గోరుచిక్కుడు, కాప్సికం,మిరప, టమాటా
**తీగజాతులు:** పొట్ల (2రకాలు),సొర, బీర, కాకర, చిక్కుడు, దోస
**దుంపజాతులు:** చామ, పసుపు, అల్లం
**ఔషధ మొక్కలు:** ఇన్సులిన్, వాము, కలబంద, సబ్జ (థాయ్ బాసిల్), పుదీనా, తులసి, నిమ్మగడ్డి
**ఆకుకూరలు:** పాలకూర, తోటకూర, గోంగూర, మెంతికూర, బచ్చలి, కరివేపాకు, కొత్తిమీర
**పండ్ల మొక్కలు:** సపోటా అరటి (కర్పూరకేళి), జామ, దానిమ్మ, నిమ్మ
**పూల మొక్కలు:** చామంతులు (15రకాలు), గులాబీలు(13రకాలు), మందార(5రకాలు), దేవగన్నేరు(3రకాలు), దేవకాంచనం, శంఖుపుష్పం(3రకాలు), గన్నేరు, పెంటాస్ (3రకాలు), టెక్సాసేజ్, మల్లె,చుక్కమల్లె, దొంతర మల్లె (మైసూర్ మల్లె), డబుల్ మల్లె, సింగిల్ పెటల్ మల్లె, సన్నజాజి, విరజాజి, చమేలి, గరుడవర్ధనం, కమలం, పత్తిమందారం, జర్బరా (3రకాలు), కాస్మోస్(2రకాలు), బిళ్లగన్నేరు, కలోంచి, లిమోనియా, గార్లిక్ వైన్, ఆర్కిడ్స్, లాబ్‌క్లాస్టర్, క్లెమిటిస్ (బ్రైడల్ బొకే), రెయిన్ లిల్లీస్ (3రకాలు), గ్రాఫ్టో, సెంటుమల్లె, అల్మండా, అల్బా, తామర, కలువ, రజనీగంధ, బ్రహ్మకమలం, ఫైర్‌క్రాకర్స్, బోగన్‌విల్లియా(5రకాలు), బెగోనియా, రైల్వేక్రీపర్, నీలిగోరింట(పింక్,వయోలెట్), కెన్నా (మెట్టతామర), రైల్వే క్రీపర్), మే ఫ్లవర్, స్కార్లెట్ మిల్క్‌వీడ్, కింగ్స్ మాంటిల్, నిత్య మల్లి (2రకాలు), నీలాంబరం (నీలి కనకాంబరం)



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ దర్గా బజార్‌లో జాతీయ పతాకాలతో సంబురాలు జరుపుకొంటున్న ముస్లింలు



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ బాలికల హైస్కూల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలకు రిహార్సల్స్ నిర్వహిస్తున్న విద్యార్థినులు



# బాలాకోట్ వీరుడు అభినందన్‌కు వీర్‌చక్ర

సైన్యంలో పనిచేసి మరణించిన ప్రకాశ్ జాదవ్‌కు కీర్తిచక్ర

బాలాకోట్ దాడిలో పాల్గొన్న వారిలో ఐదుగురిని వరించిన పురస్కారాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** పుల్వామా ఉగ్ర దాడికి ప్రతీకారంగా పొరుగుదేశం పాకిస్థాన్‌పై భారత్ జరిపిన వైమానిక దాడి సందర్భంగా అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను 'వీర్‌చక్ర' అవార్డు వరించింది. యుద్ధకాలంలో శౌర్యాన్ని ప్రదర్శించిన వారికి పరమ వీరచక్ర, మహా వీర చక్ర, వీరచక్ర అవార్డులను ప్రభుత్వం అందజేస్తుంటుంది. వీటిలో మూడోదైన వీరచక్ర అవార్డు అభినందన్‌ను వరించింది. ఇక సైన్యంలోని రాష్ట్రీయ రైఫిల్ విభాగంలో పనిచేసి మరణించిన ప్రకాశ్ జాదవ్‌కు శాంతికాలంలో ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'ను ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి 27న పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో భారత్ జరిపిన వైమానిక దాడి సందర్భంగా ఫ్లైయిట్ కంట్రోలర్‌గా పనిచేసిన స్క్వాడ్రన్ నాయకుడు మింటి అగర్వాల్‌ను 'యుద్ధ్ సేవా' మెడల్ వరించింది. మొత్తానికి వాయుసేనకు 13 అవార్డులు రాగా.. అందులో ఐదు యుద్ధ్ సేవా మెడల్స్, ఏడు వాయుసేన మెడల్స్ ఉన్నాయి. బాలాకోట్ దాడిలో పాల్గొన్న వారిలో ఐదుగురికి పురస్కారాలు లభించడం విశేషం. సైన్యానికి ఎనిమిది శౌర్యచక్ర అవార్డులు, 98 సేనా మెడల్స్ లభించాయి. నౌకాదళానికి ఒక శౌర్యచక్ర అవార్డు లభించింది. వర్ధమాన్‌కు వీరచక్ర అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉన్నదని వైమానిక దళానికి చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. పుల్వామా ఉగ్రదాడి అనంతరం ఫిబ్రవరి 27న పాకిస్థాన్‌లోని బాలాకోట్ ఉగ్రస్థావరం లక్ష్యంగా భారత వైమానిక దళం దాడికి దిగింది. ఈ సందర్భంగా వింగ్ కమాండర్ అయిన అభినందన్ వర్ధమాన్ పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 విమానాన్ని కూల్చాడు. తర్వాత ఆయన నడుపుతున్న విమానాన్ని పాక్ సైనికులు కూల్చి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత వర్ధమాన్‌ను పాకిస్థాన్ వదిలిపెట్టింది. త్రివిధ దళాల్లో పనిచేసే వారు ప్రదర్శించే ధైర్య సహసాలకుగాను ఈ అవార్డులను భారత ప్రభుత్వం పంద్రాగస్టు సందర్భంగా ప్రకటించింది.

## స్వీట్లు పంచుకోవడానికి ఇష్టపడని పాక్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** శుభ కార్యక్రమాల సందర్భంగా స్వీట్లు పంచుకొనే సంప్రదాయానికి పాకిస్థాన్ స్వస్తి పలికింది. మొన్న బక్రీద్ పండుగ రోజు సరిహద్దు వద్ద మిఠాయిలు పంచుకోవడానికి ఇష్టపడిని పాక్.. బుధవారం ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మన బీఎస్‌ఎఫ్ జవాన్లు పాక్ సైనికులకు స్వీట్లు ఇవ్వడానికి ప్రయత్నించగా ముందుకు రాలేదు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దుచేయడాన్ని జీర్ణించుకోలేని పాక్ తరుచుగా ఏదో ఒకరూపంలో నిరసన తెలుపుతున్నది.

# వరద విలయం!

- దేశంలో ఏటా సర్వసాధారణంగా మారిన వరదలు
- గత మూడేండ్లలో 6000 మందికి పైగా మృతి
- వరదల నియంత్రణలో ప్రభుత్వ వ్యవస్థలు విఫలం
- నియంత్రణ కంటే పరిహారానికే ఎక్కువ వ్యయం

**న్యూఢిల్లీ:** దేశంలోని పలు రాష్ట్రాల్లో వరదలు విలయం సృష్టిస్తున్నాయి. నెల కిందట అసోం, బీహార్‌లలో వరదల బీభత్సాన్ని మరువక ముందే, తాజాగా దక్షిణ, పశ్చిమ భారతదేశంలోని పలు రాష్ట్రాలు కుండపోత వర్షాలతో వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. కేరళ, కర్ణాటక, గుజరాత్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. లక్షల హెక్టార్లలో పంట నీటమునిగింది. లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత రాష్ట్రాలు, వరదలు సంభవించడానికి గల కారణాలను పరిశీలిద్దాం..

**ఎందుకీ విలయం?**

తక్కువ వ్యవధిలో కుండపోత వర్షాలు కురువడం, నీటిపారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండడం, రిజర్వాయర్ నియంత్రణకు ప్రణాళిక లేకపోవడం, వరద నియంత్రిత వ్యవస్థల వైఫల్యం కారణంగానే వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల నియంత్రణ కంటే వరదల అనంతరం నష్ట పరిహారానికే ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో వెచ్చిస్తున్నది. విపత్కర వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనావేసేందుకు ప్రభుత్వ సంస్థలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉన్నది. విచ్చలవిడి మైనింగ్, క్వారీయింగ్ (ప్రత్యేకించి పర్వత ప్రాంతాల్లో).. కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయి. నదీతలాల్లో ఇసుక మైనింగ్ కారణంగా వరద ప్రభావిత ప్రాంతాలు పెరుగుతున్నాయి. 2017 కాగ్ నివేదిక ప్రకారం.. వరదల అంచనా కోసం 219 టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచించగా, కేవలం 56 మాత్రమే ఏర్పాటుచేశారు. అందులోనూ 60 శాతం కేంద్రాలు పనిచేయకపోవడం గమనార్హం.

**మూడేండ్లలో 6,585 మంది మృతి..**

దేశంలో ఏటా వరదలు సంభవించడం సర్వసాధారణమైంది. దేశంలోని దాదాపు 15 శాతం భూభాగం వరద ముంపునకు గురవుతున్నది. గత నెలలో బీహార్, అసోంలో సంభవించిన వరదల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, కోటి మందికిపైగా ప్రభావితమయ్యారు. ఈ ఏడాది జూలై 18న కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు సమర్పించిన గణాంకాల ప్రకారం.. తుఫాన్‌లు, వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి వర్ష సంబంధిత ప్రకృతి విపత్తుల కారణంగా దేశంలో గత మూడేండ్లలో 6,585 మంది ప్రాణాలు కోల్పోయారు. అంటే సగటున ఏడాదికి 2000 మందికిపైగా మృతిచెందారు. సెంట్రల్ వాటర్ కమిషన్ గణాంకాల ప్రకారం దేశంలో 1953-2017 మధ్య కాలంలో వర్షాలు, వరదల కారణంగా లక్ష మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.



మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో వరద బీభత్సం (ఫైల్)

**దేశవ్యాప్తంగా వరద మృతులు**

2016-17 : 1550
2017-18 : 2494
2018-19 : 2045
2019-20 : 496 (జూలై 18 వరకు)

**ధ్వంసమైన ఇండ్లు**

2016-17 : 5.5 లక్షలు
2017-18 : 11.9 లక్షలు
2018-19 : 15.6 లక్షలు
2019-20 : 6 లక్షలు(జూలై 18 వరకు)

### తాజా వరదల పరిస్థితి ఇదీ..

**● కేరళ.. మృతుల సంఖ్య: 95**

కుండపోత వర్షాలతో ఉత్తర, మధ్య కేరళలోని 14 జిల్లాల్లో వరదలు ముంచెత్తాయి. అలాగే భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో కనీసం 83 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు 2.5 లక్షల మందిని ప్రభుత్వం సహాయక శిబిరాలకు తరలించింది.

**● కర్ణాటక.. మృతుల సంఖ్య: 54**

కర్ణాటకలోని తీరప్రాంత, ఉత్తర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. సుమారు 5 లక్షల మందిని ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 4.2 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

**● గుజరాత్.. మృతుల సంఖ్య: 31**

మధ్య గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతాలను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. వడోదరలోనే 24 గంటల వ్యవధిలో 50 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్డు, రైలు, విమాన సర్వీసులు స్తంభించిపోయాయి. విమానాల ద్వారా వందలాది మందిని వాయుసేన సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

**● ఉత్తరాఖండ్.. మృతుల సంఖ్య: 6**

ఉత్తరాఖండ్‌లో ప్రత్యేకించి చమోలీలో కుంభవృష్టి కురిసింది. కొండ చరియలు విరిగిపడడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు.

**● మహారాష్ట్ర.. మృతుల సంఖ్య: 48**

కుండపోత వర్షాలతో మహారాష్ట్ర అతలాకుతలం అయింది. పుణే సహా 10 జిల్లాలను వర్షాలు ముంచెత్తాయి. భారీ వర్షాలతో ముంబై మహానగరం విలవిల్లాడింది. కొల్హాపూర్, సంగ్లి జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 4.5 లక్షల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. వరదల కారణంగా ముంబై- బెంగళూరు జాతీయ రహదారిని మూసివేయడంతో వేలాది వాహనాలు నిలిచిపోయాయి.

# వైద్యవిద్యకు ప్రాధాన్యం

- ప్రత్యేకంగా దృష్టిసారించిన తెలంగాణ ప్రభుత్వం
- రాష్ట్రం ఏర్పడ్డాక 5 వైద్యకళాశాలలు ప్రారంభం
- మరో రెండు కాలేజీల కోసం కేంద్రానికి ప్రతిపాదన




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సర్కారు దవాఖానాల ద్వారా ప్రజలకు విస్తృతంగా వైద్యసేవలను అందించడమే కాకుండా భవిష్యత్ తరాలకు ప్రతిభావంతులైన వైద్యులను అందించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం వైద్యవిద్యకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నది. వైద్యవృత్తిని చేపట్టాలన్న విద్యార్థుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని వైద్య కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ఇందుకోసం వినూత్న విధానాలను అవలంబిస్తుండటంతో ప్రభుత్వ వైద్య కళాశాలలు మెరుగుపడటంతోపాటు ఏటా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య కూడా పెరుగుతున్నది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక తెలంగాణలో కొత్తగా 5 వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు రాష్ట్రంలో ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. కొత్తగా మరో రెండుచోట్ల వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదించారు. అంతేకాకుండా విద్యార్థులకు బోధకుల కొరత ఉండకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్య బోధకుల పదవీ విరమణ వయసును 58 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు పెంచింది.

**రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలు**

రాష్ట్రంలో ప్రస్తుతం 10 ప్రభుత్వ వైద్య కళాశాలలున్నాయి. వీటిలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ, రిమ్స్ వైద్యకళాశాలలు ఉమ్మడి రాష్ట్రంలోనే ఉండగా.. 2013-14 విద్యాసంవత్సరంలో నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2016-17 విద్యాసంవత్సరంలో మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల, హైదరాబాద్‌లో ప్రభుత్వ ఈఎస్‌ఐ వైద్య కళాశాలను , 2018-19 విద్యాసంవత్సరంలో సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలను, 2019-20 విద్యాసంవత్సరంలో నల్గొండ, సూర్యాపేట వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,450కు పెరిగింది.

**సేవల వినియోగానికే వయోపరిమితి పెంపు**

తెలంగాణలోని పేద విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాలలను పటిష్ఠం చేస్తున్నం. రాష్ట్రంలో వైద్యసేవల అవసరాలకు అనుగుణంగా వైద్యుల సంఖ్య పెరుగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దీనికోసం వైద్య కళాశాలల్లో నాణ్యమైన బోధన అందించగలిగే అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ల సేవలు అవసరమున్నందున సీఎం కేసీఆర్ టీచింగ్ హాస్పిటల్స్‌లో పనిచేసే ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసును 65 ఏండ్లకు పెంచారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రంతో పోరాడి ఎయిమ్స్‌సహా ఇప్పటివరకు ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలను సాధించుకున్నది. కొత్తగా ఖమ్మం, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరాం. ఈ విజ్ఞప్తికి కేంద్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ సానుకూలంగా స్పందించారు.

**- ఈటల రాజేందర్, వైద్యారోగ్యశాఖ మంత్రి**



కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు

## అదుపుతప్పిన స్కూల్ బస్సు

ఆరుగురు విద్యార్థులకు గాయాలు.. కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో ఘటన

**లింగంపేట:** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలకేంద్రంలో ఓ స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. కామారెడ్డి గౌతమి మోడల్ పాఠశాలకు చెందిన బస్సు ఉదయం తాడ్వాయి మండలంలోని దేమికలాన్ గ్రామంలో విద్యార్థులను తీసుకుని కామారెడ్డికి బయలుదేరింది. బస్సు తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సులో 32 మంది విద్యార్థులు ఉండగా.. ఆరుగురికి గాయాలయ్యాయిజ డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. గాయపడ్డవారిని చికిత్సనిమిత్తం 108 అంబులెన్స్‌లో కామారెడ్డి సర్కార్ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.



కపిల నదిలోకి దూకుతున్న వెంకటేశ్ మూర్తి.. బయటకు వచ్చాక మీడియాతో మాట్లాడుతున్న దృశ్యం

## మృత్యుంజయుడు ఆ వృద్ధుడు

కర్ణాటకలో కపిల నది వరదలోకి దూకి ఈదుకుంటూ రావాలని సాహసకృత్యం

రెండ్రోజుల తర్వాత సురక్షితంగా బయటకు..

**బెంగళూరు, ఆగస్టు 14:** ఇటీవలి వర్షాలతో పోటెత్తిన వరదల వల్ల కర్ణాటకలో వేల మంది సహాయ శిబిరాల్లో తల దాచుకుంటే 60 ఏండ్ల వృద్ధుడు మాత్రం సాహసం చేశాడు. నంజన్‌గూడ్ పట్టణ వాసి అయిన వెంకటేశ్ మూర్తి అనే వృద్ధుడు శనివారం ఉదయం పోటెత్తిన కపిల నది వరదలోకి దూకాడు. అంతటి వరదలోనూ ఈదుకొని బయటకు రావడం ఆయన లక్ష్యం. ఈ సారి కపిల నదిలో ఆయన దూకుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఆయన బయటపడటం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యా యి. అనూహ్యంగా సోమవారం వరద నీటి నుంచి ఆ వృద్ధుడు సురక్షితంగా బయటకు రావడం స్థానికులను ఆశ్చర్యపరిచింది. 'అవును. ఆయన ప్రాణాలతోనే ఉన్నారు. సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు' అని నంజన్‌గూడ్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. వెంకటేశ్ మూర్తి సురక్షితంగా తిరిగి రావడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని అతడి సోదరి మంజుల చెప్పారు. అతడు తిరిగి వస్తాడని విశ్వాసంతో ఉన్నా, రెండు రోజులుగా కనిపించకపోవడం ఆందోళనకు గురయ్యానన్నారు. గత 25-30 ఏండ్లుగా ఆయన ఇటువంటి సాహసాలు చేస్తూనే ఉన్నారని, వరద నీటిలో దూకిన ప్రతిసారి అర్ధగంటలోపే తిరిగి బయటకు వచ్చేసేవాడని చెప్పారు. ఈ దఫా హెజ్జిగె వంతెన స్తంభం వద్ద చిక్కుకోవడంతో రెండు రోజుల పాటు అక్కడే ఉండిపోయాడు. వంతెనపై నుంచి అతడ్ని గమనించిన కొందరు తాడుతో రక్షించడానికి ప్రయత్నించారు. సాధారణంగా వంతెన స్తంభాల మధ్య నుంచి ఈదుకుంటూ వెళ్తానని, ఈ దఫా అక్కడ కొన్ని కలుపు మొక్కల మధ్య చిక్కుకున్నానని వెంకటేశ్ చెప్పాడు. 60 గంటల తర్వాత వరద తగ్గుముఖం పట్టడంతో వంతెనపైకి పాకుతూ వచ్చాడు. కొన్నేండ్ల క్రితం ఆయన సైకిల్‌పై కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 10 వేల కి.మీ. పొడవునా దేశ పర్యటన చేశారు.

### ఎంఎస్‌ఎంఈ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ప్లానింగ్ అండ్ ప్రమోషన్ ఆఫ్ ఎంఎస్‌ఎంఇ' పేరుతో ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే శిక్షణా కార్యక్రమానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్‌లోని ఎంఎస్‌ఎంఈ క్యాం పస్ సూచించింది. సంస్థలు, బ్యాంకు లు, శాఖలు, ఏజెన్సీల సిబ్బందికి ఈ శిక్షణ పొందే అర్హత ఉంటుంది.

### ఏపీ విద్యార్థికి అమెరికాలో ఏడాది జైలు

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** ఏపీకి చెందిన ఓ విద్యార్థికి అమెరికాలో ఏడాది జైలుశిక్ష, రూ.41.75 లక్షల (58,471 డాలర్ల) జరిమానా విధించారు. న్యూయార్క్‌లోని అల్బనీలో తాను చదువుతున్న కళాశాలలో 66 కంప్యూటర్లను ఉద్దేశపూర్వకంగా చెడిపోయేలాచేసిన నేరానికి ఈ శిక్ష పడినట్టు ఓ వార్తా సంస్థ తెలిపింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఆకుతోట విశ్వనాథ్ 2015 నుంచి విద్యార్థి వీసాపై అమెరికాలో ఉంటున్నాడు. సెయింట్‌రోస్ కాలేజీలోని 66 కంప్యూటర్లకు 'యూఎస్‌బీ కిల్లర్' పెట్టాడని, దీనివల్ల ఆ పరికరాలు దెబ్బతిన్నట్టు గత ఫిబ్రవరిలోనే అభియోగం నమోదైంది. అదేనెల 22న విశ్వనాథ్‌ను పోలీసులు అరెస్టుచేశారు. విచారణ అనంతరం జైలు శిక్ష విధించింది. 'యూఎస్‌బీ కిల్లర్'ను యూఎస్‌బీ పోర్టులో పెట్టడం ద్వారా కంప్యూటర్లలోని ఎలక్ట్రానిక్ విడిభాగాలకు విద్యుత్ ప్రవాహం హెచ్చుతగ్గులకు లోనై దెబ్బతినే ప్రమాదం ఉన్నది.




జగిత్యాల ఎస్కేఎన్నార్ డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట ఏపుగా పెరిగిన చెట్లు



ఎస్కేఎన్నార్ కళాశాలలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు

# హరితక్షేత్రం.. ఎస్కేఎన్నార్ కళాశాల

- 20 ఎకరాల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలు
- పచ్చదనంతో ఆహ్లాదకరంగా వాతావరణం
- ఆదర్శంగా ఇన్‌స్టిట్యూట్ ప్లాంటేషన్

**నమస్తే తెలంగాణ, జగిత్యాల ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న హరితహారం స్ఫూర్తితో జగిత్యాల ఎస్కేఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో చేపట్టిన ఇన్‌స్టిట్యూట్ ప్లాంటేషన్ ఆదర్శంగా నిలుస్తున్నది. జిల్లా కేంద్రంలోని ఈ కళాశాల మైదానంలోని 20 ఎకరాల్లో మూడో విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద పూలు, పండ్లు, నీడనిచ్చే వివిధ రకాల ఆరు వేల మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు ఈజీఎస్ (ఉపాధి హామీ) సిబ్బంది కృషిచేస్తున్నారు. గతంలో కళాశాల మైదానం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండి ఉండేది. కలెక్టర్ శరత్ చొరవ తీసుకొని ఈజీఎస్ సిబ్బంది, కూలీలతో 20 ఎకరాల మైదానాన్ని చదును చేయించారు. అనంతరం మూడోవిడుత హరితహారంలో భాగంగా క్రమ పద్ధతిలో మొక్కలునాటారు. ఉద్యానవనశాఖతో అనుసంధానంతో చేయడతో ఈ మొక్కలకు డ్రిప్ పైప్‌లైన్ ద్వారా నీరు అందిస్తున్నారు. ప్రతి 200 మొక్కలకు నీరుపోయడం, కలుపుతీయడం, పాదులు చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఒక్కో మొక్కకు ఈజీఎస్ (ఉపాధి హామీ) నిధుల నుంచి నెలకు రూ.5 చొప్పున చెల్లిస్తున్నారు. మొక్కలను పశువులు తినకుండా చుట్టూ కంచె ఏర్పాటుచేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మొక్కలకు సహజ ఎరువులు, కలుపు తీయడం, సంరక్షణకు తగిన మందులను ఉపయోగిస్తున్నారు. కళాశాల సిబ్బంది తమవంతు సహకారం అందిస్తుండటంతో ఇప్పుడు ఆ ప్రాంతమంతా హరితవనంగా మారింది.

**పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు**

మూడోవిడత హరితహారంలో భాగంగా ఈ కళాశాలలోని 20 ఎకరాల మైదానంలో వివిధ రకాల పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను నాటారు. వీటిలో మామిడి, ఉసిరి, జామ, అల్ల నేరేడు, దానిమ్మ, సీతాఫలం, సపోటా, ఖర్జూర, బాదం తదితర పండ్ల మొక్కలతో పాటు మందారం, గుల్‌మోహర్ తదితర పూలమొక్కలు నాటారు. సీమరూప, చైనా బాదాం, టేకు, వెదురు, నారవేప, నీలగిరి, ఏడు ఆకులపాయతో పాటు, తాటి, ఈత, నీడ నిచ్చే మొక్కలను ఏర్పాటు చేశారు. వెయ్యి మామిడి మొక్కలు, 500 టేకు మొక్కలలతో మామిడి, టేకు వనాన్ని ఏర్పాటుచేశారు.

**ప్లాంటేషన్‌కు ప్రశంసలు**

ఎస్కేఎన్నార్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంకవర్గీస్ గతంలోనే కితాబిచ్చారు. రాష్ట్రంలో తాను పరిశీలించిన ప్లాంటేషన్లలో ఈ ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ గొప్పగా ఉన్నదని కొనియాడారు. కలెక్టర్ శరత్ ఆధ్వర్యంలో ఈ కాలేజీలో మూడోవిడత హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలకు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ప్రశంసలు దక్కాయి.


నితిన్, శర్వానంద్

# యువ హీరోలకు శర్వా ఆదర్శం!

'యువ హీరోలకు శర్వానంద్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎవరి ప్రోత్సాహం లేకపోయినా హీరోగా అత్యున్నత స్థాయికి చేరుకున్నాడు' అన్నారు నితిన్. శర్వానంద్ హీరోగా నటించిన చిత్రం 'రణరంగం'. సుధీర్‌వర్మ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో నితిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ 'వినూత్నమైన స్క్రీన్‌ప్లేతో సుధీర్‌వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమా చూసిన వారంతా బాగుందని అంటున్నారు. ప్రేక్షకులు అదే అనుభూతికి లోనవుతారనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌వర్మ, కల్యాణి ప్రియదర్శన్, సూర్యదేవర నాగవంశీ, పీడీవీ ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అడివి శేష్

**''క్షణం' తరువాత 55 కథలు విన్నాను. అందులో ఏ కథ నన్ను సంతృప్తిపరచలేదు. ఓ సగటు ప్రేక్షకుడిగా నాకు నచ్చిన చిత్రాలు చేస్తున్నాను. థియేటర్‌లో పాప్‌కార్న్ తింటూ సినిమాను ఎంజాయ్ చేయాలన్నదే నా ప్రధాన ఉద్దేశం' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఎవరు'. వెంకట్ రాంజీ దర్శకుడు. పీవీపీ నిర్మించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా యువ హీరో అడివి శేష్ బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.**

# ఆ పరాజయం పాఠాన్ని నేర్పింది!

**'ఎవరు' ఎలాంటి సినిమా?**

• ట్రైలర్ చూసిన వాళ్లకి ఇదొక క్రైమ్ థ్రిల్లర్ అనిపిస్తుంది. ఓ క్రైమ్ జరుగుతుంది. అది ఎవరు చేశారు?. ఎందుకు చేశారు అనే నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది.

**సినిమాపై మంచి నమ్మకంతో వున్నట్టున్నారు?**

• 'ఎవరు' ఓ డీసెంట్ ఫిల్మ్. సినిమా నాణ్యత పరంగా ఉన్నతంగా వుంటుంది. అలా అని సినిమాలో ఎలాంటి అసభ్యకరమైన సన్నివేశాలు లేవు. 70 శాతం చిత్రీకరణ పూర్తయిన దగ్గరి నుంచి మళ్లీ మళ్లీ చూసుకుంటూ రీషూట్‌లు చేస్తూ వచ్చాం. ఈ విధానాన్ని 'క్షణం', గూఢచారి చిత్రాలకు అనుసరించాం. మంచి ఫలితాల్ని సాధించాం. అందుకే ఈ చిత్రానికి కూడా అదే పంథాను అనుసరించి సినిమా సంతృప్తికరంగా వచ్చే వరకు రీషూట్‌లు చేశాం.

**వరుసగా థ్రిల్లర్స్‌నే ఎంచుకుంటున్నట్టున్నారు?**

• 'క్షణం' ఓ థ్రిల్లర్. 'అమీ-తుమీ' కామెడీ ఎంటర్‌టైనర్. గూఢచారి ఓ మిషన్ ఇంపాజిబుల్ తరహా చిత్రం. కానీ అది థ్రిల్లర్ కాదు. 'క్షణం' ఓ ఎమోషనల్ థ్రిల్లర్. నేను నటించిన ఏ చిత్రాన్ని రెండవ సారి మా అమ్మ చూడలేదు. కానీ 'క్షణం'లోని భావోద్వేగాలు ఆకట్టుకోవడంతో ఐదు సార్లు చూశారు. సినిమా చూసిన తరువాత 'ఏడిపించేశావురా' అన్నారు. మన ఇండియన్స్‌కి భావోద్వేగాలు ముఖ్యం. నేనూ అదే నమ్మాను. నా సినిమాల్ని ఓ వర్గం ప్రేక్షకులు మాత్రమే కాకుండా అందరి అభిమానులు చూడాలనుకుంటాను.

**ఒక సినిమా ఎలా వుండాలి? ఎలా వుండకూడదో తెలుసుకున్నాను అన్నారు. ఆ మార్పుకి కారణం?**

• ప్రతి మనిషిలో ప్లస్, మైనస్ అనేవి వుంటాయి. 'కిస్' సినిమాకు ముందు చాలా మంది హీరో అంటే ఇలా వుండాలి. కమర్షియల్‌గా ఆలోచించాలి. అని నా మైండ్‌లో విషాన్ని నింపారు. అయితే ఆ తరువాత అదంతా అబద్ధమని తెలుసుకున్నాను. మన మనసుకు నచ్చింది చెయ్యాలని. ఈర్ష్యతో కాకుండా మంచి మనసుతో ఆలోచిస్తే మంచి జరుగుతుంది. మంచి కథలొస్తాయి. థియేటర్‌లో కూర్చుని పాప్‌కార్న్ తింటూ సినిమాని ఎంజాయ్ చేసే సాధారణ ప్రేక్షకుడిని నేను. ఏ సినిమాని కూడా విమర్శనాత్మ ధోరణితో చూడను. అదే నా బలం అని నమ్ముతాను. సినిమా నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని చెప్పేస్తాను. 'ఎవరు' నా దృష్టిలో డీసెంట్ సినిమా. ఈ చిత్రాన్ని దాదాపు వెయ్యి మందికి చూపించాం. అందులో వెన్నెల కిషోర్ కూడా సినిమా చూశాడు. తెరమీద ఎంత ఫన్నీగా వుంటాడో తెరవెనుక అంత ఇంటలీజెంట్. అంతర్జాతీయ సినిమాల పట్ల కిషోర్‌కు మంచి నాలెడ్జ్ వుంది. తను సినిమా చూసి 'భలే కథ పట్టావ్ నెక్స్ట్ లెవెల్ సినిమా ఇది' అని నన్ను ఆత్మీయంగా కౌగిలించుకున్నాడు. అతనే నా తొలి విమర్శకుడు.

**• సపోర్ట్ లేకుండా పైకి రావడం ఎవరికైనా అసాధ్యమే. కొంత మందికి తల్లిదండ్రులు సపోర్ట్‌గా నిలవొచ్చు. మరి కొంత మందికి పెద్ద నిర్మాతని కలిపించిన వాచ్‌మెన్ కావచ్చు. మీడియాతో పాటు నన్ను చిత్ర పరిశ్రమలోని చాలా మంది సపోర్ట్ చేశారు. మనం ఎలాంటి ఈగోలకు పోకుండా నిజాయితీగా వుంటే మనకు మంచే జరుగుతుంది.**

**మీలో ఈ ఆలోచనా ధోరణి ఎప్పటి నుంచి మొదలైంది?**

• 'కిస్' నా కెరీర్‌లో అతిపెద్ద డిజాస్టర్. ఈ సినిమా పరాజయంతో పాటు నాకో విలువైన పాఠాన్ని నేర్పింది. ఈ సినిమా పోస్టర్లకు వాడిన మైదాపిండి ఖర్చుకూడా రాలేదు. సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను 'కిస్' సినిమాతో రెండు కోట్లు పోగొట్టుకున్నాను. ఆ సినిమా ఇచ్చిన షాక్‌తో హడలిపోయాను. ఆ సమయంలో నేను ఉంటున్న ఫ్లాట్‌కి పదివేలు అద్దె కట్టడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. ఆ సమయంలో షేక్‌పేట్ నుంచి మెహదీపట్నం నడుచుకుంటూ వెళ్లాను. ఓ కార్ల షోరూమ్ దగ్గర ఆగాను. నాకు ఆ షోరూమ్‌లోని ఓ కారు నచ్చింది. నన్ను గమనించిన షోరూమ్ మేనేజర్ 'మీరు పంజా'లో నటించారు కదా రండిసార్ లోపలికి' అన్నాడు. కానీ నా దగ్గర ఆ కార్ బుక్ చేయడానికి అడ్వాన్స్ డబ్బులు లేవు. అయినా ఈ కార్‌ని బుక్ చేయోచ్చా' అన్నాను. తను ఓకే అనగానే అప్పుడు అనిపించింది. నాలో ఏదో వుంది దాన్ని కరెక్ట్‌గా బయటికి తీయాలి అనుకున్నాను. అలా సినిమాల విషయంలో నా ఆలోచనా విధానాన్ని మార్చుకున్నాను.

**మహేష్‌బాబు నిర్మాణంలో నటిస్తున్న 'మేజర్' ఎలా వుంటుంది?**

• సెప్టెంబర్ 11 ముంబాయి దాడిలో మరణించిన ఉన్నికృష్ణన్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. శశి కిరణ్ తిక్క దర్శకుడు. మహేష్ బాబుతో కలిసి సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సెప్టెంబర్ నుంచి చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఆ తరువాత 'గూఢచారి-2' వుంటుంది.

**'టూ స్టేట్స్' రీమేక్ అపేయడానికి కారణం?**

• కథ అనుకున్న స్థాయిలో లేదు. కొంత షూటింగ్ చేసిన తరువాత బాగా రావడం లేదని ఆపేశాం. నేను కమిట్ అయిన చిత్రాలు పూర్తయిన తరువాత ఇదే టీమ్‌తో శివాత్మికతో కలిసి ఓ సినిమా చేయబోతున్నాను.








